**విలేకరులు కావలెను**

కర్నూలు నుండి వెలువడుతున్న 'విజయ సారథి' తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అనుభవం ఉన్న విలేకరులు కావలెను.. తెలుగు రాష్ట్రాలలోని అన్ని జిల్లాలు మరియు అన్ని మండల కేంద్రాలలో స్థానిక సమస్యలపై పోరాడేందుకు ఆసక్తి ఉన్న రిపోర్టర్లు వెంటనే సంప్రదించండి.. సెల్ నెం: 9700370499

సీనియర్ జర్నలిస్ట్, ఎడిటర్ : పి.వెంకటేశ్వర్లు



# విజయ సారథి

RNI / APTEL/2015/64956

తెలుగు దినపత్రిక



**టీవీ రిపోర్టర్లు కావలెను**

రెండు తెలుగు రాష్ట్రాలలో సంచలనం సృష్టిస్తున్న విజన్ టీవీలో రిపోర్టర్లు & వీడియో గ్రాఫర్లు, కెమెరామెన్లు కావలెను. ఆసక్తి ఉన్నవారు వెంటనే సం॥ సెల్ నెం: 9700370499

యండి. పి.వెంకటేశ్వర్లు



చీఫ్ఎడిటర్: పేరపోగు వెంకటేశ్వర్లు | శనివారం 08-03-2025 | సంపుటి : 11 | సంచిక : 55 | పేజీలు : 8 | వెల : రూ 3-00

కర్నూలు, నంద్యాల, అనంతపురం, కడప, చిత్తూరు, తిరుపతి, ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, విజయవాడ, విజయనగరం, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి,శ్రీకాకుళం, కాకినాడ, విశాఖపట్నం, హైదరాబాద్.


## ఎపి కేబినేట్ పలు కీలక నిర్ణయాలు

**డీపీవోల కేడర్ క్రమబద్ధీకరణ ప్రతిపాదనకు ఆమోదం**

**పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రతిపాదనలకు ఓకే**

**ఏపీ ప్రైవేటు యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లుకు ఆమోదం**



అమరావతి,మార్చి7: డీపీవోల కేడర్ క్రమబద్ధీకరణ ప్రతిపాదనకు ఎపి కేబినెట్ ఆమోదం తెలిపింది. పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ ప్రతిపాదనలకు సైతం ఆమోదం తెలిపింది. డీపీవోలు నేరుగా రిపోర్టు చేసేలా కేడర్‌లో మార్పులపై కేబినెట్ నిర్ణయం తీసుకుంది. పౌరసేవలు నేరుగా ప్రజలకు అందేలా చూసేలా కేడర్‌లో మార్పులకు ఆమోదం ఇచ్చింది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన సచివాలయంలో జరిగిన ఆంధ్రప్రదేశ్ కేబినెట్ సమావేశం, అజెండాలోని 14 అంశాలకు ఆమోదముద్ర వేసింది. ముఖ్యంగా పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖలో డీపీవోలకు నేరుగా రిపోర్టు చేసేలా కేడర్‌లో మార్పు చేర్పుల నిర్ణయానికి కేబినెట్ ఆమోదం తెలిపింది.. కేడర్ రేషనలైజేషన్ పై ప్రభుత్వానికి ప్రతిపాదనలు సమర్పించింది పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధిశాఖ.. పౌరసేవలు నేరుగా ప్రజలకు అందేలా చూసేలా కేడర్ లో మార్పు చేర్పులకు నిర్ణయం తీసుకున్నారు.. ఇక, ఏపీ ప్రైవేటు యూనివర్సిటీల చట్ట సవరణ బిల్లు 2025పై ఉన్నత విద్యాశాఖ ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది..మరోవైపు, కుప్పం నియోజకవర్గంలో రూ.5 కోట్లతో డిజిటల్ హెల్త్ నెర్వ్ సెంటర్ ఏర్పాటుపై వైద్యారోగ్యశాఖ ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపింది.. సెంట్రల్ పూల్ లో 372 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టుల కోసం కేబినెట్ కు వైద్యారోగ్యశాఖ ప్రతిపాదనలు సమర్పించగా.. వాటికి ఆమోదముద్ర వేసింది.. పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేటలో ఎంఎస్ఎంఈ పార్క్ నిర్మాణం కోసం ఉచితంగా 27 ఎకరాల భూమి కేటాయించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపింది.. మరోవైపు, రాజమహేంద్రవరంలో వ్యవసాయ కళాశాల నిర్మాణానికి ఉచితంగా 10 ఎకరాల భూమి కేటాయింపునకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. గీతకులాలకు కేటాయించిన 335 మద్యం దుకాణాల్లో నాలుగు దుకాణాల్ని సొండి కులాల వారికి కేటాయిస్తూ చేసిన సవరణను ఆమోదించింది కేబినెట్ . 2024-29 ఏపీ టూరిజం ల్యాండ్ అలాట్మెంట్ పాలసీ ప్రతిపాదనలకు ఏపీ కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. ప్రైవేటు వర్సిటీల చట్టసవరణ బిల్లుపై ఉన్నత విద్యాశాఖ ప్రతిపాదనలకు ఆమోదం ఇచ్చింది. 372 సివిల్ అసిస్టెంట్ సర్జన్ పోస్టులకు వైద్యారోగ్యశాఖ ప్రతిపాదనకు ఆమోదం లభించింది. రాజమహేంద్రవరంలో వ్యవసాయ కళాశాల ఉచిత భూ కేటాయింపు ప్రతిపాదనకు ఆమోదం ఇచ్చింది. రాజమహేంద్రవరం పాత రైల్వే హ్యావలాక్ బ్రిడ్జి అభివృద్ధికి 116 ఎకరాల కేటాయింపునకు ఆమోదం ఇచ్చారు. మద్యం దుకాణాల్లో సొండి కులాలకు 4 షాపులు కేటాయింపునకు ఆమోదం దక్కింది. 2024-29 టూరిజం ల్యాండ్ అలాట్‌మెంట్ పాలసీ ప్రతిపాదనలకు ఆమోదం ఇచ్చారు.

## జనసేనలో వైసిపి మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు

**పవన్ కళ్యాణ్ సమక్షంలో పార్టీలో చేరిక**

అమరావతి,మార్చి7: వైసీపీలో ఉన్న కొందరు ఎంపీలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, కీలక నేతలు, ప్రజాప్రతినిధులు ఇలా.. చాలా మంది ఆ పార్టీకి గుడ్‌బై చెప్పి.. కూటమి పార్టీలో చేరుతున్నారు.. ఇప్పటికే టీడీపీ, జనసేన, బీజేపీలో పలువురు నేతలు చేరిపోయారు.. ఇక, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు కూడా జనసేనలో చేరిపోయారు.. గతంలోనే వైసీపీకి రాజీనామా చేసిన ఆయన.. ఈ నెల 3వ తేదీన కుటుంబ సభ్యులతో కలిసి జనసేన అధినేత, ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు.. ఈ




సందర్భంగా పెండెం దొరబాబు చేరికకు పవన్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో.. శుక్రవారం అధికారికంగా జనసేన తీర్థం పుచ్చుకున్నారు. పలువురు ప్రజాప్రతినిధులతో కలిసి పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన కండువా కప్పుకున్నారు..పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు.. ఆయనతో పాటు పలువురు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, స్థానిక నేతలు పవన్ కల్యాణ్ సమక్షంలో జనసేన పార్టీలో చేరారు.. మరికొందరు నేతలు.. కండువా కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు మంత్రి నాదెండ్ల మనోహర్.. కాగా, గత ఏడాది ఆగస్టులో వైసీపీకి రాజీనామా చేశారు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు.. రెండు మూడు నెలలుగా పరిస్థితులు మారాయని.. అందుకే వైసీపీకి రాజీనామా చేశానని ఆయన స్పష్టం చేశారు.. నియోజకవర్గ అభివృద్ధి కోసం పిఠాపురంలోనే ఉంటానని పేర్కొన్నారు. ఇక, తనకు వెన్నుపోటు రాజకీయాలు తెలియదని స్పష్టం చేశారు. నియోజకవర్గ ప్రజలు, అభివృద్ధి కోసం పిఠాపురంలోనే ఉంటానని పేర్కొన్నారు.. అనుచరులు, కార్యకర్తలతో చర్చించి త్వరలో నిర్ణయం తీసుకుంటామని చెప్పుకొచ్చారు.. ఆ తర్వాత పవన్ కల్యాణ్‌కు కలిసి జనసేనలో చేరికకు లైన్ క్లియర్ చేసుకున్న ఆయన.. తన అనుచరులతో కలిసి ఈ రోజు జనసేన గూటికి చేరారు.. ఇక, 2019 ఎన్నికల్లో పిఠాపురం నుంచి బరిలోకి దిగి విజయం సాధించారు దొరబాబు.. అయితే 2024లో జరిగిన ఎన్నికల్లో పిఠాపురం నుంచి జనసేనాని పవన్ కల్యాణ్ బరిలోకి దిగడంతో.. సిట్టింగ్ ఎమ్మెల్యేగా ఉన్న దొరబాబుకు వైఎస్ జగన్ టికెట్ నిరాకరించారు. పవన్‌పై పోటీగా వంగా గీతను బరిలోకి దింపారు.. కానీ, ఈ ఎన్నికల్లో పవన్ కల్యాణ్ గ్రాండ్ విక్టరీ కొట్టిన విషయం విదితమే. తాజా పరిణామాలతో పిఠాపురంలో ఎలాంటి రాజకీయ వాతావరణం ఉంటుందో వేచిచూడాలి.

## వైఎస్ వివేకా వాచ్‌మెన్ హత్యపై కేబినేట్‌లో సుదీర్ఘ చర్చ

**జగన్ కుట్రలపై అప్రమత్తంగా ఉండాలన్న సిఎం చంద్రబాబు**

**సాక్షులు వరుసగా చనిపోవడం వెనక కుట్ర ఉందన్న అనుమానం**





అమరావతి,మార్చి7: వాచ్‌మెన్ రంగన్న మృతి ముమ్మాటికీ అనుమానాస్పదమేనని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. వివేకా హత్య కేసులో సాక్షులు వరుసగా మృతి చెందడంపై ప్రభుత్వం అప్రమత్తం అయ్యింది. మిగిలిన వారికి రక్షణ కల్పించాలని సిఎం డిజిపిని ఆదేశించారు. మంత్రివర్గ సమావేశం అనంతరం మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో ప్రత్యక్ష సాక్షి వాచ్‌మెన్ రంగన్న మృతిపై సుదీర్ఘ చర్చ జరిగింది. వివేకా హత్యకేసు సాక్షులు ఒక్కొక్కరుగా చనిపోతున్న అంశంపై దాదాపు గంటపాటు చర్చ జరిగింది. రంగన్నను పోలీసులే చంపారంటూ తొలుత వార్తలు రావడంపై మంత్రివర్గంలో అనుమానాలు వ్యక్తమయ్యాయి. 'ఏ దురుద్దేశం లేకపోతే రంగన్న మృతిని పోలీసులకు ఎందుకు ఆపాదిస్తారు. రంగన్న మృతిని ప్రభుత్వానికి ఆపాదించాలనే కుట్ర ఉందని కొందరు మంత్రులు వ్యాఖ్యానించినట్టు సమాచారం. వివేకా కేసులో మరో సాక్షి దస్తగిరికి వచ్చిన బెదిరింపులపైనా చర్చ జరిగింది. వాచ్‌మెన్ మృతి వెనుక ఉన్న అనుమానాలను డీజీపీ.. మంత్రులకు వివరించారు. అనుమానాస్పద మృతేనని పోలీసుల విచారణలోనూ నిర్ధరణ అయిందన్నారు. ఈ సందర్భంగా సీఎం స్పందిస్తూ.. జగన్ కుట్రల పట్ల అప్రమత్తంగా ఉండాలని పదేపదే చెబుతూ వస్తున్నానని గుర్తు చేశారు. పరిటాల రవి హత్యకేసులోనూ సాక్షులు ఇలానే చనిపోతూ వచ్చారని పేర్కొన్నారు. అనుమానాలతో కేసును ఎలా ముందుకు తీసుకెళ్లాలనే అంశంపై చర్చించారు. కేసు సీబీఐ పరిధిలో ఉన్నా.. సాక్షులను రక్షించాల్సిన బాధ్యతపై మనపై ఉందని సీఎం అన్నారు. సాక్షుల అనుమానాస్పద మృతి దురదృష్టకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. వివేకా హత్య జరిగిన రోజు జగన్, భారతిలను హైదరాబాద్ నుంచి పులివెందులకు తీసుకొచ్చిన డ్రైవర్ కూడా చనిపోయిన అంశం ప్రస్తావనకు వచ్చింది. సుదూర ప్రయాణంలో జగన్, భారతీ వివేకా హత్యపై మాటల సంభాషణను డ్రైవర్ విన్నందునే తర్వాత అనుమానాస్పద మృతి చెందారని చర్చ జరిగింది. ఇలా ఇప్పటి వరకు ఆరుగురు చనిపోయారని ప్రస్తావనకు వచ్చింది.2019, మార్చి 15వ తేదీ తెల్లవారుజామున మాజీ మంత్రి వైఎస్ వివేకానందరెడ్డి.. తన నివాసంలో దారుణ హత్యకు గురయ్యారు. మరికొద్ది నెలల్లో ఎన్నికలు జరగనుండడంతో.. ఈ హత్య కేసు తెలుగు రాష్ట్రాల్లో సంచలనం సృష్టించింది. ఈ హత్య జరిగన సమయంలో వైఎస్ జగన్ ప్రతిపక్ష నేతగా ఉన్నారు. దీంతో ఈ హత్యను నాటి చంద్రబాబు ప్రభుత్వమే చేయించిందని మీడియాలో ప్రకటించారు. అంతేకాదు.. ఈ హత్య కేసును సీబీఐకి అప్పగించాలంటూ నాటి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అలా అయితేనే.. ఈ హత్య వెనుక ఉన్న పాత్రదారులు, సూత్రదారులు బయటకు వస్తారన్నారు. అందుకోసం వైఎస్ జగన్ న్యాయస్థానాన్ని సైతం ఆయన ఆశ్రయించారు. ఇంతలో ఎన్నికలు వచ్చాయి.ఎన్నికల్లో వైసీపీ ఘన విజయం సాధించింది. దాంతో వైఎస్ జగన్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టారు. ఆ వెంటనే వైఎస్ వివేకా హత్య కేసును సీబీఐకి అప్పగించాలన్న తన పిటిషన్‌ను కోర్టు నుంచి వెనక్కి తీసుకున్నారు. అలాగే తన తండ్రి హత్య కేసులో దోషులను చట్టానికి పట్టించాలంటూ సోదరుడు సీఎం వైఎస్ జగన్‌ను వైఎస్ వివేకా కుమార్తె కోరింది. ఆ సమయంలో సీఎం వైఎస్ జగన్ ఇచ్చిన సమాధానంతో ఆమె ఒకింత షాక్‌కు గురైంది. ఆ క్రమంలో ఆమెతోపాటు తన తల్లి, వైఎస్ వివేకా భార్య సౌభాగ్యమ్మ కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో వైఎస్ వివేకా హత్య కేసు సీబీఐ చేతిలోకి వెళ్లింది. అయితే ఈ హత్య కేసులో ప్రధాన సాక్షులుగా ఉన్న ఆరుగురు వ్యక్తులు అనుమానాస్పద రీతిలో మరణించారు. ఈ నేపథ్యంలో సీఎంచంద్రబాబు పైవిధంగా స్పందించారు.

## రెస్ట్ తీసుకుంటారా..సస్పెండ్ చేయించమంటారా ?

**మంత్రి నిమ్మలతో లోకేశ్ ఆసక్తికర సంభాషణ**

అమరావతి,మార్చి7: ఏపీ అసెంబ్లీలో ఆసక్తికర ఘటన చోటు చేసుకుంది. మంత్రి నిమ్మల రామానాయుడు అనారోగ్యంతోనే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. సెలైన్ బాటిల్ చేతికి పెట్టినప్పుడు వినియోగించే కాన్యులాతో ఆయన సభకు వచ్చారు. ఈక్రమంలో మంత్రి నారా లోకేశ్ ఆయనతో సరదాగా మాట్లాడారు. ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పని చేస్తానంటే సస్పెండ్ చేయిస్తానని చమత్కరించారు. విశ్రాంతి తీసుకుంటారా?.. సభ నుంచి సస్పెండ్ చేయించాలా అని వ్యాఖ్యానించారు. నిన్నటితో పోలిస్తే.. ఇవాళ ఆరోగ్యం బాగానే ఉంది అని నిమ్మల బదులిచ్చారు. ఆరోగ్యం సహకరించడం తోనే అసెంబ్లీకి వచ్చానని పేర్కొన్నారు. ప్రశాంత నిద్ర వల్లే ఆరోగ్యం కుదుటపడుతుందని నిమ్మలకు మంత్రి లోకేశ్ సూచించారు. ఆయన విశ్రాంతి తీసుకునేలా రూలింగ్ ఇవ్వాలని డిప్యూటీ స్పీకర్‌ను కోరారు.ఆరోగ్యాన్ని పణంగా పెట్టి పని చేస్తానంటే.. సస్పెండ్ చేస్తా అని మంత్రి నిమ్మల రామానాయుడును ఉద్దేశించి మంత్రి నారా లోకేశ్ సరదాగా అన్నారు. రెస్ట్ తీసుకుంటారా?.. సభ నుంచి సస్పెండ్ చేయించాలా అని నిమ్మలను అడిగారు. అన్నా.. కొంచెం రెస్టు తీసుకోండి అంటూ నిమ్మలకు



లోకేశ్ సూచించారు. మంత్రి నిమ్మల అనారోగ్యంతోనే అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యారు. మీకు నిత్యం కళ్లెదుట పోలవరం ప్రాజెక్ట్.. నాకు ఏమో పాఠశాలల అభివృద్ధి కనిపిస్తుంటుంది. మీరు రెస్ట్ తీసుకోకోకుంటే మీకు యాపిల్ వాచ్ కొనిచ్చి.. మీ స్లీపింగ్ టైం వాచ్ చేపిస్తా' అని మంత్రి నిమ్మల రామానాయుడుతో మినిస్టర్ నారా లోకేశ్ సరదాగా అన్నారు. 'నిన్నటితో పోలిస్తే ఇవాళ ఆరోగ్యం బాగానే ఉంది. ఆరోగ్యం సహకరించడంతోనే అసెంబ్లీకి వచ్చా' అని నిమ్మల బదులిచ్చారు. ప్రశాంత నిద్ర వల్లే ఆరోగ్యం కుదుటపడుతుందని నిమ్మలకు లోకేశ్ సూచించారు.

## పోసానికి మరోసారి ఊరట.. బెయిల్ మంజూరు

కడప: ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్‌కళ్యాణ్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు నటుడు పోసాని కృష్ణమురళిపై ఎపిలోని పలు పోలీస్‌స్టేషన్లలో కేసులు నమోదైన విషయం తెలిసిందే. ఈ మేరకు ఆయన్ను రాయచోటి పోలీసులు అరెస్ట్ చేశారు. అయితే పోసానికి మరోసారి



ఊరట లభించింది. శుక్రవారం ఆయనకు బెయిల్ మంజూరు అయింది. ఓబులవారి పల్లె పోలీస్ స్టేషన్‌లో నమోదైన కేసులో ఆయనకు కడప మొబైల్ కోర్టు బెయిల్ మంజూరు చేసింది. పోసాని తరఫున మాజీ ఎజి పొన్నవోలు సుధాకర్ వాదనలు వినిపించారు. పొన్నవోలు వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం ఆయనకు బెయిల్ ఇచ్చింది. అంతేకాక.. పోసాని కస్టడి పిటిషన్‌ను కోర్టు కొట్టేసింది. ఇప్పటికే హైకోర్టులో పోసానికి ఊరట లభించింది. విశాఖ, చిత్తూరు జిల్లాల్లో నమోదు అయిన కేసుల్లో తొందరపాటు చర్యలు తీసుకోవద్దని పోలీసులను హైకోర్టు ఆదేశించింది.

## విపక్ష హోదా వైకాపా హక్కు

**అది కావాలంటే జనసేన కూటమి నుంచి వైదొగాలి**

**బాబు సంపద సృష్టి గాలి మాటలు**

**మీడియా పాయింట్ వద్ద బొత్స ఘాటు విమర్శలు**

అమరావతి,మార్చి7 ఏపీ శాసనమండలి వేదికగా వాస్తవాలను వివరిస్తుంటే టీడీపీ వాళ్లు జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు ప్రతిపక్ష నాయకులు బొత్స సత్యనారాయణ. ఎన్నికల ముందు చంద్రబాబు సంపద సృష్టిస్తామన్నారు కదా?. మరి ఇప్పుడు ఏమైంది మీ సంపద సృష్టి అని ప్రశ్నించారు. ఇదే సమయంలో డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు అస్సలు అవగాహన లేదు. ప్రతిపక్ష హోదా మా హక్కు. సంఖ్యాపరంగా తమకే సీట్లు ఎక్కువ వచ్చాయని పవన్ అంటున్నారు. మాకు ప్రతిపక్ష హోదా ఇవ్వనప్పుడు.. పవన్ కూటమి నుంచి బయటికి రావాలి.. అని డిమాండ్ చేశారు. అసెంబ్లీలో మీడియా పాయింట్ వద్ద ఎమ్మెల్సీ బొత్స మాట్లాడుతూ.. బడ్జెట్ ప్రసంగంపై నేను మాట్లాడాను. మేము ప్రజల తరఫున మాట్లాడుతున్నాం. ప్రజల కోసం ప్రశ్నించాల్సిన బాధ్యత మాపై ఉంది కాబట్టే నిలదీస్తున్నాం. రాష్ట్రంలో 18 ఏళ్లు నిండిన మహిళలకు రూ.1500 ఇస్తామన్నారు. బ్జడెల్‌లో ఆ ప్రస్తావనే లేదు. ఉచిత బస్సు పథకానికి సంబంధించి కూడా బ్జడెట్‌లో ప్రస్తావన లేదు. ఎన్నికల ముందు చంద్రబాబు సంపద సృష్టిస్తామన్నారు కదా?. మరి ఇప్పుడు ఏమైంది మీ సంపద సృష్టి?. ఎన్నికల సమయంలో కూటమి ఇచ్చిన హామీలపైనే మేము ప్రశ్నిస్తున్నాం అని అన్నారు. రూ.322 కోట్ల బ్జడెట్ లోటు, విధ్వంసం అనే పదంపైన నేను అసెంబ్లీలో మాట్లాడాను. విద్యుత్ చార్జీలు పెంచమని, ట్రూ ఆఫ్ చార్జీలు వేయమని చెప్పారని తప్పులు మాట్లాడితే మాట్లాడానని చెప్పం. రూ.2400 కోట్లు ఉపాధి హామీ పథకం నిధుల బకాయిలు గురించి చెప్పం. వాస్తవాలు తట్టుకోలేక పోతున్నారు. సూపర్ సిక్స్ అమలు చేస్తామని అధికారంలోకి వచ్చారు. ప్రస్తుతం ఇస్తున్న పథకాల కంటే ఎక్కువ ఇవ్వలేమని మా నాయకుడు వైఎస్ జగన్ ముందే చెప్పారు. ప్రస్తుతానికి సూపర్ సిక్స్‌లో ఒక్కటి అమలు చేస్తున్నారు. తల్లికి వందనంకి 9400 పెట్టి.. డిమాండ్‌లో 8200 కోట్లు చూపించారు.. మరి మిగిలింది ఎక్కడ నుండి తెస్తారు. రైతు భరోసాకి 20వేల రూపాయలు కేంద్రం ప్రభుత్వంతో సంబంధం లేకుండా ఇస్తామని చెప్పారు..

# సంపాదకీయం

శనివారం 08-03-2025

## సౌత్ లో డీలిమిటేషన్ రగడ

తమిళనాడు రాజకీయం రగిలిపోతోంది.నివురుగప్పిన నిప్పులా ఆ సెగ ఎప్పుడూ ఉంటూనే ఉంటుంది తమిళనాడులో. కాని, ఆ నిప్పును మరోసారి రగల్చడంలో సక్సెస్ అయ్యారు సీఎం స్టాలిన్. హిందీ భాషకు నియోజకవర్గాల పునర్విభజన అనే అంశాన్ని ముడిపెట్టి ఓ ఉద్యమంగా మారుస్తున్నారు. సీఎం స్టాలిన్.. ఓ పక్కా వ్యూహంతో చేస్తున్న రాజకీయ ఎత్తుగడ ఇది. తమిళనాడులో ఎంపీ సీట్లు తగ్గిపోతున్నాయ్, అదే జరిగితే తమిళ అస్తిత్వానికే దెబ్బ అని అరవ సెంటిమెంట్‌ను గట్టిగానే జనాల్లోకి తీసుకెళ్తున్నారు... సీఎం స్టాలిన్ ఆల్‌పార్టీ మీటింగ్‌కు పిలుపునివ్వగానే ప్రధాన ప్రతిక్షం అయిన అన్నా డీఎంకే కూడా కదిలి వచ్చింది. డీఎంకే, అన్నాడీఎంకే మధ్య ఎంతటి రాజకీయ వైరం ఉంటుందో దశాబ్దాలుగా చూస్తునే ఉన్నాం. అలాంటిది.. ఒకే వేదిక మీదకు వచ్చాయ్ ఆ పార్టీలు. పైగా.. కొత్తగా పార్టీ పెట్టిన హీరో విజయ్ కూడా.. తన పార్టీ ప్రతినిధిని ఆ సమావేశానికి పంపించారు. పార్టీ పెట్టినప్పటి నుంచి సీఎం స్టాలిన్ లక్ష్యంగా, డీఎంకేను ఓడించడమే టార్గెట్‌గా విమర్శలు, ఆరోపణలు గుప్పిస్తూనే ఉన్నారు హీరో విజయ్. స్టాలిన్‌ను విమర్శించడానికి ఉన్న ఏ ఒక్క అవకాశాన్నీ వదలుకోవడం లేదు. అలాంటిది.. ముఖ్యమంత్రి ఆహ్వానం పంపడం ఆలస్యం.. టీవీకే పార్టీ కూడా ఆ సమావేశానికి హాజరైంది. ఈ విషయంలో సీఎం స్టాలిన్ సాధించింది మామూలు సక్సెస్ కాదు. ఎవరూ ఊహించని విజయం. నిజానికి, ఈ విజయాన్ని స్టాలిన్ ఖాతాలో వేయడానికి కూడా లేదు. ఎందుకంటే.. తమిళ సెంటిమెంట్‌కు ఉన్న బలం అలాంటిది.ఏదైనా ఒక అంశం ఉద్యమ రూపం దాల్చితే.. దానికి మద్దతిస్తూ అన్ని పార్టీలూ కలిసి వస్తాయి. ఆమధ్య జల్లికట్టును నిషేధించాలన్నప్పుడు కూడా.. పార్టీలన్నీ తమ వైరాన్ని పక్కనపెట్టి మరీ కలిసి నడిచాయి. సుప్రీం కోర్టు స్పష్టమైన తీర్పు ఇచ్చినా సరే.. పార్లమెంట్ ద్వారా ఆర్డినెన్స్ తెచ్చుకునే దాకా పోరాటాలు చేశాయి అక్కడి పార్టీలు. అది కూడా.. అందరూ కలిసికట్టుగా పోరాడారు. హిందీ భాష విషయంలో తమిళులంతా ఏకతాటిపైకి వచ్చారు. ముగ్గులతో హిందీకి వ్యతిరేకంగా నిరసన తెలిపారు. హిందీలో రాసి ఉన్న బోర్డులను తీసేస్తున్నారు. తమిళంపై బీజేపీకి ప్రేమ ఉంటే.. సెంట్రల్ గవర్నమెంట్ ఆఫీసుల నుంచి హిందీని తొలగించాలని ఛాలెంజ్ చేశారు. సో, తమిళులకు, తమిళ భాషకు, తమిళ సంస్కృతికి, తమిళనాడుకు అన్యాయం జరుగుతోందని ఏమాత్రం అనిపించినా సరే.. పెద్ద ఉద్యమాలకు సిద్ధమైపోతారు. ఇప్పుడు కూడా అలాంటి ఉద్యమమే ఊపిరిపోసుకుంటోందా అని అనిపిస్తోంది తమిళ రాజకీయాలు చూస్తే.వారం రోజుల క్రితం తమిళనాడు క్యాబినెట్ సమావేశం ముగిసిన వెంటనే.. మీడియాతో మాట్లాడారు సీఎం స్టాలిన్. ఆ ప్రెస్‌మీట్‌లో నియోజకవర్గాల పునర్విభజనపై కీలక వ్యాఖ్యలు చేశారు. దేశవ్యాప్తంగా లోక్‌సభ నియోజకవర్గాల పునర్విభజనలో దక్షిణాది రాష్ట్రాల్లో సీట్ల సంఖ్యను తగ్గించి ఉత్తరాది రాష్ట్రాల్లో సీట్లు పెంచుకునే కుట్ర జరుగుతోందని అన్నారు. దక్షిణ భారతదేశంలో ఒక్క తమిళనాడులో మాత్రమే ఎక్కువ లోక్‌సభ స్థానాలు ఉన్నాయి. ప్రస్తుతం ఉన్న 39 ఎంపీ స్థానాలు 31కి తగ్గొచ్చనేది సీఎం స్టాలిన్ చెబుతున్న లెక్క. అందుకే, నాగపట్నంలో డీఎంకే నేత ఇంట పెళ్లికి వెళ్లిన స్టాలిన్.. ఆలస్యం చేయకుండా పిల్లల్ని కనండి, వాళ్లకు తమిళ పేర్లు పెట్టండి అని ఆశీర్వదించి వచ్చారు. తమిళనాడులో వందకు పైగా రాజకీయ పార్టీలు ఉంటే.. అందులో యాక్టివ్‌గా ఉన్నవి 64 పార్టీలు. అందులో 56 పార్టీలు హాజరయ్యాయి. 64కి 56 పార్టీలు హాజరయ్యాయంటే.. వాళ్ల మధ్య ఏ స్థాయిలో ఐక్యత ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. మక్కల్ నీరుమయం అధ్యక్షుడు కమలహాసన్ కూడా సమావేశానికి వచ్చారు.పునర్విభజనలో 8 నియోజకవర్గాలకు కోతపెట్టేందుకు బీజేపీ కుట్ర చేస్తోందని సీఎం స్టాలిన్ మాట్లాడారు. ఇక.. హీరో విజయ్ అయితే పెద్ద స్టేట్‌మెంటే రిలీజ్ చేశారు. రాబోయే జనగణన ఆధారంగానే లోక్‌సభ నియోజకవర్గాలను పునర్విభజిస్తామంటే ఊరుకునేది లేదని హెచ్చరించారు. మరీ ముఖ్యంగా.. దక్షిణాది రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు తగ్గినా.. ఉత్తరప్రదేశ్, బిహార్, ఇతర ఉత్తరాది రాష్ట్రాల్లో ఎంపీ సీట్లు పెరిగినా.. ఏమాత్రం సహించేది లేదని క్లియర్ అల్టిమేటం ఇచ్చారు. కేంద్రం మాటకు కట్టుబడి.. 50 ఏళ్లుగా తమిళనాడుతో సహా దక్షిణాది రాష్ట్రాలు జనాభా నియంత్రించిన విషయాన్ని మరోసారి గుర్తు చేశారు. ఒకవేళ కాదూకూడదని కొత్త జనాభా లెక్కల ప్రకారమే నియోజకవర్గాల పునర్విభజన చేస్తే మాత్రం.. అన్ని పార్టీలతో కలిసి ఉద్యమిస్తామని వార్నింగ్ ఇచ్చారు.అఖిలపక్ష సమావేశంలో కొన్ని కీలక తీర్మానాలు చేశారు. ఒకటి.. 1971 జనాభా లెక్కల ప్రకారమే డీలిమిటేషన్ జరగాలి. అలా జరిపే డీలిమిటేషన్ 30 ఏళ్ల పాటు అమల్లో ఉండాలి. రెండు.. తమిళనాడు ఎంపీలు, అఖిలపక్షంలోని పార్టీల ప్రతినిధులతో ఓ కమిటీ వేయాలి. మూడు.. దక్షిణాది రాష్ట్రాల్లోని అన్ని రాజకీయ పార్టీలను కలుపుకొని, ఆ పార్టీలతో కలిసి కేంద్రంపై పోరాటం చేయాలి. నాలుగు.. నియోజకవర్గాల పునర్విభజన జరగకూడదు. ఐదు.. పునర్విభజన జరగడం లేదని ప్రధాని మోదీ నుంచే ప్రకటన వచ్చేలా పోరాడాలి. ఇవీ.. అఖిలపక్ష సమావేశంలో చేసిన తీర్మానాలు.. దక్షిణాది రాష్ట్రాల్లో పర్యటించి, పార్టీల అధినేతలు, ముఖ్యనేతలతో చర్చిస్తారు. నియోజకవర్గాల పునర్విభజనతో తమిళనాడుతో పాటు దక్షిణాది రాష్ట్రాలన్నింటికీ అన్యాయం జరుగుతుందన్న విషయాన్ని అందరితో చర్చించి ఉద్యమ కార్యాచరణ రూపొందిస్తారు. ఇక తెలంగాణలో.. బీఆర్ఎస్ పార్టీ కేంద్రంపై పోరాడుతోంది. కానీ, ఈ విషయంలో స్టాలిన్ నాయకత్వాన్ని అంగీకరిస్తుందా అన్నదే ప్రశ్న. సీఎం రేవంత్‌రెడ్డి అధిష్టానం నిర్ణయాన్ని బట్టే నడుచుకుంటారు.


# జానారెడ్డికి కీలక పదవి..



నల్గొండ, మార్చి 7, పెద్దలు జానారెడ్డికి.. ప్రభుత్వంలో పెద్ద పదవి దక్కబోతుందా అంటే.. అవుననే సమాధానమే అన్నిచోట్లా వస్తోంది. దీనికి జానారెడ్డితో సీఎం రేవంత్ భేటీ కావడమే కారణంగా చూపిస్తున్నాయ్ గాంధీభవన్ వర్గాలు. కేబినెట్‌లోని కొందరు తన మాట వినడం లేదని.. సహకారం లేదని.. బహిరంగంగానే కామెంట్ చేసిన రేవంత్.. పార్టీలో, ప్రభుత్వంలో తనకో పెద్ద దిక్కు కావాలని అనుకుంటున్నారా.. అందుకే పెద్దలు జానారెడ్డిని వ్యూహాత్మకంగా తెరపైకి తెస్తున్నారా? ఇదే నిజమైతే ఒకే కుటుంబానికి మూడు పదవులు అంటే.. కొత్త సమస్యలు తప్పవా.. ఇప్పుడిదే కాంగ్రెస్ నేతల్లో కాకరేపుతోంది..రేవంత్ ఢిల్లీ టూర్‌కు రెడీ అవుతున్నారు. మంత్రివర్గ విస్తరణతో పాటు కీలక పదవులకు సంబంధించి.. హైకమాండ్‌తో చర్చలు జరిపే చాన్స్ ఉందనే ప్రచారం జోరుగా సాగుతోంది. ఇలాంటి పరిణామాల మధ్య సీనియర్ నేత జానారెడ్డి ఇంటికి సీఎం రేవంత్ వెళ్లడం కొత్త ప్రాధాన్యత సంతరించుకుంది. జానారెడ్డితో ఆంతరంగికంగా చర్చలు జరిపినట్లు తెలుస్తోంది.కేబినెట్ విస్తరణతో పాటు.. పార్టీలో కీలక పదవుల అప్పగింతల వేళ.. జానారెడ్డితో రేవంత్ భేటీ రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకుంది. ఐతే ఇక్కడే అసలు ట్విస్ట్ కనిపిస్తోంది. సలహాల కోసమే కాదు.. సర్‌ప్రైజ్ ప్లాన్ చేసి మరీ జానారెడ్డి ఇంటికి రేవంత్ వెళ్లారనే గుసగుసలు వినిపిస్తున్నాయ్. ఈ ప్రచారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాలను షేక్ చేస్తోంది.ప్రభుత్వ ముఖ్య సలహాదారుగా జానారెడ్డిని నియమించాలని రేవంత్ నిర్ణయించారని.. దీని గురించి ఇద్దరి మధ్య చర్చలు జరిగినట్లు గుసగుసలు వినిపిస్తున్నాయ్. ఐతే త్వరలో దీనికి సంబంధించి ప్రకటన వచ్చే అవకాశం ఉందనే ప్రచారం కూడా నడుస్తోంది. ఇదంతా ఎలా ఉన్నా.. ప్రభుత్వంతో జానారెడ్డిని భాగం చేయడం వెనక రేవంత్ భారీ స్కెచ్ సిద్ధం చేసినట్లు ప్రచారం జరుగుతోంది.పార్టీ మాత్రమే కాదు.. ప్రభుత్వంలోని కొందరు మంత్రుల నుంచే తనకు సహకారం లభించడం లేదని.. ఈ మధ్య పీసీసీ సర్వసభ్య సమావేశంలో రేవంత్ బహిరంగంగానే కామెంట్లు చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో పార్టీ మీద, ప్రభుత్వం మీద పట్టు నిలుపుకోవాలంటే.. ఓ పెద్ద సపోర్టు కావాలి.. ఓ పెద్దమనిషి అండ కావాలి. అందుకే పెద్దలు జానారెడ్డికి పెద్దపదవి కట్టబెట్టేందుకు రేవంత్ రెడీ అయ్యారనే చర్చ నడుస్తోంది.జానారెడ్డిలాంటి పెద్దలు తనతో ఉంటే, తన పక్కన ఉంటే.. మరింత బలం లభించే అవకాశాలు ఉన్నాయన్నది రేవంత్ ప్లాన్ అనేది మరికొందరి అభిప్రాయం. నిజానికి పార్టీలో మిగతా సీనియర్లతో పలు సందర్భాల్లో రేవంత్‌కు గ్యాప్ ఏర్పడ్డా .. జానారెడ్డితో మాత్రం మొదటి నుంచి బంధం బలంగానే ఉంది. పీసీసీ చీఫ్‌గా రేవంత్ నియామకంలోనూ జానారెడ్డి పాత్ర కీలకం అనే చర్చ కూడా జరిగింది.రేవంత్‌కు పదవి ఇప్పించేందుకు అధిష్టానంతో జానారెడ్డి స్వయంగా మాట్లాడారనే టాక్ కూడా అప్పట్లో విన్పించింది. ! ఐతే ప్రస్తుత రాజకీయ పరిణామాలు, పరిస్థితుల మధ్య.. పెద్దలు జానారెడ్డి సపోర్టు రేవంత్‌కు చాలా అవసరం అనడంలో ఎలాంటి అనుమానం లేదు. అందుకే ఆయనను ప్రభుత్వంలో చేర్చి.. తన బలం పెంచుకోవాలన్నది రేవంత్ వ్యూహమనే టాక్ కూడా అప్పుడే మొదలైంది.పెద్దలు జానారెడ్డికి.. పెద్ద పదవి సంగతి ఎలా ఉన్నా.. ఎన్నికల ముందు కాంగ్రెస్ పెట్టుకున్న నిబంధనల సంగతి ఏంటనే ప్రశ్నలు వినిపిస్తున్నాయ్. ఒక కుటుంబానికి ఒకే పదవి అనే నిబంధన పెట్టుకున్నారు. ఐతే ఇప్పుడు జానారెడ్డికి ప్రభుత్వంలో పదవి అప్పగిస్తే.. ఆయన కుటుంబంలో ముగ్గురికి అవకాశం ఇచ్చినట్లు అవుతుంది. ఇప్పటికే ఆయన కుమారుల్లో ఒకరు ఎమ్మెల్యేగా ఉండగా.. మరొకరు ఎంపీగా కొనసాగుతున్నారు.జానారెడ్డికి పదవి అప్పగించాలని సీఎం రేవంత్ నిర్ణయం తీసుకున్నా.. పార్టీపరంగా ఎలాంటి సవాళ్లు ఎదురవుతాయనే చర్చ కూడా జరుగుతోంది. ఐతే ఒక కుటుంబానికి ఒకే నిబంధన అనే నిబంధన పెట్టుకున్నా.. తెలంగాణలో అది పెద్దగా వర్కౌట్ కాలేదు. వివేక్ వెంకటస్వామి కుటుంబం నుండి ఇప్పటికే మూడు పదవులు ఉండగా?వివేక్ కేబినెట్ రేసులోనూ ఉన్నారనే టాక్ ఉంది. ఇక ఉత్తమ్ కుటుంబానికి రెండు.. కోమటిరెడ్డి ఫ్యామిలీకి రెండు.. కేకే కుటుంబం నుంచి ఇద్దరు పదవుల్లో ఉన్నారు. మరి ఇప్పుడు జానారెడ్డికి లైన్ క్లియర్ అవుతుందా.. ఆయన విషయంలో రేవంత్ ప్లాన్ వర్కౌట్ అవుతుందా?బెడిసి కొడుతుందా అన్నది చూడాలి మరి

# యాక్షన్ ప్లాన్ సిద్ధం చేస్తున్న కమలదళం

హైదరాబాద్, మార్చి 7, తెలంగాణలో బీజేపీ స్పీడ్ పెంచబోతోంది. మూడు ఎమ్మెల్సీల్లో రెండింటిలో విజయం సాధించి మూడో స్థానంపై కూడా ప్రభావం చూపింది. ఇదే జోష్ కంటిన్యూ చేసి వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి అధికారంలోకి రావాలని స్కెచ్ వేస్తోంది. అందులో భాగంగానే కొత్త నినాదాన్ని అందుకుంది. ఆ నినాదంతో ప్రజల్లోకి వెళ్లాలని భావిస్తోంది. అన్ని రాష్ట్రాల్లో డబుల్ ఇంజిన్ సర్కారు ఉంటేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని నినదిస్తూ వచ్చిన బీజేపీ ఇప్పుడు ప్లాన్ బీని అమలు చేస్తోంది. సేవ్ తెలంగాణ – సపోర్ట్ బీజేపీ నినాదంతో ప్రజల ముందుకు వెళ్లేందుకు రంగం సిద్ధం చేస్తోంది. పదేళ్ల నుంచి కేంద్రంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం తెలంగాణకు చేస్తున్న సహాయం ప్రజలకు వివరించనున్నారు. ఇకపై వచ్చే ఎన్నికల అన్నింటిలో కూడా సత్తా చాటేందుకు సర్వశక్తులు ఒడ్డి పోరాటం చేయడానికి రెడీ అయింది. అధికార పార్టీని కాదని ఎమ్మెల్సీ ఎన్నికల్లో విజయం సాధించడం అంటే చిన్న విషయం కాదని బీజేపీ భావన. అందుకే ప్రజలు మార్పు కోరుకుంటున్నారని ఆ దిశగానే పార్టీ కార్యచరణ ఉండాలని బీజేపీ అధినాయకత్వం ఆలోచన. ఇప్పటి వరకు రాష్ట్ర అధ్యక్షుడిని నియమించలేదు. ప్రస్తుతానికి కేంద్రమంత్రి కిషన్ రెడ్డి అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ఇప్పుడు బీజేపీ భావజాలన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లే వ్యక్తికి ఆ పగ్గాలు అప్పగించాలని కూడా చూస్తోంది. బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చేపట్టిన కార్యక్రమాలు, ఇక్కడ ప్రజలకు వ్యతిరేకంగా కాంగ్రెస, బీఆర్ఎస్ తీసుకుంటున్న నిర్ణయాలపై పోరాటం ఉద్ధృతం చేయబోతున్నారు. ప్రజా సమస్యలను గుర్తించి వాటిపై క్షేత్రస్థాయి నుంచే పోరాటం చేయాలని డిసైడ్ అయ్యారు. ఇదే విషయాన్ని గురువారం ప్రెస్‌మీట్ పెట్టి మరీ కిషన్ రెడ్డి చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో ప్రజలు చూపిన ఆదరణకు కిషన్ రెడ్డి కృతజ్ఞతలు చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల విజయాన్ని తెలంగాణ సమాజానికి అంకితం ఇస్తున్నట్టు చెప్పిన ఆయన... బీజేపీని అధికారంలోకి తీసుకురావాలని ప్రజలు కోరుకుంటున్నారని అభిప్రాయపడ్డారు. తెలంగాణలో పదేళ్లుగా జరుగుతున్న పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తిగా ఉంటున్నారని కిషన్ రెడ్డి మండిపడ్డారు. పాలకులే మారుతున్నారు తప్ప పాలన తీరు మారడం లేదని ఆయన విమర్శించారు. అందుకే ప్రజలకు



కొత్త మార్గం చూపేందుకు బీజేపీ సిద్ధంగా ఉందని అందుకే తమ పార్టీని కూడా ప్రజల్లోకి మరింత స్పీడ్‌గా తీసుకెళ్తామన్నారు. ముందుగా సంస్థాగతంగా పార్టీ పదవులు భర్తీ వీలైనంత త్వరగా పూర్తి చేయనున్నామని వివరించారు. ప్రజలు చూపిస్తున్న అభిమానాన్ని మరింత ముందుకు తీసుకెళ్లలే నేతలకు ప్రాధాన్యత ఉంటుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ కలిసి పోటీ చేసినా తమను ఓడించలేకపోయారని గుర్తు చేశారు కిషన్ రెడ్డి. ఇది తమ బాధ్యతను మరింత పెంచిందని తెలిపారు. ఇకపై అసెంబ్లీలో, బయట ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తూనే ఉంటామని హెచ్చరించారు. ఇచ్చిన హామీలు నెరవేర్చే వరకు వదిలి పెట్టబోమని వార్నింగ్ ఇచ్చారు. పసలేని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపణలను ప్రజలు తిప్పికొట్టారని కిషన్ రెడ్డి అన్నారు. అందుకే ఇలాంటి ఆరోపణలు చేసే ముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించుకోవాలని సూచించారు. అయినా మారకుండా అదే రిపీట్ చేస్తే ఇలాంటి ఫలితాలే పునరావృతమవుతాయని హెచ్చరించారు. తెలంగాణ ప్రజల మనసులు గెలుచుకునేందుకు బీజేపీ ప్లాన్ ఆఫ్ యాక్షన్ ఎలా ఉంటుందో గురువారం ప్రెస్‌మీట్‌లో కిషన్ రెడ్డి చెప్పకనే చెప్పారు. త్వరలోనే అన్ని పదవులు భర్తీ చేసి రాష్ట్ర కేడర్‌లో నయా జోష్ నింపుతారమన్నారు. ఇకపై నేతలంతా ప్రజల్లో ఉండి ప్రభుత్వాని ప్రశ్నిస్తూ వచ్చే ఎన్నికల లక్ష్యంగా పని చేయాలని కూడా ఆయన దిశానిర్దేశం చేశారు.

## అసెంబ్లీ సమావేశాలకు కేసీఆర్

### అనర్హత వేటు ప్రమాదం

హైదరాబాద్ మార్చి 7, తెలుగు రాష్ట్రాల్లో ప్రతిపక్ష నేతలు అసెంబ్లీకి హాజరు కావడం లేదు. వారు రాకపోతే నిబంధనల ప్రకారం అనర్హతా వేటు వేస్తామని అధికార పార్టీలు హెచ్చరిస్తున్నాయి. ఈ క్రమంలో ఏపీలో ప్రతిపక్ష నేత జగన్మోహన్ రెడ్డి గవర్నర్ ప్రసంగం రోజున ఒక్క రోజు వెళ్లారు. దాంతో హాజరు కావడం లేదన్న కారణంతో అనర్హతా వేటు పడకుండా జాగ్రత్తలు పడ్డారు. అయితే ఆ హాజరు చెల్లదంటున్నారు కానీ.. అది వేరే విషయం. ఒక్క రోజు జగన్ తన శపథాన్ని పక్కన పెట్టి అసెంబ్లీకి వెళ్లి వచ్చారు. ఇప్పుడు తెలంగాణ ప్రతిపక్ష నేత కేసీఆర్ కూడా ఒక్క రోజు అసెంబ్లీకి వెళ్లాలని అనుకుంటున్నారు. త్వరలో జరగబోయే బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ ప్రవేశ పెట్టే రోజున ఆయన బడ్జెట్ ప్రసంగం వినేందుకు అసెంబ్లీకి హాజరవుతారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. గత ఎన్నికల్లో ఆయన గజ్వేల్ నుంచి గెలిచినప్పటికీ.. పార్టీ ఓడిపోవడంతో అసెంబ్లీకి రావడం లేదు. ప్రతిపక్ష నేతగా కూడా ఆయనే ఎన్నికయ్యారు. అయినా కిందపడిన కారణంగా మొదట్లో అసెంబ్లీకి రాలేదు. తర్వాత బడ్జెట్ పెడుతున్న రోజున ఒక్క రోజు అసెంబ్లీకి వచ్చి బడ్జెట్ ప్రసంగం విని వెళ్లిపోయారు. మళ్లీ ఇప్పటి వరకూ అసెంబ్లీ వైపు రాలేదు. మరోసారి ఆయన బడ్జెట్ ప్రసంగాన్ని వినేందుకు అసెంబ్లీకి వస్తారని బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. నిబంధనల ప్రకారం అరవై వర్కింగ్ డేస్ సభకు హాజరు కాకపోతే అనర్హతా వేటు వేయడానికి స్పీకర్ కు అధికారం ఉంటుంది. ఈ బడ్జెట్ సమావేశాలకు హాజరు కాకపోతే.. కేసీఆర్ పై అనర్హతా వేటు వేయడానికి అవకాశం లభిస్తుంది. ఉపఎన్నికలు వస్తాయా లేదా అన్న విషయాన్ని పక్కన పెడితే అసెంబ్లీకి హాజరు కాని కారణంగా అనర్హతా వేటు అనేది కేసీఆర్ ఇమేజ్ కు మచ్చలా ఉంటుంది. అందుకే బీఆర్ఎస్ వ్యూహకర్తలు ఒక్కరోజు అసెంబ్లీ అనే ఫార్ములాకు ఓటేసినట్లుగా చెబుతున్నారు. అయితే ఏపీలో వైసీపీ గవర్నర్ ప్రసంగం రోజు వెళ్లినట్లుగా కాకుండా.. బిజినెస్ డేలోనే అంటే.. సభా కార్యక్రమాలు అధికారికంంగా జరుగుతున్నప్పుడే హాజరు కావాలని అనుకుంటున్నారు. ఒక్క సారి హాజరైతే..మరో అరవై రోజుల వరకూ హాజరు కాకపోయినా ఎవరికీ సమాధానం చెప్పాల్సిన అవసరం ఉండదు. ఈ నెలలోనే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి.

# కాంగ్రెస్ ఓటమికి కారణం ఎవరు...

హైదరాబాద్, మార్చి 7, రేవంత్ రెడ్డి సర్కార్ కు ఎమ్మెల్సీ ఎన్నికల్లో రాజకీయంగా గట్టి ఎదురు దెబ్బ తగిలింది. తెలంగాణలో జరిగిన మూడు ఎమ్మెల్సీ స్థానాల్లో అధికార పార్టీని తోసిరాజని రెండింటిని బీజేపి తన్నుకుపోయింది. సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయిన కాంగ్రెస్ ఇప్పుడు రాజకీయంగా ఇరకాటంలో పడిందనే చెప్పాలి. అధికార పార్టీ హోదాలో కాంగ్రెస్ ఒక్క ఎమ్మెల్సీ స్థానం గెలవకపోవడం రేవంత్ సర్కార్ కు పెద్ద దెబ్బగా కాంగ్రెస్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. స్వయాన సీఎం రేవంత్ రెడ్డి ప్రచారంలోకి దిగినా అనుకున్న ఫలితాలు రాలేదు. సిట్టింగ్ స్థానం కోల్పోవడమే కాకుండా అది తమ బద్ధ శత్రువైన బీజేపీ ఖాతాలో పడటం హస్తం నేతలు జీర్ణించుకోలేకపోతున్నారు. 15 నెలల అధికారంలో తాము అన్ని హమీలు నెరవెర్చుతున్నామని కాంగ్రెస్ పార్టీ ప్రచారం చేస్తూ వచ్చింది. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పిస్తున్నామని ప్రచారం చేసినా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ స్థానాన్ని కాంగ్రెస్ కోల్పోయింది. బీసీ నినాదంతో కాంగ్రెస్ లబ్ధి పొందాలని ప్రయత్నం చేసినా అది బూమ్ రాంగ్ అయింది. ఉత్తర తెలంగాణలో బీజేపీ తన పట్టును నిలుపుకున్న వైనానికి ఈ ఫలితాలు సాక్ష్యంగా ఉన్నాయి. ఉమ్మడి కరీంగనర్ – నిజామాబాద్– ఆదిలాబాద్– మెదక్ జిల్లా పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీగా బీజేపీ అభ్యర్థి అంజి రెడ్డి, కాంగ్రెస్ అభ్యర్థి నరేందర్ రెడ్డిపై 5,106 ఓట్ల ఆధిక్యంతో గెలుపొందారు. హోరా హోరీ ఇద్దరి మధ్య విజయం దోబూచులాడినా, రెండో ప్రాధాన్యతా ఓట్ల లెక్కింపుతో బీజేపి ముందుకు పోగా, కాంగ్రెస్ పార్టీ తన సిట్టింగ్ స్థానాన్ని కోల్పోయింది. ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బీజేపీ బలపర్చిన కొమరయ్య గెలుపొందారు. ఇలా ఉత్తర తెలంగాణలో కీలకమైన రెండు స్థానాలను బీజేపీ గెల్చుకోవడం కాంగ్రెస్ పార్టీకి రాజకీయంగా ఎదురుదెబ్బ తగిలిందని చెప్పాలి. ఈ ఎన్నికల్లో రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రెండు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇక బీఆర్ఎస్ ఈ ఎన్నికల బరి నుండి తప్పుకుంది. దీంతో రెండు జాతీయ పార్టీలు గెలుపు కోసం తీవ్రంగా పని చేశాయి. కరీంనగర్ – నిజామాబాద్– ఆదిలాబాద్ – మెదక్ పట్టభద్రుల ఎమ్మెల్సీ నియోజకవర్గంలో 15 జిల్లాలు, 42 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి. అంటే అక్కడి పట్టభద్రుల తీర్పుగా ఈ ఎన్నికల ఫలితాన్ని చూడాల్సి ఉంది. అంతే కాకుండా ఇది నేరుగా రెండు జాతీయ పార్టీల మధ్య పోటీ. దేశ వ్యాప్తంగా కాంగ్రెస్– బీజేపీలు పోటీ పడుతున్నాయి. తమకు బలం లేని చోట మిత్రపక్షాల కూటములతో పోటీ పడుతున్నాయి. అయితే ఇక్కడి ఎన్నికల్లో రెండు పార్టీలు నేరుగా పోటీ పడటంతో అటు కాంగ్రెస్ సర్కార్ , ఇటు బీజేపీ రెండు చాలా ప్రతిష్టాత్మకంగా ఈ ఎన్నికలను తీసుకున్నాయి. బీజేపీ నుండి ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ , బీజేపీ ఎమ్మెల్యేలు ప్రతిష్టాత్మకంగా ఈ ఎన్నికలను తీసుకుని పని చేశారు. అటు సీఎం రేవంత్ రెడ్డి, పీసీ చీఫ్ మహేశ్ గౌడ్, మంత్రులు, అధికార పార్టీఎమ్మెల్యేలు అదే రీతిలో ప్రచారం చేశారు. రెండు ఎమ్మెల్సీ స్థానాలను గెల్చుకోవడంతో బీజేపీలో జోష్ పెరిగింది. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో ట్రాయంగిల్ పోటీని ఎదుర్కొన్న కాషాయం పార్టీ 8 అసెంబ్లీ స్థానాలను, 8 ఎంపీ స్థానాలను గెల్చుకుంది. ఇప్పుడు కాంగ్రెస్ పార్టీతో జరిగిన ఎమ్మెల్సీ పోరులో మూడు ఎమ్మెల్సీ స్థానాలకు గాను రెండు బీజేపీ ఖాతాలో పడ్డాయి. దీంతో రాష్ట్రంలోని చట్ట సభల్లో కాషాయ పార్టీకి పది మంది సంఖ్యా బలం అంటే రెండు అంకెల స్కోరు కు చేరడం విశేషం. ఓవరాల్ గా 8 మంది ఎమ్మెల్యేలు, ఇద్దరు కేంద్ర మంత్రులు, మరో ఆరుగురు ఎంపీలు, ఒక రాజ్య సభ సభ్యుడు , తాజాగా ఇద్దరు ఎమ్మెల్సీల బలం బీజేపీది. ఈ రెండు ఎమ్మెల్సీ స్థానాల గెలుపుతో కమలం పార్టీ ఉత్తర తెలంగాణలో తన బలాన్ని సుస్థిరం చేసుకుందనే చెప్పాలి. వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటేందుకు కమల నాథులు ఇప్పటి నుండే కసరత్తు ప్రారంభించారు. ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ బరిలోకి దిగలేదు. పార్లమెంట్ ఎన్నికల్లో గులాబీ పార్టీ ఒక్క స్థానం గెలవలేకపోయింది. బీఆర్ఎస్ కు తమ విజయాలతో చెక్ పెట్టడం ద్వారా కాంగ్రెస్ కు ప్రత్యామ్నాయం తామేనని బీజేపీ నేతలు చెప్పుకునే పరిస్థితి కల్పించారు. స్థానిక సంస్థల్లోను కమలంను వికసింపజేస్తే ఆ తర్వాత టార్గెట్ తెలంగాణ అధికార పీఠమేనని పార్టీ నేతలు చెబుతున్నారు. ఆ దిశగా ఇప్పటికే కేంద్రంలోని ముఖ్య నాయకులు, రాష్ట్ర నాయకులు వ్యూహాలు రచిస్తున్నట్లు బీజేపీ వర్గాలు చెబుతున్నాయి. త్వరలోనే బీజేపీ రాష్ట్ర పార్టీకి కొత్త సారథి నియమితుడవుతాడని కమలం సీనియర్లు చెబుతున్నారు. ఈ విజయం ఇచ్చిన జోష్ తో రానున్న రోజుల్లో బీజేపీ అధికార పీఠం దక్కించుకునే దిశగా సాగుతుందని చెప్పక తప్పదు.ఆ పార్టీ ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న బీసీ కుల గణన పై తీవ్ర స్థాయిలో విరుచుకుపడటం కూడా పార్టీకి నష్టం చేకూర్చింది.

# కార్యేషు దాసి.. కరణేశు మంత్రి.. భోజ్యేసు మాత.. ఇలా సమస్తం నీవే ఓ మాతృ మూర్తి




### -నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

కార్యేషు దాసి.. కరణేశు మంత్రి.. భోజ్యేసు మాత.. ఇలా సమస్తం నీవే. ఓ మాతృ మూర్తి.. ఈ మహిళా దినోత్సవం సందర్భంగా మీ కిదే మా వందనం!!"అమ్మను పూజించు.. భార్యను ప్రేమించు.. సోదరిని,కూతురుని దీవించు.. ముఖ్యంగా మహిళలను గౌరవించు" మహిళా దినోత్సవం గురించి తెలుసుకుందాం.మార్చి 8 ఒక చారిత్రాత్మక ప్రాధాన్యత గల రోజు. పదిగంటల పనిదినాలకోసం, పురుషులతో సమానమైన వేతనాలకోసం పశ్చిమ పెన్సిల్వేనియాలోని ఒక బట్టల మిల్లులో సమ్మె ప్రారంభమైంది. ఇందులో 5000 మంది పాల్గొన్నారు. ఇతర ప్రాంతాలకూ విస్తరించింది. చివరకు 1857 మార్చి 8వ తేదీన ఈ సమ్మె విజయవంతమైంది. అందుకే ఆరోజున అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకోవాలని నిర్ణయించుకున్నాం. ఇంతటి ప్రాధాన్యతల గల 8వ తేదీ ముంగిట్లో... మార్కెట్ యుగంలో మహిళ స్థితిగతులను పరిశీలిద్దాం.అంతర్జాతీయమహిళాదినోత్సవాన్ని ప్రతి సంవత్సరం మార్చి ఎనిమిదవ తేదీన ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటారు. దేశం, జాతి, భాష, రాజ్యం, సాంస్కృతిక భేదభావాలకు తావు లేకుండా మహిళలందరూ ఒకచోట చేరి ఉత్సవాన్ని ఘనంగా చేసుకుంటారు. చరిత్రను అనుసరించి సాధికారత సాధన దిశగా మహిళలు పోరాటానికి అంకురార్పణ చేశారు. ప్రాచీన గ్రీకు రాజ్యంలో లీసిస్ట్రాటా పేరు గల మహిళ ఫ్రెంచి విప్లవం ద్వారా యుద్ధానికి ముగింపు చెప్పాలని విజ్ఞప్తి చేస్తూ ఆందోళనకు శ్రీకారం చుట్టింది. పార్సీ మహిళలతో కూడిన సమూహం ఒకటి ఇదే రోజు వెర్సైల్స్‌లో ఒక ఊరేగింపును నిర్వహించింది.యుద్ధం కారణంగా మహిళలపై రోజురోజుకు పెరిగిపోతున్న అత్యాచారాలను నిరోధించాలని డిమాండ్ చేస్తూ వారు ఊరేగింపు జరిపారు. 1909 సంవత్సరం ఫిబ్రవరి 28వ తేదీన అమెరికా సోషలిస్ట్ పార్టీ ఆధ్వర్యంలో అమెరికాలో మహిళా దినోత్సవం జరిగింది. 1910 సంవత్సరంలో కొపెన్‌హెగన్‌లో సోషలిస్ట్ ఇంటర్నేషనల్ ద్వారా మహిళా దినోత్సవం ఆవిర్భవించింది. 1911 సంవత్సరంలో ఆస్ట్రియా, డెన్మార్క్, జర్మనీ మరియు స్విట్జర్లాండ్ దేశాల్లో లక్షలాదిగా మహిళలు ర్యాలీలో పాల్గొన్నారు.మతాధికారం, ప్రభుత్వ ఉద్యోగాల్లో తగు ప్రాధాన్యత, కార్యక్షేత్రంలో వివక్ష నిర్మూలన తదితర డిమాండ్ల సాధనకు మహిళలు ఈ ర్యాలీలో పాలు పంచుకున్నారు. 1913-14 మధ్య కాలంలో జరిగిన మొదటి ప్రపంచ యుద్ధం సమయంలో శాంతిని స్థాపించాలని కోరుతూ ఫిబ్రవరి మాసాపు చివరి ఆదివారం నాడు రష్యా దేశపు మహిళలు మహిళా దినోత్సవాన్ని జరుపుకున్నారు.ఐరోపా అంతటా యుద్ధ వ్యతిరేక ఆందోళన కార్యక్రమాలు చోటు చేసుకున్నాయి. 1917 సంవత్సరం వరకు జరిగిన ప్రపంచ యుద్ధంలో రష్యాకు చెందిన రెండు లక్షలకు పైగా సైనికులు మరణించారు. ఆహారం మరియు శాంతిని కోరుతూ ఇదే రోజున రష్యా మహిళలు హర్తాళ్ కార్యక్రమం చేపట్టారు. తమ ఉద్యమాలు, పోరాటాలతో రష్యా మహిళలు ఓటు హక్కును సాధించుకున్నారు. మహిళలు సాధించిన విజయాలకు చిహ్నంగా సాధికారతను పొందే క్రమంలో ప్రతి యేటా మార్చి ఎనిమిదవతేదీన విశ్వవ్యాప్తంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని జరుపుకోవడం ఆనవాయితీగా వస్తోంది.స్త్రీలపై జరుగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు, వారి హక్కులను పరిరక్షించేందుకు గడచిన దశాబ్ద కాలంగా భారీ సంఖ్యలో చట్టాలు రూపుదిద్దుకున్నాయి. అయితే ఈ చట్టాలు సక్రమంగా అమలుకు నోచుకుని ఉన్నట్లయితే భారత దేశంలో మహిళల పట్ల వివక్ష మరియు అత్యాచారాలు ఈ సరికే ముగిసిపోయి ఉండేవి. కానీ పురుషాధ్యికత విశృంఖలమైన పరిస్థితులు ఈ అద్భుతం ఆవిష్కరణకు అడ్డుపడ్డాయి. అయితే ప్రస్తుతం పూర్తి స్థాయిలో కాకపోయినా కొంత మేరకు ఈ చట్టాలు అమలుకు నోచుకుంటున్నాయి. భారతదేశంలో స్త్రీలను కాచుకోవడంలో చట్టాలను మించినవి మరేవీ కానరావు. భారతీయ సంవిధానంలోని ప్రతి అంశం కూడా మహిళలకు అత్యధిక ప్రాధాన్యతను ఇస్తూ రూపుదిద్దుకుంది. ఈ విషయమై మహిళలు సంపూర్ణమైన అవగాహనను కలిగి ఉండవలసిన అవసరం ఎంతైనా ఉంది.సంవిధానంలోని 14వ అధ్యాయం ద్వారా సమన్యాయం, అధ్యాయం 15 (3) లో జాతి, ధర్మం, లింగం మరియు జన్మస్థానం తదితరాలను అనుసరించి భేదభావం చూపరాదు. అధ్యాయం 16 (1) ని అనుసరించి లోక సేవలో బేధభావం లేకుండా సమానత్వం, అధ్యాయం 19 (1) లో సమాన రూపంలో భావవ్యక్తీకరణ స్వేచ్ఛ, స్త్రీ మరియు పురుషులను ప్రాణ, దేహపరమైన స్వాధీనం చేసుకోవడంతో వంచించిరాదని అధ్యాయం 21 తెలుపుతుంది. అధ్యాయాలు 23-24 లలో శోషణకు విరుద్ధంగా సమాన రూపంలో అధికార ప్రాప్తి, అధ్యాయాలు 25-28 లలో స్త్రీపురుషులిద్దరికి సమాన రూపంలో ధార్మిక స్వతంత్రత ప్రాప్తి, అధ్యాయాలు 29-30 ల ద్వారా విద్య మరియు సాంస్కృతిక అధికారం సంప్రాప్తించింది.అధ్యాయం 32లో సంవిధానపు సేవలపై అధికారం, అధ్యాయం 39 (ఘ) ను అనుసరించి స్త్రీలు పురుషులు చేసే సమానమైన పనికి సమవేతనాన్ని పొందే హక్కు, అధ్యాయం 40లో పంచాయతీ రాజ్ వ్యవస్థ 73 మరియు 74 అధికరణాలను అనుసరించి ఆరక్షణ యొక్క వ్యవస్థ, అధ్యాయం 41 ద్వారా పని లేమి, వృద్ధాప్యం, అనారోగ్యం తదితర అసహాయ స్థితిలో సహాయాన్ని పొందే అధికారం, అధ్యాయం 42లో మహిళా శిశు సంక్షేమ ప్రాప్తి, అధ్యాయం 33 (క) లో పొందుపరిచిన 84వ అధికరణ ద్వారా లోక్‌సభలో మహిళలకు తగు ప్రాధాన్యత, అధ్యాయం 332 (క) లోని 84వ అధికరణాన్ని అనుసరించి రాష్ట్రాల్లోని శాసనసభల్లో మహిళలకు తగు ప్రాధాన్యత సంప్రాప్తించాయి.

## ఎవరు గెలిచారు... ఎవరు ఓడారు

హైదరాబాద్, మార్చి 7, తెలంగాణలో ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై అనేక రకాల విశ్లేషణలు జరుగుతున్నాయి. తెలంగాణలో రెండు టీచర్ ఎమ్మెల్సీ, ఒక గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికలు జరగ్గా అందులో రెండింటిలో బీజేపీ విజయం సాధించింది. అయితే ఇది తమ బలం పెరుగుతుందని బీజేపీ భావిస్తుంది. కానీ అది బలం కాదు వాపు మాత్రమేనని కాంగ్రెస్ పార్టీ అంటోంది. ఎందుకంటే ఈ ఎన్నికల్లో బీఆర్ఎస్ పోటీ చేయలేదు. సహజంగా బీఆర్ఎస్ సానుభూతి పరులు కాంగ్రెస్ కంటే బీజేపీ వైపు మొగ్గు చూపారంటున్నారు. అందుకే గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలుపు సాధ్యమయిందని కాంగ్రెస్ నేతలు చెబుతున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ ఒక్కటి కావడంతోనే ఈ ఎన్నికల్లో గెలుపు దక్కిందని గట్టిగా చెబుతున్నారు.. ముక్కోణపు పోటీ జరగలేదని, అదే జరిగి ఉంటే విజయం తమకే దక్కేదన్నది కాంగ్రెస్ నేతల అభిప్రాయం. గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో గెలవడం అంటే నిరుద్యోగులు కాంగ్రెస్ ప్రభుత్వం పై వ్యతిరేకతతో ఉన్నారని, రానున్న కాలం బీజేపీదేనని కమలనాధులు చెబుతున్నారు. మొన్నటి అసెంబ్లీ ఎన్నికల్లో ఎనిమిది శాసనసభ నియోజకవర్గాలు గెలిచిన తాము పార్లమెంటు ఎన్నికల్లో ఎనిమిది స్థానాల్లో గెలిచి కాంగ్రెస్ కు ధీటుగా స్థానాలను సాధించామని కమలనాధులు ఆత్మవిశ్వాసంతో ఉన్నారు. ఇక వచ్చే ఎన్నికల్లో అధికారం తమదేనంటూ గట్టి ధీమాగా ఉన్నారు. డబుల్ ఇంజిన్ సర్కార్ ఉంటే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని, అందుకే తమను గెలిపించాలని కాషాయపార్టీ నేతలు కోరుతున్నార.. మరొక వైపు కాంగ్రెస్ మాత్రం ఇందుకు భిన్నంగా ఆలోచన చేస్తుంది. తెలంగాణ ప్రజలు వరసగా రెండు సార్లు అధికారాన్ని ఇవ్వడం సంప్రదాయంగా వస్తుందని, మరొకసారి కాంగ్రెస్ దే అధికారమని ఢంకా భజాయించి చెబుతున్నారు. తాము అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, ఇచ్చిన హామీలు అమలు చేస్తున్న తీరు, జనంతో మమైకమవుతున్న వైనం వంటి విషయాలు తమను విజయానికి మరింత దగ్గర చేరుస్తాయని అంటున్నారు. అందుకే రెండు పార్టీలు కలిసి పరోక్షంగా పోటీ చేసిన ఈ ఎన్నికల ఫలితాలు ప్రజల అభిప్రాయాలను ప్రతిబింబించవని చెబుతున్నారు. మొత్తం మీద ఎమ్మెల్సీ ఎన్నికల ఫలితాలపై ఎవరి అంచనాలు వారివిగా కనిపిస్తున్నాయి.

## మామునూరు ఎయిర్ పోర్ట్..

### ప్రభుత్వానికి టెన్షన్..

వరంగల్, మార్చి 7, మామునూరు ఎయిర్ పోర్ట్ చరిత్ర ఇప్పటిది కాదు. భారత స్వాతంత్ర్యానికి పూర్వమే అంటే నిజాం రాజుల పాలనలో 1930లో దీన్ని నిర్మించారు. చివరి నిజాం మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ దీన్ని జాతికి అంకితం చేశారు. ఇది షోలాపూర్ లో వ్యాపార అభివృద్ధికి, సిర్పూర్ కాగజ్ నగర్ లో కాగితపు పరిశ్రమ సౌకర్యార్థం వరంగల్ లో అజాంజాహి మిల్స్ సేవల కోసం ఈ ఎయిర్ పోర్ట్ ఉపయోగపడేది.స్వాతంత్ర్యం తర్వాత పలువురు ప్రధాన మంత్రులు, రాష్ట్ర మంత్రులు ఈ ఎయిర్ పోర్ట్ కు వచ్చారు. ఇండో చైనా యుద్ధ సమయంలో ఢిల్లీ ఎయిర్ పోర్టును శత్రువులు లక్ష్యంగా చేసుకున్నప్పుడు ప్రయాణికులకు మామునూరు ఎయిర్ పోర్ట్ సేవలు అందించింది. 1875 ఎకరాల స్థలంలో 6.6 కిలోమీటర్ల రన్ వే, పైలెట్ సిబ్బంది గృహాలు, పైలట్ శిక్షణా కేంద్రం, ఒకటికన్నా ఎక్కువ టెర్మినల్లతో దేశంలోనే అతిపెద్ద విమానాశ్రయంగా ఉండేది. కాలక్రమేణ ప్రభుత్వాల నిర్లక్ష్యం, అప్పటి ప్రజాప్రతినిధుల పట్టింపు లేనితనంతో దీన్ని 1981లో మూసివేశారు.తాజాగా రేవంత్ సర్కార్ అధికారంలోకి రాగానే ఉత్తర తెలంగాణ ప్రజల చిరకాల ఆకాంక్ష మళ్లీ తెరపైకి వచ్చింది. జీఎంఆర్ అభ్యంతరాలను పరిశీలించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు.. ఆ సంస్థను చివరికి ఒప్పించాయి. ఎయిర్ పోర్ట్ అథారిటీ కూడా సమ్మతించడంతో మామునూరు ఎయిర్ పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.ఎయిర్ పోర్టుకు మోక్షం కలిగినప్పటికీ.. భూసేకరణ అంశం మాత్రం తెలంగాణ సర్కార్ కు సవాల్ గా మారింది. ఒకప్పుడు వరంగల్ నగరానికి శివారు ప్రాంతంగా ఉన్న మామునూరు ఎయిర్ పోర్ట్ పరిసరాల్లో ప్రస్తుతం బహుల అంతస్తుల నిర్మాణాలు, లేఔట్లు వెలిశాయి.రైతుల నుంచి సర్కార్ భూములను సేకరించాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు గ్రామ సభలు నిర్వహించారు. మంత్రి కొండా సురేఖతో పాటు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజు గ్రామ సభల్లో పాల్గొన్నారు. భూమికి బదులు భూమి, ఇతర సౌకర్యాలు కల్పిస్తామని, ఎవరినీ రోడ్డున పడనివ్వబోమని నిర్వాసితులకు మంత్రి కొండా సురేఖ హామీ ఇచ్చారు. దీంతో మంత్రి ఇచ్చిన హామీలు నెరవేర్చాకే భూసేకరణ చేయాలని రైతులు భీష్మించుకుని కూర్చున్నారు. దీంతో సమస్య జఠిలమైంది.

# ఎమ్మెల్సీ కోసం రాములమ్మ....

### హస్తినకు ప్రయాణం



హైదరాబాద్, మార్చి 7, తెలంగాణ రాజకీయాలలో రాములమ్మ తెరపైకి వచ్చారు. తన త్యాగాలను గుర్తుపెట్టుకొని ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి కట్టబెట్టాలని నేరుగా ఆమె అధిష్టానం వద్దకే వెళ్లింది. ఎలాగైనా తనకు న్యాయం చేయాలని రాములమ్మ విజ్ఞప్తి చేయడంతో, కాంగ్రెస్ పార్టీలో ప్రస్తుతం ఇదే పొలిటికల్ టాపిక్ గా మారింది. ఇంతకు రాములమ్మ ఎవరని అనుకుంటున్నారా.. రాములమ్మ సినిమాతో ప్రజల మదిలో సుస్థిర స్థానం ఏర్పాటు చేసుకున్న నటి విజయశాంతి.సినీ రంగం నుండి రాజకీయ రంగంలోకి ప్రవేశించిన అనంతరం విజయశాంతి ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారు. ముందుగా తల్లి తెలంగాణ పార్టీ స్థాపించి తెలంగాణ వాదాన్ని బలంగా వినిపించారు. ఆ తర్వాత అనూహ్య రాజకీయ పరిణామాల నేపతిమాలో బిజెపి కండువా కప్పుకున్నారు. ఆ తర్వాత బీఆర్ఎస్ పార్టీలో విజయశాంతి జాయిన్ అయ్యారు. రాజకీయ పరిణామాల నేపథ్యంలో బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ లోకి వచ్చారు విజయశాంతి. ఆ తర్వాత మళ్లీ కాంగ్రెస్ నుండి బిజెపికి లో చేరారు. గత ఎన్నికల ముందు విజయశాంతి బిజెపి నుండి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎన్నికల సమయంలో తన వంతుగా ప్రచారాన్ని సైతం సాగించారు.ఇటీవల తెలంగాణ కాంగ్రెస్ సర్కార్ తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఆవిష్కరించిన క్రమంలో బీఆర్ఎస్ పార్టీ నుండి పలు విమర్శలు వచ్చాయి. ఆ సమయంలో విజయశాంతి గతంలో తాను ఏర్పాటుచేసిన తెలంగాణ తల్లి విగ్రహాన్ని ఎక్స్ ఖాతా ద్వారా పోస్ట్ చేసి, కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తెలంగాణ తల్లి విగ్రహానికి మద్దతు తెలిపారు. అలాగే ఇటీవల కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన పద్మ అవార్డులపై సీఎం రేవంత్ రెడ్డి మాటకు విజయశాంతి వత్తాసు పలికారు. తెలంగాణకు కనీసం నాలుగు అవార్డులైన ఇచ్చి ఉండాల్సిందని విజయశాంతి అభిప్రాయపడ్డారు.తాజాగా తెలంగాణలో ఎమ్మెల్యే కోటాలో 5 ఎమ్మెల్సీ స్థానాలకు నోటిఫికేషన్ విడుదలైన విషయం తెలిసిందే. ఈ 5 స్థానాలకు ఆశావాహుల సంఖ్య ఎక్కువగా ఉండడంతో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రణాళిక ప్రకారం అభ్యర్థులను ఎంపిక చేసే పనిలో పడ్డాయి. బీఆర్ఎస్ కు ఉన్న ఎమ్మెల్యేల సంఖ్యకు ఒక ఎమ్మెల్సీ ఖాయమనే చెప్పవచ్చు. మిగిలిన 4 స్థానాలకు కాంగ్రెస్ నుండి అభ్యర్థులను ఖరారు చేయాల్సి ఉంది. ఇక్కడే విజయశాంతి అలియాస్ రాములమ్మ ఎమ్మెల్సీ సీటు నేరుగా ఢిల్లీ వెళ్లి ఏఐసీసీ పెద్దలతో మంతనాలు జరుపుతున్నట్లు సమాచారం. ఢిల్లీలో ఏఐసీసీ అధ్యక్షుడు ఖర్గేను కలిసిన విజయశాంతి, ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ సీటు కేటాయించాలని ఢిల్లీ పెద్దలను కోరారని తెలుస్తోంది. పార్టీ కోసం తాను చేసిన త్యాగాలను పరిగణనలోకి తీసుకోవాలని ఆమె కోరారట.అయితే అధిష్టానం మాత్రం ఇంకా అభ్యర్థులను ఖరారు చేయలేదని, ఆమె విజ్ఞప్తిని పరిగణలోకి తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఇంచార్జ్ మీనాక్షీ నటరాజన్ మాత్రం కాంగ్రెస్ ను నమ్ముకున్న ఏ ఒక్కరికీ అన్యాయం జరగదని, పార్టీ కోసం కష్టపడిన వారికి సుస్థిర స్థానం ఉంటుందని హామీ ఇస్తున్నారు. మొత్తం మీద రాములమ్మ ఎమ్మెల్సీ పదవి కోసం ఏకంగా ఢిల్లీ పెద్దలను కలవడంపై ప్రస్తుతం ఇదే టాక్ ఆఫ్ ది పొలిటికల్ గా మారింది. మరి రాములమ్మ కోరిక నెరవేరుతుందా? లేదా అన్నది ముున్ముందు తెలియాల్సి ఉంది.

## ఆప్కాస్ ను రద్దు చేస్తే మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలి,

### ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్.

పాలకొండ,రాష్ట్రంలో పురపాలక సంఘాలలో ఉన్న ఆప్కాస్ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి కూటమి ప్రభుత్వం తన చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ పార్వతీపురం మన్యం జిల్లా కమిటీ రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది.కమిటీ ఆధ్వర్యంలో మన్యం జిల్లా కలెక్టర్ కి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందించింది.అనంతరం నేతలు విలేకరులు ఉద్దేశించి మాట్లాడుతూ గత ప్రభుత్వం తీసుకువచ్చిన ఆప్కాస్ ను రద్దు చేస్తున్నప్పుడు అంతకన్నా మెరుగైన జీవన విధానాన్ని కార్మికులకు అందించాలని కోటమి ప్రభుత్వం అలా చేయకుండా కాంట్రాక్టర్ల చెప్పు చేతల్లోకి కార్మికులను నెట్టాలని చూస్తే మరో పోరాటానికి వెనుకాడబోమని హెచ్చరించారు.279 జీవోను తీసుకువచ్చి కార్మికులను కట్టు బానిసలు చేయాలని చంద్రబాబు నాయుడు ప్రభుత్వం గతంలో చూస్తే దానిపై పోరాడమని గుర్తు చేశారు.జిల్లా పరిధిలో సాలూరులో నేతికి డబ్బులు లేవనే కారణంతో రెగ్యులర్గా జీతాలు చెల్లించడం లేదని ఫిబ్రవరి నెల జీతం కార్మికుల ఖాతాలకు వేయలేదని సభ్యులు నూనెలు చెప్పులు ఇవ్వాల్సి ఉన్న నిధులు లేవనే కారణంతో మంజూరు చేయడం లేదని తెలిపారు. చనిపోయిన కుటుంబాలు ఉద్యోగాలకు సంబంధించి కౌన్సిల్ తీర్మానం అయ్యి రెండు సంవత్సరాలు గడుస్తున్నా కార్మికుల కుటుంబాలకు పోస్టులు వేయలేదని తెలిపారు.సాలూరు పట్టణంలో శ్యామలంబ పండుగ దృష్ట్యా కార్మికులకు సెలవులు ఇవ్వాలని జిల్లాలో పెండింగ్లో ఉన్న సమస్యలు పరిష్కరించాలని జీవో నెంబర్ 36 అమలు చేసి ఇంజనీరింగ్ కార్మికులకు వేతనాలు పెంచాలని డ్రైవర్ల వేతనాలు జీవో ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు.మున్సిపల్ యూనియన్ జిల్లా కమిటీ నాయకులు మల్లేష్, సింహాచలం, రాముడు, శంకరు, మహిళా కమిటీ జిల్లా నాయకులు ఇందు నిర్మల, రవి సిఐటియు జిల్లా అధ్యక్షులు దావాలా రమణారావు, కోశాధికారి సన్యాసిరావు, సిఐటియు నాయకులు సూరిబాబు పెద్ద ఎత్తున కార్మికులు పాల్గొన్నారు.

## కాల్ సెంటర్ స్కామ్ గుట్టు

హైదరాబాద్, మార్చి 7,)హైదరాబాద్ లో ఘరానా మోసం వెలుగు చూసింది. దిమ్మతిరిగిపోయే కాల్ సెంటర్ స్కామ్ గుట్టు రట్టైంది. నకిలీ కాల్ సెంటర్ ఏర్పాటు చేసి విదేశీయులను మోసం చేస్తున్న ముఠాని సైబర్ సెక్యూరిటీ బ్యూరో పోలీసులు అరెస్ట్ చేశారు. గుజరాత్ కి చెందిన మనస్విని సహా 63 మందిని అరెస్ట్ చేశారు.హైదరాబాద్ లోని హైటెక్ సిటీలో ఎక్సిటో సొల్యూషన్స్ పేరిట మనస్విని కాల్ సెంటర్ ఏర్పాటు చేసింది. కైవాన్ పటేల్, ప్రతీక్, రాహుల్ తో కలిసి ఈ కాల్ సెంటర్ ను నిర్వహిస్తోంది. పలువురు ఈశాన్య రాష్ట్రాలకు చెందిన వ్యక్తులని టెలీ కాలర్స్ గా నియమించుకుంది. అమెరికన్లే ప్రధాన లక్ష్యంగా నిందితులు మోసాలకు పాల్పడుతున్నారు.హ్యాక్ అయిన బ్యాంక్ ఖాతాలు సరి చేస్తామంటూ బాధితులకు ఫోన్ చేసి మోసాలకు పాల్పడుతున్నారు. బ్యాంకు ఖాతాలు, డెబిట్, క్రెడిట్ కార్డుల వివరాలు సేకరించి నగదు కాజేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నిందితుల నుంచి 63 ల్యాప్ ట్యాప్ లు, 52 సెల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు పోలీసులు.."పే పాల్ నకిలీ కాల్ సెంటర్ కేసులో 63 మందిని అరెస్ట్ చేశాం. ఈశాన్య రాష్ట్రాలకు చెందిన 50 మందితో పాటు 11 మంది హైదరాబాదీలను అదుపులోకి తీసుకున్నాం.

# సీఎం గారు.... ఇదేం పాలన?

### పెంచాల్సిన వేతనాలను తగ్గించడమేంది?

### ఉద్యోగులకు డీఏలివ్వరు....ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు పెంచరా?

### డ్రైవర్లు, వర్క్ ఇన్ స్పెక్టర్లకు 25 శాతానికిపైగా వేతనాలు తగ్గించడం దుర్మార్గం

### ఇది కాంగ్రెస్ ప్రభుత్వ మతిలేని చర్య

### నాలుగేళ్లుగా ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలు ఎందుకు పెంచడం లేదు?

### ఎమ్మెల్సీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పినా తీరు మారదా?

### తక్షణమే ఔట్ సోర్సింగ్ సిబ్బందికి వేతనాలను పెంచండి

హైదరాబాద్, మార్చి 7, రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ శానిటేషన్ ఉద్యోగుల విషయంలో రాష్ట్ర ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు దుర్మార్గమని కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ అన్నారు.. పట్టణాల పరిశుభ్రతలో శానిటేషన్ సిబ్బంది పాత్ర అత్యంత కీలకం. కరోనా మహమ్మారి కాలంలో ప్రాణాలను ఫణంగా పెట్టి అందించిన సేవలు మరువలేనివి. దురదృష్టమేమిటంటే... ఆనాటి నుండి నేటి వరకు వేతనాలు పెంచాలని కోరుతున్నా పట్టించుకోవడం లేదు.పైగా మున్సిపల్ డ్రైవర్లు, వర్క్ ఇన్స్పెక్టర్లకు చెల్లిస్తున్న వేతనాలను తగ్గిస్తూ ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గం. భారతీయ జనతా పార్టీ పక్షాన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నాం. ప్రతి ఏటా పెరిగే నిత్యావసర ధరలు, ఇతర ఖర్చులను దృష్టిలో ఉంచుకుని ఉద్యోగుల జీత భత్యాలను పెంచడం పరిపాటి. కానీ రాష్ట్ర ప్రభుత్వం ఆ మేరకు పెంచకపోగా ఉన్న వేతనాల్లో భారీగా కోత విధించడం ఎంత వరకు సమంజసం?ఇప్పటి వరకు శానిటరీ ఇన్ స్పెక్టర్లకు నెల వేతనం రూ.22 వేలు చెల్లిస్తుండగా, ఆ వేతనాన్ని రూ.16,600లకు తగ్గించడం దుర్మార్గం. అట్లాగే డ్రైవర్లకు సైతం ఇదే విధంగా కోత విధించడం ఎంత వరకు న్యాయం? రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో 30 వేల 955 మంది ఔట్ సోర్సింగ్ సిబ్బంది పనిచేస్తున్నారు. 2021 జూన్ 11న కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులందరికీ 30 శాతం మేరకు వేతనాలు పెంచుతూ ఉత్తర్వులు జారీ చేశారు. నాటి నుండి నేటి వరకు అంటే గత నాలుగేళ్లుగా వేతనాల పెంపు ఊసే లేదు. పైగా దాదాపు 3 వేల మంది శానిటరీ ఇన్ స్పెక్టర్లు, డ్రైవర్ల వేతనాల్లో ఏకంగా 25 శాతానికిపైగా కోత విధించడం కాంగ్రెస్ ప్రభుత్వ మతిలేని చర్యగా భావిస్తున్నాం. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ ఉద్యోగుల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చి అందుకు భిన్నంగా వ్యవహరించడం ఎంత వరకు సమంజసం?ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులకు 5 డీఏలు పెండింగ్ లో ఉన్నప్పటికీ వాటిని చెల్లించడం లేదు. జీపీఎఫ్ లో దాచుకున్న సొమ్మును కూడా డ్రా చేసుకోకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఆఖరికి రిటైర్డ్ మెంట్ బెన్ ఫిట్స్ ఇవ్వకుండా కాళ్ల చెప్పులరిగేలా ఆఫీసుల చుట్టూ తిప్పించుకుంటూ ఉద్యోగులను వేధిస్తున్నారు.ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పినా తీరు మారకపోవడం బాధాకరం. నేడు మున్సిపాలిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్ శానిటరీ ఇన్ స్పెక్టర్లు, డ్రైవర్ల వేతనాల్లో భారీగా కోత విధించడాన్ని చూస్తుంటే ఉద్యోగులు, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ సిబ్బందిపట్ల కాంగ్రెస్ కు ఉన్న వ్యతిరేక భావం అర్థమవుతోంది. తెలంగాణ ప్రజలు విజు&ఝులు. అన్నీ గమనిస్తున్నారు. తక్షణమే చేసిన పొరపాటును సరిదిద్దుకుని మున్సిపల్ డ్రైవర్లు, శానిటేషన్ వర్క్ ఇన్ స్పెక్టర్ల వేతనాలను సరిచేయడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా మున్సిపాలిటీల్లో పనిచేసే ఔట్ సోర్సింగ్, కాంట్రాక్ట్ సిబ్బంది అందరికీ వేతనాలను పెంచాలని భారతీయ జనతా పార్టీ పక్షాన డిమాండ్ చేస్తున్నాం.

# కమలం గూటికి విజయసాయిరెడ్డి



విశాఖపట్టణం, మార్చి 7, మాజీ ఎంపీ విజయసాయిరెడ్డి వైసీపీతో పాటు తన ఎంపీ పదవికి కూడా హఠాత్తుగా రాజీనామా చేశారు. ఇక తాను రాజకీయాలకు దూరమని హార్టికల్చర్ చేసుకుంటానని ప్రకటించారు. అన్నట్లుగానే ఆయన రాజీనామా చేసి కొన్నాళ్లు కనిపించకుండా పోయారు. ఈ మధ్యలో ఆయన కొన్ని రహస్య సమావేశాలు నిర్వహించారు. కానీ వివరాలు బయటకు రాలేదు. ఇటీవల హైదరాబాద్ వచ్చిన ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్ ఖడ్‌ను కూడా కలిశారు. కంది ఐఐటీకి వచ్చిన ఆయనకు ప్రోటోకాల్ లేకపోయినా ఆయన వద్దకు వెళ్లి మరీ ఆహ్వానించడం చాలా మందిని ఆశ్చర్యపరిచింది. ఆయనకు ఎందుకు అవకాశం వచ్చిందో మెల్లగా కన్ని విషయాలు వెలుగులోకి వస్తున్నాయని రాజకీయవర్గాలు చెబుతున్నాయి. విజయసాయిరెడ్డి రాజకీయాలకు శాశ్వతంగా దూరం కాలేదు. ఆయన కొంత విరామం తీసుకోవాలనుకున్నారు. ముఖ్యంగా వైసీపీకి రాజీనామా చేసిన వెంటనే మరో పార్టీలో చేరితే అనేక ప్రశ్నలు వస్తాయని అందుకే కొంత కాలం విశ్రాంతి తీసుకోవాలని అనుకున్నారు. భారతీయ జనతా పార్టీలో చేరేందుకు అన్నీ మాట్లాడుకున్న తర్వాతనే రాజీనామా చేశారని ప్రస్తుతం ఓ క్లారిటీ వచ్చిందని అంటున్నారు. ఆయన బయటకు కనిపించకపోయినా. .తెలియకపోయినా బీజేపీ పెద్దలతో నిరంతరం టచ్ లో ఉంటున్నట్లుగా తెలుస్తోంది. తాను రాజీనామా చేసిన రాజ్యసభ సీటును మళ్లీ ఆయన కోరుకోవడడం లేదు. పదవి లేకపోయినా పర్వాలేదు ఆయన బీజేపీలో చేరాలనుకుంటున్నారు. అందుకే తను రాజీనామా చేసిన స్థానంలో ఉపఎన్నిక జరిగిన వెంటనే బీజేపీలో చేరేందుకు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటారని చెబుతున్నారు.ఇప్పటి వరకూ ఉన్న విశ్వసనీయ సమాచారం మేరకు జూన్ లేదా జూలై నెలల్లో బీజేపీ తీర్థాన్ని పుచ్చుకునేందుకు విజయసాయిరెడ్డి రెడీ అయ్యారని అంటున్నారు. బీజేపీ పెద్దలు కూడా ఈ అంశంపై సానుకూలంగా ఉన్నారని.. అలా డీల్ మాట్లాడుకున్నందునే రాజీనామా చేశారని అంటున్నారు. అయితే విజయసాయిరెడ్డిని పార్టీలో చేర్చుకోవడంపై కూటమి పార్టీలు ఎలా స్పందిస్తాయన్నది ఆసక్తికరంగా మారింది. ఆయన తన పదవికి రాజీనామా చేసినప్పుడు టీడీపీ అధినేత చందర్బాబు, జనసేన చీఫ్ పవన్ కల్యాణ్ గురించి చాలా పద్దతిగా మాట్లాడారు. వారిపై తాను చేసిన వ్యాఖ్యలు కేవలం రాజకీయాల్లో భాగంగా చేసినవే తప్ప.. వ్యక్తిగతంగా తనకు వారితో మంచి సంబంధాలు ఉన్నాయని చెప్పుకొచ్చారు. విజయసాయిరెడ్డిపై అనేక కేసులు ఉన్నాయి. జగన్ అక్రమాస్తుల కేసుల్లో ఆయన ఏ2గా ఉన్నారు. అలాగే కాకినాడ పోర్టును బెదిరించి రాయించుకున్నారన్న కేసుల్లోనూ ఇటీవల ఈడీ దర్యాప్తు ప్రారంభించింది. ఇంకా అనేక స్కాముల్లో ఆయన పేరు ఉందని ప్రచారం జరుగుతున్న సమయంలోఆయన వైసీపీకి గుడ్ బై చెప్పారు. ఇప్పుడు బీజేపీలోనే చేరాలనుకుంటున్నారు. ఆయనను చేర్చుకుంటారా లేదా అన్నదానిపై ఇంకా క్లారిటీ రావాల్సి ఉంది.

# పదవుల కోసం పాకులట..?

విజయవాడ, మార్చి 7, వైసీపీ అధినేత వైఎస్ జగన్ ఇప్పటికైనా పదవుల కోసం పాకులాడుకుండా ప్రజాసమస్యలను పట్టించుకోవడం మేలు. కేవలం ప్రతిపక్ష హోదా కోసం పట్టుపట్టకుండా జనం బాట పడితే మేలంటున్నారు. గత ఎన్నికల్లో ప్రజలు తీర్పు ఇచ్చారు. ఇప్పుడు అసెంబ్లీకి పోనంటున్నారు. తనకు ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప రానుంటున్నారు. ఎవరి మీద అలక? జనం మీదనా? లేక ప్రతిపక్ష హోదా ఇవ్వని అధికార పార్టీ మీదనా? అన్నది ప్రజలు ఆలోచించుకునే అవకాశముంది. ఎన్నికలు ముగిసి ఏడాదవుతుంది. బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నాయి. తనకు ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే తాను అసెంబ్లీకి రానంటూ జగన్ మొండి కేసి కూర్చుకున్నారు. అనర్హత వేటు పడుతుందని ఒక రోజు వెళ్లి రావడం మిగిలిన రోజుల్లో సభకు డుమ్మా కొట్టడం జగన్ కు అలవాటుగా మారింది. అయితే ముఖ్యమంత్రిగా ఉంటే తప్ప సభకు వెళ్లరా? లేకపోతే ప్రతిపక్ష హోదా ఇస్తే తప్ప సమావేశాల్లో పాల్గొనరా? ప్రజా సమస్యల కంటే పదవులపైనే జగన్ ఎక్కువ మక్కువ చూపుతున్నారన్న అభిప్రాయం ప్రజల్లో కలిగేందుకు ఎక్కువ అవకాశముంది. ప్రతిపక్ష హోదా ఉంటే అసెంబ్లీలో ఎక్కువ సమయం మాట్లాడే అవకాశం ఇస్తారన్నది జగన్ వాదన. అలా మాట్లాడకుండా అధికార పార్టీ జగన్ ను అడ్డుకుంటే అది ఆయనకే సానుభూతి కలుగుతుంది. మాట్లాడేందుకు తగిన సమయం ఇవ్వకపోతే అప్పుడే వాకౌట్ చేసి బయటకు వచ్చి మీడియా సమావేశం పెట్టొచ్చు... కానీ జగన్ అలా చేయడం లేదు. ప్రతిపక్ష హోదా ఇవ్వకపోతే తాను రానుంటూ చిన్నపిల్లాడు మంకు పట్టునట్లు వ్యవహరిస్తుండటం కూడా చూసే వారికి ఇబ్బందికరంగా ఉంది. సభలో ఏదైనా అవమానం జరిగితే సభ నుంచి శపథం చేసి బయటకు రావచ్చు. కానీ పదవి ఇవ్వడం లేదంటూ తాను పోనంటూ మొరాయించడం జగన్ ఆలోచన ఎటు వెళుతుందన్నదానికి మాత్రం వైసీపీ నేతలకే అర్థం కావడం లేదు. తాను వెళ్లకుండా, తన పార్టీ గుర్తు మీద గెలిచిన మిగిలిన పది మంది ఎమ్మెల్యేలకు కూడా జగన్ ఇదే సూత్రాన్ని అమలు చేస్తున్నారు. తాను చెడింది కాకుండా.. తన తోటి ఎమ్మెల్యేలను కూడా సభకు వెళ్లకుండా నిలువరించడం ఎందుకన్న ప్రశ్న వినపడుతుంది. వాళ్లు ఇవ్వమంటున్నా.. ఇవ్వాల్సిందేనని పట్టుబట్టడం ఎందుకని కొందరు ప్రశ్నిస్తున్నారు.. ఇక వైఎస్ జగన్ జనంలోకి వెళ్లాల్సిన సమయంలో ఇటు బెంగళూరు టు అమరావతి చక్కర్లు కొడుతూ కాలయాపన చేస్తున్నారన్న విమర్శలు సొంత పార్టీ నుంచే వినపడుతున్నాయి. ఇక్కడ కూర్చుని అధికార పార్టీపై విమర్శలు చేసే కన్నా జనంలోకి వెళ్లి తేల్చుకుంటే అది ప్లస్ గా మారుతుందని సూచిస్తున్నారు. కానీ జగన్ మాత్రం సంక్రాంతి నుంచి జిల్లాల పర్యటనలు వాయిదా వేసుకుంటూ వస్తున్నారు. ఇప్పుడు ఉగాది అంటున్నారు. ఉగాది నాటికి కూడా జనంలోకి రావడం డౌట్ గానే ఉంది. ఎందుకంటే ఎన్నికలకు ఇంకా సమయం ఉండటంతో ఇంత ముందు జనంలోకి వెళ్లడం వృధా ప్రయాస అని జగన్ భావిస్తున్నట్లుంది. కానీ ఈలోపు క్యాడర్ తో పాటు నేతలు కూడా చేజారిపోయే అవకాశముందన్న హెచ్చరికలు జగన్ చెవికి సోకడం లేదు

# అమరావతి అప్పులకు లైన్ క్లియర్

విజయవాడ, మార్చి 7,రాజధాని నిర్మాణానికి సేకరించిన భూముల్ని విక్రయించడం ద్వారా నిధులు సమీకరిస్తామని, ప్రజలపై ఎలాంటి భారాలు మోపమని ఏపీ మంత్రి నారాయణ స్పష్టం చేశారు. అమరావతి నిర్మాణంపై వైసీపీ అధ్యక్షుడు జగన్ వ్యాఖ్యల్ని నారాయణ ఖండించారు. మరోవైపు అమరావతి రుణాలకు లైన్ క్లియర్ అయ్యింది.అమరావతిలో ల్యాండ్ పూలింగ్ ద్వారా తీసుకున్న భూములలో కొంత మేర అమ్మడం ద్వారా రాజధానిని నిర్మిస్తామని మంత్రి నారాయణ వివరించారు. మరోవైపు అమరావతి రుణాల మంజూరులో ఎదురవుతోన్న సాంకేతిక సమస్యలను అధిగమించినట్టు సిఆర్‌డిఏ ప్రకటించింది. రాజధాని అప్పులపై ఆర్థిక సంస్థలు సంతృప్తి చెందినట్టు సీఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు తెలిపారు.ఆంధ్రప్రదేశ్ రాజధాని నగరం అమరావతి నిర్మాణం కోసం ప్రజలపై ఒక్క రూపాయి కూడా భారం వేసేది లేదని చెప్పారు. అమరావతిపై మాజీ ముఖ్యమంత్రి జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి నారాయణ నెల్లూరులో మీడియాతో మాట్లాడారుఅమరావతి రాజధాని నిర్మాణానికి హడ్కో, ప్రపంచ బ్యాంకు, ఎఎడిబి తో పాటు జర్మనీ బ్యాంకు నుంచి రుణాలు సేకరిస్తున్నట్లు మంత్రి తెలిపారు.



రాజధానిపై ప్రతిపక్షాల మాటలు వినవద్దని, నమ్మవద్దని ప్రజలకు సూచించారు. రాజధాని అమరావతి సెల్ఫ్ ఫైనాన్స్ ఉండాలని సీఎం భావిస్తున్నారని, అందుకు అనుగుణంగా పక్కా ప్రణాళికతో ముందుకెళ్తున్నమని చెప్పారు.రాష్ట్ర బడ్జెట్ లో అమరావతికి 6 వేల కోట్లు కేటాయించారని, అవసరమైతే ఇంకా నిధులు ఇస్తామని ముఖ్యమంత్రి చెప్పినట్లు మంత్రి వివరించారు. రాజధాని విషయంలో పారదర్శకంగా ఉంటామని, ఎలాంటి అవకతవకలు ఉండవని మరోసారి స్పష్టం చేశారు.ఝాఖీ రేట్ల ప్రకారం మాత్రమే టెండర్లు పిలిచి నిర్మాణాలు చేస్తున్నామని, గత ప్రభుత్వం మాదిరిగా నిధులు పక్క దారి పట్టించడం లేదని చెప్పారు. 217 చ.కి.మీ పరిధిలో పరిధిలో అంతర్జాతీయ ప్రమాణాలతో 5 వేల ఎకరాల్లో రాజధాని నిర్మాణం జరుగుతుందన్నారు.50 వేల కోట్ల పనులకు టెండర్ల ప్రక్రియ కొనసాగుతుందని మంత్రి నారాయణ చెప్పారు. అమరావతిలో 1000 నుంచి 1200 ఎకరాల్లో అంతర్జాతీయ యూనివర్సిటీలు, పాఠశాలలు, పలు సంస్థలకు భూములు కేటాయించినట్లు మంత్రి నారాయణ తెలిపారు.అమరావతి నిర్మాణానికి ప్రపంచ ఆర్థిక సంస్థలు ఇప్పటికే రుణాలను మంజూరు చేసేందుకు సంసిద్ధత వ్యక్తం చేశాయి. పలు అంతర్జాతీయ సంస్థలతో పాటు హడ్కో కూడా భారీగా రుణాలను ఇచ్చేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. ఈ క్రమంలో రాజధాని నిర్మాణం, రాజకీయ అభ్యంతరాలపై రుణాలను మంజూరు చేసే సంస్థలకు పలువురు ఫిర్యాదు చేశారు. అమరావతి నిర్మాణంపై రాజకీయంగా ఏకాభిప్రాయం లేదని ఫిర్యాదు చేయడంతో నిధుల విడుదలలో జాప్యం జరిగింది. డిసెంబర్ నాటికి రుణాలకు సంబంధించిన నిధులు విడుదల కావాల్సి ఉండగా అందులో జాప్యం జరిగింది.ఐ మంజూరులో జరుగుతున్న జాప్యంపై సిఆర్‌డిఏ కమిషనర్ కన్నబాబు వివరణ ఇచ్చారు. రుణాల మంజూరుపై వ్యక్తమైన అభ్యంతరాలకు వివరణ ఇచ్చినట్టు స్పష్టం చేశారు. అయా సంస్థల ప్రతినిధులు క్షేత్ర స్థాయిలో పర్యటించి సంతృప్తి వ్యక్తం చేశారని వివరించారు. రుణాల విడుదలకు సంబంధించిన ప్రక్రియ కొలిక్కి వచ్చిందని బ్యాంకు ఖాతాలు కూడా సిద్ధమైనట్టు తెలిపారు. రుణ ప్రక్రియలో ఎలాంటి ఇబ్బందులు లేవని కన్నబాబు వివరించారు.

# అంత ఫీల్ గుడ్డేనా...

విజయవాడ, మార్చి 7, ఆంధ్రప్రదేశ్ లో కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత ఏదో జరిగిపోతుందని అందరూ ఊహించారు. కానీ ఇచ్చిన హామీలు అమలుపరుస్తామని చెబుతున్నప్పటకీ పెద్దగా అమలు కాలేదు. పింఛన్ల మొత్తాన్ని నాలుగు వేల రూపాయలుకు పెంచడం మినహా పెద్దగా ఒరిగిందేమీ లేదన్న కామెంట్స్ క్షేత్ర స్థాయిలో వినపడుతున్నాయి. మరోవైపు ఉచిత గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నామని ఆర్భాటంగా ప్రకటించుకుంటున్నా మహిళలు అంత సంతోషంగా లేరన్నది కూడా అంతే వాస్తవం. అంతకు మించి ఇప్పటి వరకూ ఏ పథకాన్ని అమలు చేయకపోవడం.. అదిగో.. ఇదిగో అంటూ తేదీలు మారుస్తూ కాలయాపన చేస్తుండటంతో ప్రజలపై కూటమి ప్రభుత్వం పట్ల ఆశలు సన్నగిల్లినట్లే కనపడుతుంది ఇక ప్రధానమైన వర్గం రైతులు కూడా ఆందోళనలో ఉన్నారు. ఏ పంటకు సరైన గిట్టుబాటు ధర రాకపోవడంతో గతమే మేలన్న అభిప్రాయానికి అన్నదాతలు వచ్చే అవకాశముంది. మిర్చి రైతులను ఆదుకుంటున్నామని ప్రభుత్వం హడావిడి చేసిన ప్రకటనలు ప్రకటనలకే పరిమితమయ్యాయి. ఏ పంటకు సరైన ధర లభించడం లేదని రైతాంగం ఆందోళన చెందుతుంది. మరొక వైపు అన్నదాత సుఖీ భవ పథకాన్ని ఇస్తామని ప్రకటిస్తున్నా తమ ఖాతాల్లో పడేంత వరకూ ఎవరికీ నమ్మకం లేదు. అందులో ప్రతి పథకంలో లబ్దిదారుల ఎంపిక ఎలా ఉంటుంది? తమ పేరు అందులో ఉంటుందా? లేదా? అన్న సందేహాలు కూడా కర్షకులకు కంటి మీద కునుకులేకుండా పోయింది. ఇక మహిళలకు ఉచిత బస్సు పథకం ఊసే లేకపోవడంతో పాటు పద్దెనిమిదేళ్లు నిండిన వారికి ప్రత్యేకంగా నిధులు ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం దాని పేరు కూడా తలవడం లేదు. గత వైసీపీ హయాంలో ఏదో ఒక రూపంలో డబ్బులు వచ్చేవి చేతుల్లో ఉండేవి. కానీ ప్రభుత్వం నుంచి ఒక్క పైసా కూడా తమకు అందలేదన్న నిరాశా, నిస్పృహలు అయితే బాగా కనపడుతున్నాయి. ఏ పథకాన్ని అమలు చేయాలన్నా నిధులు లేవని ప్రభుత్వం పదే పదే చెబుతుండటంతో తమకు ఇప్పట్లో అవి దరి చేరే అవకాశం లేదన్న నిర్ణయానికి వచ్చారు. అయితే అధికార పార్టీని ఏమీ అనలేక, తమలో తాము మహిళలు ఆర్థికంగా చితికిపోక తప్పదన్న నిర్ణయానికి వచ్చినట్లుంది.. ఇక గత వైసీపీ ప్రభుత్వంలోనూ జగన్ ఇలాగే భావించారు. ఫీల్ గుడ్ ఫ్యాక్టర్ ఎక్కువగా ఉందని, తనను పథకాలే తిరిగి గెలిపిస్తాయని జగన్ గట్టిగా నమ్మారు. కానీ ఎన్నికల ఫలితాలను చూసిన తర్వాత మైండ్ బ్లాంక్ అయింది. ఇప్పుడు కూడా కూటమి పార్టీల పరిస్థితి అలాగే ఉంది. ఈయన కంటే ఆయనే బెటర్ అన్న భావనకు ప్రజలు వచ్చే అవకాశముంది. అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో తీసుకెళుతున్నామని చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో జనం మాత్రం అంతగా సంతృప్తికరంగా లేరన్నది వాస్తవం. అధికార పార్టీ ఎమ్మెల్యేలు కొంత ఇబ్బందులు పడుతున్నారు.

# నెల్లిమర్లలో సీన్ రివర్స్...

విజయనగరం. మార్చి 7,ఉమ్మడి విజయనగరం జిల్లా నెల్లిమర్ల నియోజకవర్గంలో 2024 ఎన్నికల్లో జనసేన జెండా ఎగిరింది. టీడీపీకి కంచుకోట లాంటి నెల్లిమర్ల సెగ్మెంట్‌ని పొత్తుల లెక్కల్లో భాగంగా చివరి నిముషంలో జనసేనకు కేటాయించారు. నియోజకవర్గం ఆవిర్భావం నుండి ఇక్కడ టీడీపి హవానే కొనసాగుతూ వచ్చింది. అలాంటి నియోజకవర్గాన్ని జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మాట కొట్టిపారేయలేక తెలుగుదేశం అధినేత చంద్రబాబు నాయుడు వదులుకున్నారు. ఎవరు పోటీ చేసిన అంతిమంగా గెలవాలన్నదే తమ ధ్యేయమని పదే పదే చెప్పుకొచ్చారు కూటమి నేతలు. దానికి తగ్గట్లే నెల్లిమర్లలో కూటమి అభ్యర్థి అయిన లోకం మాధవి టీడీపీ సపోర్ట్‌తో సునాయాసంగా గెలిచారు .ముఖ్యంగా నియోజకవర్గ టీడీపీ కేడర్ జనసేనకు పూర్తి స్థాయిలో సహకారం అందించారు. ఎన్నికల ముందు తానే అభ్యర్థినన్న ధీమాతో నెల్లిమర్లలో.. పూర్తిస్థాయి గ్రౌండ్ వర్క్ చేసుకున్న టీడీపీ ఇన్చార్జ్ బంగార్రాజు పార్టీ అధిష్టానం నిర్ణయానికి శిరసావహించి ఎన్నకల ప్రచారంలో ఫుల్ ఎఫర్ట్స్ పెట్టారు. దాంతో లోకం మాధవి విజయం నల్లేరు మీద నడకలా సాగింది. కూటమి ప్రభుత్వం కొలువుదీరి ఇంకా ఏడాది కూడా గడవలేదు . కేవలం 8 నెలలు మాత్రమే పూర్తయ్యాయి . కానీ నెల్లిమర్ల కూటమిలో మాత్రం విభేదాలు రోజురోజుకీ తారాస్థాయికి చేరుకుంటున్నాయి .ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యే లోకం మాధవి, టీడీపీ ఇన్చార్జ్ బంగార్రాజులు నువ్వెంత అంటే నువ్వెంత అంటూ బహిరంగంగానే వాగ్యుద్ధాలకు దిగారు. నెల్లిమర్ల నగర పంచాయితీ సమావేశంలో ఎమ్మెల్యే మాధవి ఆయన్ని గెట్ అవుట్ అంటూ అవమనపరిచారు. ఈ ఘటనను నియోజకవర్గ తెలుగు తమ్ముళ్ళు కూడా సీరియస్‌గా తీసుకున్నారు. బంగార్రాజుకి మద్దతు తెలుపుతూ సర్వసభ్య సమావేశం నిర్వహించి మాధవికి బహిరంగంగానే వార్నింగ్ ఇచ్చారు . టీడీపీ చలవతోనే గెలిచావన్న విషయాన్ని గుర్తుపెట్టుకోవాలని మండిపడ్డారు. ఆ తరువాత జనసేన, టీడీపీ పార్టీల క్రమ శిక్షణా సంఘం కమిటీలు మాధవికి, బంగార్రాజుకి ఈ విషయంలో క్లాస్ కూడా తీసుకున్నాయి . చిన్న చిన్న విభేదాలు ఉంటే సర్దుకుపోవాలి తప్ప రచ్చకెక్కడం సరికాదంటూ ఇద్దరి మధ్య సయోధ్య కుదిర్చే ప్రయత్నం చేశాయి .కానీ ఇటీవల జరుగుతున్న పరిణామాలు చూస్తుంటే ఇరు పార్టీల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గు మంటున్నట్లు కనిపిస్తుంది. గ్రామ స్థాయిలో సైతం పరిస్థితి అలానే ఉందంట. ఎక్కడా సైకిల్, గాజుగ్లాసు పార్టీలు కలిసి పనిచేసే పరిస్థితి లేదంట. ఇటీవల బూరాడపేట గ్రామంలో జరిగిన ఘర్షణ అందుకు తార్కాణంగా నిలుస్తోంది. ఓ ఫీల్డ్ అసిస్టెంట్ పోస్ట్ విషయమై రెండు పార్టీల మధ్య పెద్ద యుద్ధమే నడిచింది. ఆ పోస్టు టీడీపీ కాకుండా జనసేనకి ఎలా కేటాయిస్తారంటూ తెలుగు తమ్ముళ్ళు ఫైర్ అయ్యారు. రెండు వర్గాల వారు ఒకరిపై ఒక్కరూ పిడిగుద్దులు కురిపించుకోవడంతో పలువురికి గాయలయ్యాయి . దాంతో గ్రామంలో పోలీస్ పికెట్ ఏర్పాటు చేయాల్సి వచ్చింది.ఇదే కాదు నియోజకవర్గంలో నిత్యం పలు ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా ఎమ్మెల్యే లోకం మాధవి భర్త లోకం ప్రసాద్ ఇన్‌వాల్వ్‌మెంట్ పెరగడంతోనే విభేదాలు వస్తున్నాయని.. రెండు పార్టీలకు చెందిన కొందరు నాయకులు ఓపెన్‌గానే చెప్తున్నారు. పోలింగ్ వరకు టీడీపీ ఇంచార్ బంగార్రాజుతో కలిసికట్టుగా పని చేసిన లోకం మాధవి.. గెలిచిన తరువాత బంగార్రాజుతో పాటు టీడీపీ శ్రేణులను కూడా పట్టించుకోవడం మానేశారని.. అందుకు ఆమె భర్త పెత్తనమే కారణమన్న విమర్శలున్నాయి. స్థానికంగా బలోపేతమవ్వడానికి లోకం మాధవి భర్త వైసీపీ వారిని చేరదీస్తూ.. జనసేనలో చేర్చుకుంటున్నారని టీడీపీ నాయకులు బహిరంగంగానే విమర్శలు గుప్పిస్తున్నారు. ఆ క్రమంలో నెల్లిమర్ల నియోజకవర్గంలో టీడీపీని పూర్తిగా నిర్వీర్యం చేసే దిశగా స్థానిక ఎమ్మెల్యే వర్గం పావులు కదుపుతున్నారని తెలుగు తమ్ముళ్లు వాపోతున్నారు.ఇప్పుడు తెలుగు తమ్ముళ్లతో కలిసి జనసైనికులు కూడా అదే వాయిస్ వినిపిస్తుండటం హాట్ టాపిక్‌గా మారింది. మొదట్లో జనసైనికులకు పెద్ద పీట వేసిన లోకం మాధవి ఇపుడు మెల్లగా వారిని కూడా పక్కకి నెట్టేస్తున్నారట. నెల్లిమర్లకు స్థానికేతురాలైన లోకం మాధవిని పాలన వ్యవహారాల్లో ఆమె భర్త లోకం ప్రసాద్ డామినేట్ చేస్తూ .. అధికార కార్యక్రమాలు, ప్రభుత్వ పనుల్లో చేతివాటం చూపిస్తున్నారని జనసైనికులు ఆరోపిస్తున్నారు. తాము పవన్ కళ్యాణ్ ఆశయాల కోసం అహర్నిశలు పని చేస్తుంటే.. ఎమ్మెల్యే, ఆమె భర్త సొంత ప్రయోజనాల కోసం కార్పొరేట్ రాజకీయం చేస్తున్నారని జనసైనికులు మండిపడుతున్నారు.ఆ క్రమంలో నాన్ లోకల్ వాళ్ళని గెలిపించడం పెద్ద తప్పైందని నెల్లిమర్ల కూటమి శ్రేణులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి. టీడీపీ వారిని ఇప్పటికే దూరం పెట్టేసిన ఎమ్మెల్యేను జనసేన కార్యకర్తలు, ప్రజలు కలిసి సమస్యలు చెప్పుకుందామంటే కుదరడం లేదంట. ఇంటి దగ్గరకు వెళ్తే మాధవి భర్త పర్సనల్ వ్యక్తులు గేటు దగ్గరే అడ్డుకుంటూ.. ఎపుడు అడిగినా మేడమ్ బిజీ అంటూ తరిమేస్తున్నారంట.అదలా ఉంటే కూటమి కుమ్ములాటలతో వైసీపీ శ్రేణులు నవ్వుకుంటున్నాయంట. తమను ఓడించి ఇప్పుడు వాళ్ళలోవాళ్ళే కొట్టుకుంటుంటే వైసీపీ కేడర్ తెగ ఎంజాయ్ చేస్తోందంట. ఏదేమైనా ప్రత్యర్ధులను టార్గెట్ చేయాల్సిన కూటమి నాయకులు కొట్లాటలతో వారికి వారే టార్గెట్ అవుతుండటం నెల్లిమర్లలో హాట్‌టాపిక్‌గా మారిందిప్పుడు. చూడాలి మరి భవిష్యత్‌లోనైనా సర్దుకుపోతారో.. లేక వీళ్ళే సర్దేసుకొని, ప్రత్యర్థులకు పట్టం కడతారో.

# మాగంటి రిటైర్మెంట్...?

ఏలూరు, మార్చి 7, ఏలూరు మాజీ పార్లమెంటు సభ్యుడు మాగంటి బాబు రాజకీయంగా ఇబ్బందులు పడుతున్నట్లే కనిపిస్తుంది. ఆయన ఇక ప్రత్యక్ష రాజకీయాల నుంచి తప్పుకునట్లేనని చెప్పకతప్పదు. చంద్రబాబు పార్లమెంటు సీటును గత ఎన్నికల్లో మాగంటి బాబుకు ఇవ్వకుండా పక్కన పెట్టారు. బీసీలకు ఇవ్వాల్సి రావడంతో పాటు గుంటూరు, నరసరావుపేట, విజయవాడ వరసగా ఒకే సామాజికవర్గం నేతలకు టిక్కెట్లు ఇవ్వడంతో ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం టిక్కెట్ విషయంలో చంద్రబాబు మొన్నటి ఎన్నికల్లో ప్రత్యేకతను పాటించారు. యనమల రామకృష్ణుడి అల్లుడికి ఆ సీటును కేటాయించడంతో మాగంటి బాబుకు టిక్కెట్ దూరం అయిందనే చెప్పాలి. ఏలూరు పార్లమెంటు నియోజకవర్గానికి వచ్చే సరికి మాగంటి వెంకటేశ్వరరావు అలియాస్ బాబు ఈసారి చంద్రబాబు పక్కన పెట్టటానికి అనేక కారణాలున్నాయి. కొత్త వారికి అవకాశం ఇవ్వాలన్నది ఆయన అభిప్రాయం. అయితే మాగంటి కుటుంబానికి ఇక ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాలో ఒక ప్రత్యేకత ఉంది. ఆయన తండి దగ్గర నుంచి ఆయన వరకూ రాజకీయాల్లో కొనసాగారు. 1998 ఎన్నికల్లో ఏలూరు ఏంపీగా కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన మాగంటి బాబు 2009లో టీడీపీ తరుపున పోటీ చేసి ఓటమిపాలయ్యారు. తిరిగి 2014లో అదే స్థానం నుంచి గెలిచారు. 2019లో ఓటమి పాలయ్యారు. అయితే మాగంటి కుటుంబంలో వరస విషాదాలు చోటు చేసుకోవడంతో కొంత పార్టీ కార్యక్రమాలకు దూరమైనా ఎన్నికలకు ముందు యాక్టివ్ అయ్యారు.. అయితే ఎక్కువ మంది శాసనసభ నియోజకవర్గ ఇన్‌ఛార్జులు మాగంటి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకించడంతో పాటు సామాజిక వర్గాల సమీకరణ మాగంటికి టిక్కెట్ రాకుండా పోయింది. అయితే టిక్కెట్ రాకపోయినా తనకు ఏదో ఒక పదవి లభిస్తుందని మాగంటి బాబు భావించారు. రాజ్యసభ కానీ, ఎమ్మెల్సీ పదవి ఇవ్వాలని పలు మార్లు చంద్రబాబుకు మాగంటి మొర పెట్టుకున్నారు. కానీ ఏడాది గడుస్తున్నా మాగంటి బాబు గురించి టీడీపీ అధినాయకత్వం పెద్దగా పట్టించుకోవడం లేదన్న అభిప్రాయం ఆయన సన్నిహితుల్లో వ్యక్తమవుతుంది. మొన్నామధ్య మాగంటి బాబు జనసేన నేత పవన్ కల్యాణ్ ను కలవడం కూడా రాజకీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నా ఇప్పటి వరకూ సానుకూలత ఫలితం రాలేదు.అయితే ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ మాగంటి బాబుకు ఆయన సామాజికవర్గమేఆయనకు శాపంగా మారిందని చెప్పాలి.

## సీసీ కెమెరాలను పరిశీలించిన ఎస్పీ హర్షవర్ధన్ రాజు

తిరుపతి,తిరుపతి రైల్వే స్టేషన్, మహిళా పోలీస్ స్టేషన్, తిరుపతి తూర్పు పోలీస్ స్టేషన్ ను జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు పరిశీలించారు. తరువాత ఈస్ట్ పోలీస్ స్టేషన్లో కర్నాలు వీధి నుండి పూర్ణకుంభం సర్కిల్ వరకు ఏర్పాటుచేసిన 19 కెమెరాలను ఎస్పీ పరిశీలించారు. భూదేవి కాంప్లెక్స్ లో ఏర్పాటు చేసిన 12 సీసీ కెమెరాలను స్వయంగా పరిశీలించారు. సిసి కెమెరాలు క్వాలిటీ సంబంధించి క్లారిటీగా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. తిరుపతి నగరంలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడిన సహించేది లేదని హెచ్చరించారు. అంతేకాకుండా కనక భూషణం లేఔట్ లో గల పద్మావతి పార్కు, గోపాల్ రాజ్ కాలనీ, సీతమ్మధార రోడ్డు, శాంతినగర్ కాలనీలోని ప్రజలతో మాట్లాడారు. తిరుపతిలో పోలీసింగ్ పనితీరు ఎలా ఉంది..? ప్రతిరోజు రాత్రి సమయంలో నైట్ బీట్ పోలీసులు వస్తున్నారా..? లేదా .?అనే విషయాన్ని కాలనీలోని మహిళలను అడిగి తెలుసుకున్నారు. రాత్రి సమయంలో ఆకతాయిలు ఎవరైనా అల్లరి చేస్తున్నారా..? అలాంటివి ఉంటే వెంటనే తమ దృష్టి తీసుకురావాలని మహిళలకు సూచించారు. పోలీస్ పరంగా మీకు ఎమైన సమస్యలు ఉంటే వెంటనే స్థానిక పోలీస్ స్టేషన్ దృష్టికి తీసుకువెళ్లాలన్నారు. స్థానిక పోలీసులు స్పందించని పక్షంలో ఫోన్ ద్వారా గాని స్వయంగా తన కార్యాలయానికి వచ్చి గాని తెలపాలని కాలనీ వాసులకు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపై నిఘా ఉంచుతామని తెలిపినారు. ప్రశాంతతకు నిలయమైన తిరుపతిలో ఎవరైనా రాత్రి సమయంలో గానీ, పగలు సమయంలో గానీ ప్రజలను ఇబ్బంది పెట్టే కార్యక్రమాలు చేస్తే అలాంటి వారిపై కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

# ఉల్లికాడలను ఆహారంతో కలిపి తీసుకుంటున్నారా?




ఉల్లికాడలు, వీటిని స్ప్రింగ్ ఆనియన్స్ లేదా గ్రీన్ ఆనియన్స్ అని కూడా అంటారు. ఇవి వంటకాలకు ప్రత్యేక రుచిని ఇవ్వడమే కాకుండా, మన ఆరోగ్యానికి కూడా అనేక ప్రయోజనాలను కలిగిస్తాయి. ఉల్లికాడల్లో విటమిన్లు, ఖనిజాలు , యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో సహాయపడతాయి. ఉల్లికాడల వలన కలిగే కొన్ని ముఖ్యమైన ఆరోగ్య ప్రయోజనాలు చూద్దాం.. 1. రోగనిరోధక శక్తిని పెంచుతాయి: ఉల్లికాడల్లో విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. ఇది రోగనిరోధక శక్తిని పెంచడానికి చాలా అవసరం. విటమిన్ సి శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచుతుంది, ఇవి ఇన్ఫెక్షన్లతో పోరాడటానికి సహాయపడతాయి. "మహిళలు బీట్‌రూట్ జ్యూస్ తాగితే శరీరంలో కలిగే మార్పులు ఇవే.!" 2. గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి: ఉల్లికాడల్లో సల్ఫర్ సమ్మేళనాలు ఉంటాయి, ఇవి రక్తపోటును తగ్గించడానికి మరియు కొలెస్ట్రాల్ స్థాయిలను నియంత్రించడానికి సహాయపడతాయి. ఇవి గుండె జబ్బుల ప్రమాదాన్ని తగ్గిస్తాయి. ఉల్లికాడల్లోని ఫోలేట్లు హోమోసిస్టీన్ స్థాయిలను తగ్గించడంలో సహాయపడతాయి, ఇది గుండె జబ్బులకు ఒక ప్రమాద కారకం."ఎసిడిటీతో ఇబ్బంది పడుతున్నారా? హోమ్ రెమెడీస్‌తో ఇలా ట్రై చేయండి!" 3. జీర్ణక్రియను మెరుగుపరుస్తాయి: ఉల్లికాడల్లో ఫైబర్ ఉంటుంది, ఇది జీర్ణక్రియను మెరుగుపరచడంలో సహాయపడుతుంది. ఫైబర్ మలబద్ధకాన్ని నివారిస్తుంది మరియు ప్రేగు కదలికలను నియంత్రిస్తుంది. 4. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణ:"కుంకుడు కాయలతో తలస్నానం చేస్తున్నారా? " ఉల్లికాడల్లో క్రోమియం ఉంటుంది, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో సహాయపడుతుంది. క్రోమియం ఇన్సులిన్ పనితీరును మెరుగుపరుస్తుంది, ఇది రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడానికి అవసరం. 5. క్యాన్సర్ నివారణకు సహాయపడతాయి: ఉల్లికాడల్లో యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి, ఇవి ఫ్రీ రాడికల్స్ నుండి కణాలను రక్షించడంలో సహాయపడతాయి. ఫ్రీ రాడికల్స్ క్యాన్సర్ మరియు ఇతర దీర్ఘకాలిక వ్యాధులకు కారణమవుతాయి. 6. ఎముకలను బలపరుస్తాయి: ఉల్లికాడల్లో విటమిన్ కె మరియు కాల్షియం ఉంటాయి, ఇవి ఎముకల ఆరోగ్యానికి చాలా అవసరం. విటమిన్ కె ఎముకల సాంద్రతను పెంచడంలో సహాయపడుతుంది మరియు కాల్షియం ఎముకలను బలపరుస్తుంది. 7. కంటి ఆరోగ్యం: ఉల్లికాడల్లో విటమిన్ ఎ ఉంటుంది, ఇది కంటి ఆరోగ్యానికి చాలా అవసరం. విటమిన్ ఎ కంటి చూపును మెరుగుపరుస్తుంది మరియు వయస్సు-సంబంధిత మచ్చల క్షీణత ప్రమాదాన్ని తగ్గిస్తుంది. 8. చర్మం, జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి: ఉల్లికాడల్లో విటమిన్ సి మరియు యాంటీ ఆక్సిడెంట్లు ఉంటాయి, ఇవి చర్మం మరియు జుట్టు ఆరోగ్యాన్ని మెరుగుపరచడంలో సహాయపడతాయి. విటమిన్ సి కొల్లాజెన్ ఉత్పత్తిని పెంచుతుంది, ఇది చర్మాన్ని యవ్వనంగా ఉంచడానికి సహాయపడుతుంది. ఉపయోగించే విధానం: ఉల్లికాడలను అనేక రకాలుగా ఉపయోగించవచ్చు. వాటిని సలాడ్లలో, సూప్‌లలో, కూరలలో, ఇతర వంటకాలలో ఉపయోగించవచ్చు. వాటిని పచ్చిగా లేదా వండిన తర్వాత తినవచ్చు.అయితే కొంతమందికి ఉల్లికాడలు అలెర్జీని కలిగించవచ్చు. అలెర్జీ లక్షణాలు ఉంటే, వాటిని తీసుకోవడం మానేయాలి. ఈ సమాచారం కేవలం మీ అవగాహన కోసం మాత్రమే. ఏదైనా ఆరోగ్య సమస్య ఉంటే, వైద్యుడిని సంప్రదించడం మంచిది.

# బరువు తగ్గి స్లిమ్ గా కనిపించాలా? సూపర్ డ్రింక్.. వంద శాతం రిజల్ట్!



ఊబకాయం ఇప్పుడు ప్రతి ఒక్కరిని పీడిస్తున్న సమస్య. ఊబకాయం ఒకటి చాలు మనకు గంపగుత్తగా అనారోగ్య సమస్యలను తీసుకురావడానికి.. ఊబకాయంతో ఎవరైతే బాధపడతారో వారికి మధుమేహం, అధిక రక్తపోటు, కొలెస్ట్రాల్ సమస్య కూడా వచ్చే అవకాశం ఉంటుంది. బరువు తగ్గాలంటే ఈ ద్రావణం తీసుకోండి అయితే బరువు తగ్గడానికి ఎన్ని ప్రయత్నాలు చేసినా బరువు తగ్గని వారు ప్రతి రోజు ఉదయం వేడి నీళ్లలో ఒక పదార్థాన్ని కలుపుకొని తాగితే ఈజీగా బరువు తగ్గుతారు. మన బరువును తగ్గించి మనల్ని స్లిమ్ చేసే ఆ అద్భుతమైన ద్రావణం ఏమిటి? దానిని ఏ విధంగా తీసుకుంటే మనం బరువు తగ్గుతాము? అనేది ప్రస్తుతం మనం తెలుసుకుందాం. "మహిళలు బీట్‌రూట్ జ్యూస్ తాగితే శరీరంలో కలిగే మార్పులు ఇవే.!" బరువు తగ్గటానికి సహజ మార్గాలే బెస్ట్ బరువు తగ్గడానికి ప్రయత్నం చేసే సమయంలో సైడ్ ఎఫెక్ట్స్ రాకుండా కూడా జాగ్రత్తలు తీసుకోవాలి. సహజ మార్గాల ద్వారా బరువు తగ్గడం, కొద్ది కొద్దిగా బరువు తగ్గడమే మంచిది అని చాలామంది నిపుణులు చెబుతారు. బరువు తగ్గడానికి మొదట తక్కువ క్యాలరీల ఆహారాన్ని తీసుకోవాలని సూచిస్తారు. అంతే కాదు కొన్ని శక్తివంతమైన పానీయాలు తాగడం వల్ల కూడా బరువు తగ్గవచ్చునని చెబుతున్నారు. యాపిల్ సైడర్ వెనిగర్ తో అధిక బరువుకు చెక్ ఇక అటువంటి పానీయాల విషయానికి వస్తే వాటిల్లో ముఖ్యంగా చెప్పదగింది యాపిల్ సైడర్ వెనిగర్. ఈ ఆపిల్ సైడర్ వెనిగర్ ను ప్రతిరోజు మనం ఉదయం గోరువెచ్చని నీటిలో కలిపి తాగడం వల్ల వేగంగా బరువు తగ్గే అవకాశం ఉంటుంది. మనం త్వరగా బరువు తగ్గాలంటే ఉదయం ఖాళీ కడుపుతో ఒక గ్లాసు గోరువెచ్చని నీటిని సుమారు 20 మిల్లీలీటర్ల యాపిల్ సైడర్ వెనిగర్ తో కలిపి తీసుకుంటే మంచి ఫలితం ఉంటుంది. ఇలా చేస్తే డేంజర్ ... జాగ్రత్త ఇది మాత్రమే కాకుండా భోజనానికి 15 నిమిషాలు ముందు కూడా ఆపిల్ సైడర్ వెనిగర్ ను తీసుకుంటే ఇది మన ఆహారం జీర్ణం కావడానికి దోహదం చేస్తుంది. అయితే బరువు తగ్గుతామని ఆపిల్ సైడర్ వెనిగర్ ను తరచూ తీసుకుంటే మాత్రం అనవసరమైన అనారోగ్య సమస్యల బారిన పడాల్సి వస్తుంది. పరిమిత మోతాదులో ఆపిల్ సైడర్ వెనిగర్ ను తీసుకోవడం వల్ల ఇది మన ఆకలిని తగ్గిస్తుంది. "రెడ్ వైన్ తాగటం మంచిదా.. కాదా? తప్పక తెలుసుకోవాల్సిందే!" యాపిల్ సైడర్ వెనిగర్ తో ప్రయోజనాలు ఇలా అనవసరమైన అనారోగ్యకరమైన ఆహారాన్ని నిరోధిస్తుంది. ఇది మన శరీరంలో అదనపు కేలరీలు తీసుకోకుండా కాపాడుతుంది. మన కొవ్వును కరిగిస్తుంది. వేగంగా బరువు తగ్గడానికి దోహదం చేస్తుంది. యాపిల్ సైడర్ వెనిగర్ మన శరీరంలో జీవక్రియను మెరుగుపరుస్తుంది. జీర్ణ క్రియను కూడా మెరుగుపరుస్తుంది. ఆహారం నుండి పోషకాలను గ్రహించడంలోనూ సహాయం చేస్తుంది. కనుక ప్రతిరోజు క్రమం తప్పకుండా పరిమిత మోతాదులో యాపిల్ సైడర్ వెనిగర్ తీసుకుంటే బరువు తగ్గి స్లిమ్ గా కనిపిస్తారు.

# ఎసిడిటీతో ఇబ్బంది పడుతున్నారా? హోమ్ రెమెడీస్‌తో ఇలా ట్రై చేయండి!



ఎసిడిటీ అనేది తరచూ చాలా మందిని బాధించే ఒక సాధారణ ఆరోగ్య సమస్య. కడుపులో అధికంగా ఆమ్లం ఉత్పత్తి అయినప్పుడు, గుండెల్లో మంట, పుల్లటి తేన్పులు, కడుపు నొప్పి వంటి లక్షణాలు కనిపిస్తాయి. ఇది ఎక్కువగా అవుట్‌డోర్ ఫుడ్, జంక్ ఫుడ్, లేదా ఎర్ర మసాలా పదార్థాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల సంభవిస్తుంది. అయితే, ఎసిడిటీని తగ్గించడానికి హోమ్ రెమెడీస్ అనేవి చాలా ఉపయుక్తంగా ఉంటాయి. ఇవి సులభంగా లభిస్తాయి మరియు ఆహార అలవాట్లలో చిన్న మార్పులతో ఎసిడిటీ సమస్యను నియంత్రించవచ్చు. 1. చల్లటి పాలు: పాలలో కాల్షియం ఉంటుంది, ఇది కడుపులోని ఆమ్లాన్ని తటస్థీకరించడానికి సహాయపడుతుంది. ఎసిడిటీగా ఉన్నప్పుడు ఒక గ్లాసు చల్లటి పాలు తాగితే తక్షణ ఉపశమనం లభిస్తుంది. "మహిళలు బీట్‌రూట్ జ్యూస్ తాగితే శరీరంలో కలిగే మార్పులు ఇవే.!" 2. అరటిపండు: అరటిపండులో సహజ యాంటాసిడ్లు ఉంటాయి, ఇవి కడుపులోని ఆమ్లాన్ని తగ్గిస్తాయి. ప్రతిరోజు ఒక పండిన అరటిపండు తినడం వల్ల ఎసిడిటీని నివారించవచ్చు. 3. కొబ్బరి నీరు: కొబ్బరి నీరు ఎసిడిటీని తగ్గించడంలో చాలా ప్రభావవంతంగా పనిచేస్తుంది. ఇది కడుపులోని ఆమ్లాన్ని తటస్థీకరించడమే కాకుండా, శరీరానికి చల్లదనాన్ని కూడా అందిస్తుంది. 4. తులసి ఆకులు: తులసి ఆకుల్లో ఉండే ఔషధ గుణాలు ఎసిడిటీని తగ్గించడంలో సహాయపడతాయి. కొన్ని తులసి ఆకులను నమలడం లేదా తులసి ఆకుల టీ తాగడం వల్ల ఉపశమనం పొందవచ్చు. "మినప గారెలు, కొచ్చరి చట్నీ కలిపి తింటున్నారా? " 5. అల్లం: అల్లం జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది . ఎసిడిటీని తగ్గిస్తుంది. అల్లం టీ తాగడం లేదా భోజనంలో అల్లాన్ని ఉపయోగించడం మంచిది. 6. సోంపు గింజలు: సోంపు గింజలు జీర్ణక్రియకు సహాయపడతాయి . ఎసిడిటీని తగ్గిస్తాయి. భోజనం తర్వాత కొన్ని సోంపు గింజలు నమలడం వల్ల ప్రయోజనం ఉంటుంది. 7. మజ్జిగ: మజ్జిగలో లాక్టిక్ యాసిడ్ ఉంటుంది, ఇది కడుపులోని ఆమ్లాన్ని నియంత్రిస్తుంది. భోజనం తర్వాత మజ్జిగ తాగడం వల్ల ఎసిడిటీని నివారించవచ్చు. "కుంకుడు కాయలతో తలస్నానం చేస్తున్నారా? " 8. జీలకర్ర నీరు: జీలకర్ర నీరు కడుపులోని ఆమ్లాన్ని తటస్థీకరించడానికి సహాయపడుతుంది. ఒక గ్లాసు నీటిలో ఒక టీస్పూన్ జీలకర్ర వేసి మరిగించి, చల్లార్చి తాగాలి. 9. యాపిల్ సైడర్ వెనిగర్: యాపిల్ సైడర్ వెనిగర్ కడుపులోని జూఊ స్థాయిని సమతుల్యం చేయడానికి సహాయపడుతుంది. ఒక గ్లాసు నీటిలో ఒక టీస్పూన్ యాపిల్ సైడర్ వెనిగర్ కలిపి తాగాలి. 10. ఆహార నియమాలు: నూనె , మసాలాలు ఎక్కువగా ఉన్న ఆహారాలకు దూరంగా ఉండాలి. సమయానికి భోజనం చేయాలి . ఎక్కువసేపు ఖాళీ కడుపుతో ఉండకూడదు. ఆల్కహాల్ , ధూమపానం మానుకోవాలి. పుల్లటి పండ్లు, సిట్రస్ పండ్లను తక్కువగా తీసుకోవాలి. ఎక్కువ నీరు త్రాగాలి. ఈ హోం రెమెడీస్‌తో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించడం కూడా చాలా ముఖ్యం. సమస్య తీవ్రంగా ఉంటే, వైద్యుడిని సంప్రదించడం మంచిది.

# బిస్కెట్లు తినే అలవాటుంటే నేరుగా పైకే!

బిస్కెట్లు అంటే చిన్నారుల నుంచి పెద్దల వరకు అందరికీ ఇష్టమైన చిరుతిండి. ఈ రుచికరమైన చిరుతిండి ఆరోగ్యానికి ఎంతో హానికరం అనే విషయం చాలామందికి తెలియదు. బిస్కెట్లు తినే అలవాటు ఉండటంవల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని వైద్యనిపుణులు హెచ్చరిస్తున్నారు. చాలా రకాల బిస్కెట్లలో కేలరీలు అధికంగా ఉంటాయి. ఇవి మనం రోజువారీ తీసుకోవాల్సిన కేలరీల కంటే ఎక్కువగా ఉండి శరీరంలో కొవ్వు పెరిగి, ఊబకాయం వచ్చే ప్రమాదం ఉంది. కెమికల్స్ కలుపుతారు బిస్కెట్లలో చక్కెర అధికంగా ఉంటుంది. ఇది రక్తంలో చక్కెర స్థాయిని పెంచి, డయాబెటిస్ వచ్చే ప్రమాదాన్ని తీవ్రంగా పెంచుతుంది. కొన్ని రకాల బిస్కెట్లలో హానికరమైన కొవ్వులు ఎక్కువగా ఉంటాయి. ఇవి గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని పెంచుతాయి. బిస్కెట్లలో ఫైబర్ తక్కువగా ఉంటుంది. ఫైబర్ జీర్ణక్రియకు మంచిది. ఫైబర్ తక్కువగా ఉన్న ఆహారం తీసుకోవడం వల్ల మలబద్ధకం వస్తుంది. చాలా బిస్కెట్లలో కృత్రిమ రంగులు, రుచులు ఉంటాయి. ఇవి ఆరోగ్యాన్ని పాడుచేస్తాయి. బిస్కెట్లలో అనేక రకాల రసాయనాలు కలుపుతారు. ఎన్ని నెలలు గడిచినా ముక్కిపోయిన వాసన రాకుండా ఉండేందుకు, అలాగే కరకరలాడుతూ ఉండేందుకు, రుచిగా ఉండేందుకు.. ఇలా దాదాపుగా ఆరు నుంచి ఎనిమిది వరకు రసాయనాలు కలుపుతారని, వాటిని తినకపోతే వచ్చే నష్టమేమీ ఉండదని వైద్యులు చెబుతున్నారు. ంశ్రీబనీ ఖీవజీట "వేగంగా బరువు తగ్గేందుకు వాటర్ థెరపీ.. ఇలా ట్రై చెయ్యండి!" పళ్లు పాడవుతాయి బిస్కెట్లలో సోడియం అధికంగా ఉంటుంది. ఇది రక్తపోటును పెంచి, గుండె జబ్బులు వచ్చే ప్రమాదాన్ని పెంచుతుంది. బిస్కెట్లలో ఉండే చక్కెర దంతాలపై పేరుకుపోయి, దంతాలు పాడవడానికి కారణమవుతుంది. కొంతమందికి బిస్కెట్లలో ఉండే కొన్ని పదార్థాలవల్ల అలర్జీ వస్తుంది. బిస్కెట్లు తరచూ తినడం వల్ల బరువు పెరుగుతారు. బిస్కెట్లు తినాలనుకుంటే తక్కువ మొత్తంలో తినాలి. చక్కెర, కొవ్వు, సోడియం తక్కువగా ఉండే ఆరోగ్యకరమైన బిస్కెట్లను ఎంచుకోండి. బిస్కెట్లకు బదులుగా పండ్లు, కూరగాయలు, గింజలు వంటి ఆరోగ్యకరమైన ఆహారాలను తీసుకోవడం అన్నింటికంటే ఉత్తమం. బిస్కెట్లు తినడం వల్ల అనేక ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉంది కాబట్టి వీటిని ఎంత తక్కువగా తీసుకుంటే అంత మేలు. ఆరోగ్యకరమైన జీవనశైలి కావాలంటే బిస్కెట్లను మానివేయాలి.




# మినప గారెలు, కొచ్చరి చట్నీ కలిపి తింటున్నారా?

వింటే భారతం వినాలి.. తింటే గారెలు తినాలి అనేది తెలుగు భాష ఆవిర్భవించినప్పటి నుంచి ఉన్న సామెత. మహాభారతం ఎంత బాగుంటుందో తినడానికి మినపగారెలు కూడా అంతే బాగుంటాయి. వాటి రుచి వేరు. మహా కవులు, రచయితలెందరో తమ భార్యలను మినప గారెలు చేసిపెట్టమని వేడుకున్నవారే. అంతటి మహానుభావులే ఆ గారెలకు దాసులయ్యారు. వీటిని కొబ్బరి పచ్చడితో కలిపి తింటే మరింత రుచికరంగా ఉంటుంది. వీటితోపాటు పుదీనా పచ్చడి, నారింజ పచ్చడి కూడా గారెలకు బాగా సరిపోతుంది. మినప గారెల ఆరోగ్య ప్రయోజనాలు మినప పప్పును బాగా నానబెట్టిన తర్వాత మెత్తగా రుబ్బాలి. బాండీలో వీటిని వేయడానికి ముందు పిండితో కొంచెం ఉప్పు, కారప్పొడి కలపాలి. నూనెలో బంగారు రంగు వచ్చే వరకు వేయాలి. మినప పప్పు ప్రోటీన్‌కు మంచి మూలం. ప్రోటీన్ శరీరానికి బలం ఇచ్చి కండరాల నిర్మాణానికి సహాయపడుతుంది. అంతేకాదు.. జీవక్రియను



మెరుగుపరుస్తుంది. గారెలు ఫైబర్‌తో ఉండటంవల్ల మలబద్ధకాన్ని నివారిస్తాయి. బరువును నియంత్రణలో ఉంచుకోవచ్చు. మినప పప్పులో విటమిన్లు, ఖనిజాలు, ఇనుము పుష్కలంగా ఉంటాయి. రక్తహీనతను నివారించడానికి ఇనుము సహాయపడుతుంది."రెడ్ వైన్ తాగటం మంచిదా.. కాదా? తప్పక తెలుసుకోవాల్సిందే!" గుండె ఆరోగ్యంగా ఉంటుంది మినప పప్పులోని ఫైబర్, ఇతర పోషకాలు గుండె ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. పప్పులోని గ్లైసెమిక్ ఇండెక్స్ తక్కువగా ఉంటుంది. ఇది రక్తంలోని చక్కెర స్థాయిలను నియంత్రించడానికి తోడ్పడుతుంది. వీటిల్లో రకరకాల గారెలు కూడా ఉన్నాయి. సాధారణంగా మనం ఇంట్లో వేసుకునే గారెలు కాకుండా ఉల్లిపాయ మినప గారెలు, పచ్చిమిరపకాయ గారెలు, కరివేపాకు గారెలు.. ఇలా రకరకాల గారెలు ఉంటాయి. తినడానికి గారెలు మాత్రం ఆరోగ్యకరమైన ఎంపిక అవడమే కాకుండా మన ఆహారంలో ఒక భాగం చేసుకుంటే ఎంతో ఆరోగ్యవంతంగా ఉండొచ్చని పోషకాహార నిపుణులు చెబుతున్నారు. ఇంకెందుకు ఆలస్యం.. ప్రతిరోజు కనీసం రెండు గారెలు తినండి.




# మరోసారి వైరల్‌గా కొత్త జంట



అక్కినేని నాగ చైతన్య, శోభితల వివాహం గత ఏడాది డిసెంబర్ 4న వైభవంగా జరిగింది. అన్నపూర్ణ స్టూడియోలోని ఏఎన్నార్ విగ్రహం ముందు ఇరు కుటుంబాల సమక్షంలో ఈ వివాహం జరిగింది. చైతూ, శోభితల వివాహానికి సంబంధించిన ఫోటోలు, వీడియోలో సోషల్ మీడియాలో దాదాపు రెండు వారాల పాటు వైరల్ అయ్యాయి. పెళ్లికి ముందు జరిగిన కార్యక్రమాలు, పెళ్లి తర్వాత జరిగిన కార్యక్రమాలు ఇలా ప్రతి సందర్భంలోనూ వీరిద్దరి ఫోటోలు సోషల్ మీడియాలో తెగ చక్కర్లు కొట్టాయి. తాజాగా మరోసారి వీరిద్దరి ఫోటో సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తూ తెగ వైరల్ అవుతోంది. అక్కినేని ఫ్యాన్స్ ఈ ఫోటోను తెగ షేర్ చేస్తున్నారు.నాగ చైతన్య, శోభిత చివరిసారిగా తండేల్ సినిమా ఈవెంట్ సందర్భంగా కనిపించారు. ఆ సమయంలో తీసిన ఫోటోలు, వీడియోలు సైతం వైరల్ అయ్యాయి. తాజాగా మరోసారి వీరిద్దరు ఒకే ఫ్రేమ్ లో కనిపించారు. ఇటీవలే తండేల్ సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చి విజయాన్ని సొంతం చేసుకున్న నాగ చైతన్య విజయానందం లో ఉన్నారు. త్వరలోనే చైతూ కొత్త సినిమా షూటింగ్‌కి జాయిన్ కాబోతున్నారు. అంతకు ముందు భార్య శోభితతో కలిసి విదేశాలకు హాలీడే ట్రిప్‌కి వెళ్లినట్లు తెలుస్తుంది. అక్కడ సింపుల్‌గా నాగ చైతన్య, శోభిత ఇలా కూర్చుని తింటున్న ఫోటోలను క్లిక్ అనిపించారు. ఆ ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో వైరల్ అవుతోంది. స్టైలిష్ లుక్‌లో నాగ చైతన్య కనిపించగా, శోభిత సింప్లీ సూపర్ అన్నట్లుగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇద్దరి జోడీ చూడ చక్కగా ఉందని, వీరిద్దరూ కలకాలం సంతోషంగా జీవితాన్ని సాగించాలని కోరుకుంటూ పలువురు సోషల్ మీడియా ద్వారా శుభాకాంక్షలు తెలియజేస్తూ పోస్టులు చేస్తున్నారు. నాగ చైతన్య, శోభిత జోడీని ఇలా చూసిన వారిలో చాలా మంది వీరిద్దరూ కలిసి ఒక సినిమాలో నటిస్తే బాగుంటుంది కదా అనే ఆలోచన చేస్తున్నారు. కానీ ఇప్పట్లో వీరి కాంబోలో సినిమా వచ్చే అవకాశాలు లేవు. ఎందుకంటే శోభిత ప్రస్తుతం బాలీవుడ్‌లో బిజీగా ఉంది. అక్కడ సినిమాలు, సిరీస్‌ల్లో నటిస్తున్న విషయం తెల్సిందే.నాగ చైతన్య తండేల్ సినిమాతో మొదటి సారి వంద కోట్ల కలెక్షన్స్ క్లబ్‌లో చేరిన నేపథ్యంలో తదుపరి సినిమాపై అంచనాలు భారీగా ఉన్నాయి. అందుకు తగ్గట్లుగానే చైతూతో కార్తీక్ వర్మ దండు ఒక సినిమాను ప్లాన్ చేస్తున్నాడు. భారీ బడ్జెట్‌తో రూపొందబోతున్న ఈ సినిమాను నిర్మించబోతున్నారు. నాగ చైతన్యకు కథ బాగా నచ్చడంతో మరోసారి ఏడాది టైం కేటాయించేందుకు ఓకే చెప్పాడట. సినీ వర్గాల ద్వారా అందుతున్న సమాచారం ప్రకారం ఈ పీరియాడిక్ డ్రామా నేపథ్యంలో ఈ సినిమా రూపొందబోతున్నట్లు సమాచారం అందుతోంది. తండేల్ తర్వాత మరో వంద కోట్ల సినిమా కోసం అక్కినేని ఫ్యాన్స్ ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. మరి కార్తీక్ వర్మ దండు ఆ ఎదురుచూపులకు తెర దించేనా చూడాలి.

# కయాదు సెలబ్రిటీ క్రష్ ఎవరో తెలుసా?



ప్రస్తుతం సోషల్ మీడియాలో తెగ వినిపిస్తున్న పేరు కయాదు లోహర్. రీసెంట్ గా డ్రాగన్ మూవీతో ఆడియన్స్ ను అలరించిన ఈ అస్సాం బ్యూటీ సౌత్ ఇండస్ట్రీలో బాగా బిజీ అయిపోయింది. డ్రాగన్ మూవీలో కయాదు అందానికి, చిలిపితనానికి యూత్ మొత్తం ఫిదా అయిపోయారు. సోషల్ మీడియా ఓపెన్ చేస్తే చాలు ఎక్కడ చూసినా కయాదుకి సంబంధించిన ఫోటోలు, వీడియోలే కనిపిస్తున్నాయి. తక్కువ టైమ్ లోనే యూత్ మనసుల్ని కొల్లగొట్టి క్రష్ గా మారిన కయాదుకి సెలబ్రిటీ క్రష్ ఎవరో తెలుసా? రీసెంట్ గా తమిళనాడులోని ఓ ఈవెంట్ లో అమ్మడిని ఈ ప్రశ్న అడగ్గా అమ్మడు చెప్పిన ఆన్సర్ ఇప్పుడు నెట్టింట వైరలవుతోంది. తన సెలబ్రిటీ క్రష్ దళపతి విజయ్ అని, అందులో ఎలాంటి డౌట్ లేదని అమ్మడు తెలిపింది. దళపతి తన క్రష్ అని చెప్పిన కయాదు, విజయ్ సినిమాలన్నింటిలో తనకు తేరి సినిమా అంటే చాలా ఇష్టమని చెప్పింది. అంతేకాదు, అదే ఈవెంట్ లో కయాదు విజయ్ ఫేమస్ సాంగ్ అపిడి పోడే పోడే సాంగ్ కు స్టేజ్ మీద డ్యాన్స్ వేసి అలరించింది. దీంతో విజయ్ ఫ్యాన్స్ ఆ వీడియోను వైరల్ చేస్తున్నారు. డ్రాగన్ మూవీ ప్రమోషన్స్ టైమ్‌లో టాలీవుడ్ లో తనకు ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ అంటే ఇష్టమని చెప్పిన సంగతి తెలిసిందే. ముగిల్ పేటె అనే కన్నడ సినిమాతో సినీ ఇండస్ట్రీకి పరిచయమైన కయాదు ఆ తర్వాత మలయాళంలో ఓ మూవీ చేసింది. అల్లూరి సినిమాతో టాలీవుడ్ లోకి ఇప్పటికే ఎంట్రీ ఇచ్చిన కయాదుకి ఆ సినిమా ఫ్లాప్ అవడంతో పెద్దగా గుర్తింపు రాలేదు. ఇప్పుడు డ్రాగన్ హిట్ అవడంతో అమ్మడికి ఒక్కసారిగా క్రేజ్ పెరిగింది. ప్రస్తుతం కయాదు, విశ్వక్ సేన్ సరసన ఫంకీ సినిమాలో నటిస్తున్న విషయం తెలిసిందే.

# ప్రభాస్ కోసం దిల్ రాజు 'జటాయు'.. ప్లాన్ చేంజ్!

టాలీవుడ్‌లో ఎప్పుడూ కొత్త ప్రయోగాలకు సిద్ధమయ్యే నిర్మాతల్లో దిల్ రాజు ఒకరు. భారీ సినిమాలను ప్రొడ్యూస్ చేయడంలో ఎప్పుడూ ముందుండే ఆయన గతంలో దర్శకుడు ఇంద్రగంటి మోహనకృష్ణతో కలిసి జటాయు అనే ఫాంటసీ అడ్వెంచర్ ప్రాజెక్ట్ ప్లాన్ చేశారు. దీనిని విజయ్ దేవరకొండతో పాన్ ఇండియా లెవెల్‌లో రూపొందించాలని, భారీ బడ్జెట్‌తో తెరకెక్కించాలని నిర్ణయించారు. స్టోరీ పరంగానే కాకుండా ఈ సినిమా గ్రాండ్ విజువల్స్, కొత్త కాన్సెప్ట్‌తో యూనిక్ సినిమాగా ఉండబోతుందనే టాక్ వినిపించింది. కానీ కొన్ని కారణాల వల్ల ఈ ప్రాజెక్ట్ ముందుకెళ్లలేదు. స్క్రిప్ట్ లెవెల్ నుంచే జటాయు పట్ల దిల్ రాజుకు పూర్తిగా సంతృప్తికి రాలేదని సమాచారం. మోహనకృష్ణ ఇంద్రగంటి కథా కథనాలను ఎంతో జాగ్రత్తగా డెవలప్ చేస్తున్నప్పటికీ, ఈ ప్రాజెక్ట్‌ను విజయవంతంగా నిలబెట్టే విధంగా స్క్రీన్‌ప్లే లేదనే అభిప్రాయంతో దిల్ రాజు వెనక్కి తగ్గారని టాక్. స్క్రిప్ట్‌లో మరిన్ని మార్పులు చేయాలనుకుంటున్నా, కాంబినేషన్ ను నమ్మి అంత భారీ బడ్జెట్ పెట్టి రిస్క్ తీసుకోవడం సరైనదేమో అనే అనుమానాలు నిర్మాతలో మొదలయ్యాయి. అదే సమయంలో విజయ్ దేవరకొండ నటించిన లైగర్ చిత్రం భారీ స్థాయిలో ఫ్లాప్ అవ్వడం కూడా దిల్ రాజు నిర్ణయంపై ప్రభావం చూపింది. పాన్ ఇండియా రేంజ్‌లో వచ్చిన ఆ సినిమా పూర్తిగా విఫలమై, డిస్ట్రిబ్యూటర్లకు పెద్ద నష్టాన్ని మిగిల్చింది. దీంతో విజయ్ మీద అంత భారీ బడ్జెట్ పెట్టడం, ముఖ్యంగా ఒక ఫాంటసీ అడ్వెంచర్ తరహా సినిమాకు ఆయనని సెలెక్ట్ చేయడం సరైన నిర్ణయమా అనే డౌట్స్ నిర్మాతలో ఎక్కువయ్యాయి. దీంతో హీరోను మార్చాలని నిర్ణయం తీసుకున్నారు. కేవలం హీరో మాత్రమే కాదు, డైరెక్టర్ ఎంపిక విషయంలోనూ దిల్ రాజు కొత్త ఆలోచనలో పడ్డారు. మోహనకృష్ణ ఇంద్రగంటి ఇప్పటి వరకు పెద్ద బడ్జెట్ సినిమాలు డీల్ చేయలేదు. ఆయన దర్శకత్వంలో వచ్చిన ఎ సినిమా కూడా మిక్స్‌డ్ రెస్పాన్స్ తెచ్చుకుంది. ఓటీటీలో విడుదలైనా ఆ ప్రాజెక్ట్ మీద పెద్దగా హైప్ రాలేదు. దీంతో మోహనకృష్ణ దర్శకత్వంలో భారీ సినిమా ప్లాన్ చేయడం సేఫ్ కాదనే సలహాలు కూడా వచ్చాయట. ప్రస్తుతం దిల్ రాజు ఈ జటాయు ప్రాజెక్ట్‌ను పూర్తిగా కొత్త దారిలో తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నట్లు సమాచారం. కొత్త దర్శకుడు, కొత్త రైటర్స్‌తో కథను మరింత కమర్షియల్‌గా, భారీగా తీర్చిదిద్దే పనిలో ఉన్నారని టాక్. ఇప్పటికే స్క్రిప్ట్‌ను మరింత గ్రిప్పింగ్‌గా మలచేందుకు రైటర్స్ టీమ్‌ను ఏర్పాటు చేసినట్లు తెలుస్తోంది. కొత్త దర్శకుడిగా ఓ ఫ్రెష్ టాలెంట్‌ను తీసుకురావాలని, బిగ్ స్కేల్ విజువల్స్‌తో ఈ సినిమాను అత్యద్భుతంగా మలచాలని దిల్ రాజు ప్లాన్ చేస్తున్నారని ఫిల్మ్ నగర్ వర్గాల్లో చర్చ నడుస్తోంది. దిల్ రాజు చాలా కాలంగా ప్రభాస్ తో సినిమా చేయాలని చూస్తున్న సంగతి తెలిసిందే. అయితే ఇప్పటి వరకు తగిన కథ దొరకక పోవడంతో ప్రాజెక్ట్ రాలేదు. ఇప్పుడు జటాయు కథతో ప్రభాస్‌ను అప్రోచ్ చేసే యోచనలో ఉన్నాడని టాక్. ప్రభాస్ సినిమాలకు పాన్ వరల్డ్ మార్కెట్ ఉండటంతో, భారీ బడ్జెట్‌ను జస్టిఫై చేయగల హీరోగా ఆయనే సరైన ఎంపిక అని భావిస్తున్నారు.







# మెగాస్టార్ తో అనిల్.. ఓ 'గేమ్ ఛేంజర్

మెగాస్టార్ చిరంజీవి – అనిల్ రావిపూడి కాంబినేషన్‌లో రాబోయే సినిమా టాలీవుడ్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. కామెడీ, మాస్ ఎంటర్‌టైన్‌మెంట్‌తో ప్రేక్షకులను ఆకట్టుకునే అనిల్ రావిపూడికి ఇది గోల్డెన్ ఛాన్స్. ఎందుకంటే, చిరంజీవి తన స్టైల్‌లో ఉంటూనే పూర్తిగా అనిల్ మార్క్ కామెడీ, మాస్ యాక్షన్ మిక్స్ చేసిన సినిమా చేయబోతున్నారని టాక్. ముఖ్యంగా, ఈ ప్రాజెక్ట్‌ను కేవలం 90 రోజుల్లో పూర్తి చేయాలనే టార్గెట్ తో రావిపూడి ముందుకెళ్తున్నాడు. ఇది నేటి సినిమా ఇండస్ట్రీలో చాలా అరుదైన పరిస్థితి.అనిల్ రావిపూడికి టాలీవుడ్‌లో చాలా మంచి ట్రాక్ రికార్డ్ ఉన్నప్పటికీ, ఇప్పటి వరకు పూర్తిగా పాన్ ఇండియా లెవెల్‌లో ట్రై చేయలేదు. కానీ ఈ సినిమా ఆయన కెరీర్‌ను కొత్త దిశలో నడిపించే అవకాశం ఉంది. చిరంజీవి వంటి స్టార్‌తో 90 రోజుల్లో సినిమా పూర్తి చేస్తే, అతని మీద ఇండస్ట్రీలోని పెద్ద హీరోలకు కూడా ఒక కొత్త నమ్మకం వస్తుంది. ప్రస్తుతం ప్రభాస్, ఎన్టీఆర్ వంటి పాన్ ఇండియా హీరోలు దర్శకుల ఎంపిక విషయంలో చాలా కేర్ తీసుకుంటున్నారు. అనిల్ రావిపూడి తన కథల స్పాన్‌ను పెంచుకుంటూ, గ్రాండియర్ సినిమాలను కూడా జెట్ స్పీడ్‌లో ఫినిష్ చేయగలడు అనే పేరు తెచ్చుకుంటే, ఆ రేంజ్ స్టార్స్ కూడా అతనితో పని చేయడానికి ఆసక్తి చూపించే అవకాశం ఉంటుంది. చిరంజీవి సినిమాలు గతంలో ఎక్కువగా లాంగ్ షెడ్యూల్స్‌తో నిర్మితమయ్యాయి. కానీ అనిల్ రావిపూడి సినిమాలు ఎక్కువ రోజులు తీసుకునే ట్రాక్‌లో ఉండవు. అతను తన స్క్రిప్ట్‌ను టార్గెట్ చేసుకున్న సమయానికి పూర్తి చేయడంలో దిట్ట. ఈ సినిమా కూడా అదే ఫార్మాట్‌లో ఉంటే, అది ఇండస్ట్రీకి ఒక సరికొత్త ట్రెండ్ సెట్ చేసేలా ఉంటుంది. గతంలో చాలా సినిమాలు లాంగ్ డ్యూరేషన్ షూటింగ్‌ల కారణంగా విడుదల ఆలస్యమయ్యాయి. కానీ రావిపూడి సినిమా 90 రోజుల్లో ఫినిష్ అయితే, ఫ్యూచర్‌లో స్టార్ హీరోలు కూడా తక్కువ సమయంలో పెద్ద సినిమాలు చేయడానికి ఆసక్తి చూపించే అవకాశముంది. ఈ ప్రాజెక్ట్ అనిల్ రావిపూడి కెరీర్‌లో గేమ్ చెంజింగ్ లాంటిదని చెప్పవచ్చు. ఎందుకంటే, ఇప్పటివరకు ఆయన ఎక్కువగా మాస్, కామెడీ ఎంటర్‌టైనర్స్ చేసినప్పటికీ, ఈసారి మెగాస్టార్‌తో వస్తున్నాడు. చిరు సినిమాలకి ఉండే గ్రాండ్‌నెస్, అనిల్ రావిపూడి సినిమా స్క్రీన్‌ప్లే కలిసి ఒక పవర్‌ఫుల్ కాంబినేషన్‌ను క్రియేట్ చేసే అవకాశముంది., ఈ3, సరిలేరు నీకెవ్వరు, సంక్రాంతికి వస్తున్నాం వంటి చిత్రాలు తన మార్క్‌ను చూపించాయి. కానీ చిరంజీవితో సినిమా అనిల్ రేంజ్‌ను ఒక అడుగు ముందుకు తీసుకెళ్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. ఈ సినిమా సంక్రాంతి 2026కి రెడీ అవుతుందని ఇప్పటికే అధికారికంగా అనౌన్స్ అయ్యింది. సంక్రాంతి బరిలో ఈ సినిమా భారీ హిట్ కొడితే, అనిల్ రావిపూడి కెరీర్ మరింత బలపడుతుంది. చిరంజీవికి కూడా మాస్ ప్లస్ కామెడీ మిక్స్ ఉన్న సినిమాలే ఎక్కువగా వర్కౌట్ అవుతాయి. ఇది హిట్ అయితే, భవిష్యత్తులో చిరు కూడా మరిన్ని లైట్‌హార్టెడ్ ఎంటర్‌టైనర్స్‌పై దృష్టి పెట్టే అవకాశం ఉంది. ఇక ఈ ప్రాజెక్టు తో అనిల్ ఇండస్ట్రీలో గేమ్ ఛేంజర్ గా నిలుస్తాడో లేదో చూడాలి.



## కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి ఫైర్, ఎస్.డి.ఆర్.ఎఫ్., పర్యవేక్షణలో మాక్ డ్రిల్

### కడప హెచ్పిసిఎల్ విడిపిఎల్ చైనేజ్ పైప్ లైన్-391 డ్యామేజ్, లీకేజ్ ప్రాంతంలో ఆఫ్ సైట్ ఎమర్జెన్సీ మాక్ డ్రిల్ విజయవంతం

# ఎలాంటి విపత్తులనైనా ఎదుర్కొనేందుకు సంసిద్ధం!

కడప(విజయ సారథి):దైనందిన జీవితంలో వాణిజ్య ప్రాంతాలు, పరిశ్రమలు, ఇంధన పైప్ లైన్, పలు రసాయనాలు ఉత్పాదక కేంద్రాల్లో ఊహించని ఎలాంటి విపత్కర ప్రమాదాలనైనా తక్షణమే ఛేదించేందుకు జిల్లా విపత్తుల నిర్వహణ, ఫైర్ సిబ్బంది అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పటిస్తూ ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ఎల్లవేళలా అప్రమత్తంగా ఉన్నామని కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి పేర్కొన్నారు. 54 జాతీయ భద్రతా వారోత్సవాల సందర్భంగా శుక్రవారం కడప నగర శివారు ప్రాంతం బలిజపల్లి పరిధిలోని హెచ్.పి.సి.ఎల్. (హిందూస్తాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్) కు సంబంధించిన విడిపిఎల్ (విజయవాడ - ధర్మపురీ పైప్ లైన్) చైనేజ్ పైప్ లైన్ - 391 వద్ద నిర్వహించిన ఈ.ఆర్.డి.ఎం.పి. ఆఫ్ సెట్ మాక్ డ్రిల్ కార్యక్రమం విజయవంతంగా జరిగింది. డ్యామేజ్, లీకేజీ సమయంలో ఎలాంటి భద్రతా చర్యలు చేపట్టాలి అన్న విషయంపై జిల్లా విపత్తుల నిర్వహణ శాఖ, ఎస్.డి.ఆర్.ఎఫ్., హెచ్.పి.సి.ఎల్. సేఫ్టీ ఆఫీసర్ అధికారుల పర్యవేక్షణలో ఈ మాక్ డ్రిల్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి నోడల్ ఆఫీసర్, మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి హాజరై.. ఫ్యూయల్ లీకేజీ అక్కడ ప్రమాద విపత్కర పరిస్థితులను.. ఎస్.డి.ఆర్.ఎఫ్., జిల్లా ఫైర్ సేఫ్టీ సిబ్బంది, రెస్క్యూ టీమ్ బలగాలు ఛేదించగలిగిన అంశాలు, సహాయక, పునరావాస చర్యల ప్రత్యక్ష ప్రయోగాల్లో పాల్గొన్నారు. అనంతరం కడప మున్సిపల్ కమిషనర్ మనోజ్ రెడ్డి మాట్లాడుతూ.. జిల్లాలో విపత్తులను సమర్ధవంతంగా ఎదుర్కొనేందుకు చేపట్టాల్సిన ముందస్తు చర్యలను, మాక్ ఎక్స్ పర్ మెంట్ ద్వారా ప్రజలకు అవగాహన కల్పించే ఉద్దేశ్యం తోనే.. జిల్లా కలెక్టర్ వారి ఆదేశాల మేరకు.. ఆఫ్ సైట్ ప్రయోగాన్ని ఒక ఎస్.ఓ.పి. ప్రకారం నిర్వహించడం జరిగిందన్నారు. ఈ ప్రయోగాలు.. భవిష్యత్తులో ఎపుడైనా అనుకోని పరిస్థితుల్లో ప్రమాదాలు జరిగితే.. ఎదుర్కొనే ధైర్యాన్ని, స్ఫూర్తిని నింపి.. ప్రతి ఒక్కరిలో సామాజిక బాధ్యతను గుర్తు చేసాయన్నారు. ఇలాంటి ప్రయోగాల ద్వారా.. సమాజంలో అవగాహన పెంచడంతో పాటు.. భారీ మొత్తంలో ప్రాణనష్టం, ఆస్తి నష్టాలను అరికట్టవచ్చన్నారు. జిల్లాలో ఇలాంటి మాక్ డ్రిల్ మొట్టమొదటగా నివహించి విజయవంతం చేయడం అభినందనీయం అన్నారు. ఇలాంటి ప్రజా ఉపయోగ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వేదికగా మారిన హెచ్ పిసిఎల్ వారికి ధన్యవాదాలు తెలుపుకుంటున్నామన్నారు. అందులో భాగంగా.. పెట్రోలు, డీజిల్ ఉత్పాదక, సరఫరా, ఫిల్లింగ్ ప్రాంతాల్లో జరిగే ప్రాంతాల్లో.. అనుకోని పరిస్థితుల్లో ఎదురయ్యే ప్రమాదాలను జిల్లా విపత్తుల స్పందన, అగ్నిమాపక బృందాలు నియంత్రించలేని పరిస్థితుల్లో.. ఎస్.డి.ఆర్.ఎఫ్. సహకారం ఎలా తీసుకోవాలి ? అతి తక్కువ సమయంలో వారి సహాయక చర్యలు ఎలా పొందగలం అన్న విషయాలను, గత అనుభవాలను వివరిస్తూ.. ప్రతి ఒక్కరూ ప్రమాదాలు, విపత్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో సూచించారు. ఎక్కడైనా ప్రమాదాలు జరిగితే.. మనకు తోచిన సహాయ సహకారాలు అందించేందుకు సంసిద్ధంగా ఉండాలన్నారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తిని కాపాడేందుకు హోదాను మరిచి మానవత్వంతో సహాయం అందించాలన్నారు. అందుకోసం ప్రతి ఒక్కరూ.. ప్రమాద ఘటనలను ఎలా ఎదుర్కోవాలనే అంశాలపై అవగాహన పెంచుకోవాలన్నారు. విపత్తుల నిర్వహణ చర్యలపై అవగాహన పెంచుకుని.. అనుకోని పరిస్థితుల్లో కలిగే ప్రమాదాలను అరికట్టడంలో తమవంతు సామాజిక బాధ్యతను స్వీకరించాలన్నారు.×× డిప్యూటీ చీఫ్ ఇన్స్పెక్టర్ ఫ్యాక్టరీస్ కృష్ణమూర్తి మాట్లాడుతూ.. ఎస్.డి.ఆర్.ఎఫ్. బలగాలు, 108, 104 మెడికల్ సిబ్బంది చేపట్టిన ఈ మాక్ డ్రిల్ ప్రదర్శన గ్యాస్, పెట్రోల్, డీజిల్ ఫిల్లింగ్, సరఫరా పైప్ లైన్ పరిసర ప్రాంతాలు, సంబంధిత పరిశ్రమల్లో సిబ్బందికి, యాజమాన్యానికి, కార్మికులకు ఎంతో ఉపయోగపడుతుందన్నారు. భవిష్యత్తులో పబ్లిక్ ప్రదేశాల్లో కూడా.. జిల్లా కలెక్టర్ వారి సహకారంతో ఇలాంటి అవగాహనా కార్యక్రమాలు చేపడుతామన్నారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక శ్రద్ధతో.. చేపట్టిన ఇలాంటి మాక్ ఎక్సర్ సైజ్ కార్యక్రమంలో.. స్థానిక ప్రజలు, సంబందిత శాఖల జిల్లా అధికారులు, సామాజిక సేవా కార్యకర్తలు, స్థానిక సంస్థల ప్రతినిధులు భాగస్వామ్యం కావడం అభినందనీయం అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రమాద ఘటనలో నివారణోపాయాలకు ఉపయోగించే పరికరాల పరిశీలన, ప్రమాద కారకాలను గుర్తించే డిటెక్టర్ టీమ్ తనికీల ప్రక్రియలను ఎస్.డి.ఆర్.ఎఫ్. సేఫ్టీ అధికారులు అత్యంత ప్రావీణ్యతతో చేపట్టడం జరిగింది. అలాగే.. ఇంధనం (డీజిల్) లీకేజీలను గుర్తించే పద్ధతులను ఉపయోగించడం, లీకేజీ, ఫైర్, భయాందోళన కారణంగా అస్వస్థతకు గురైన పలువురిని.. సమీపంలోని బలిజపల్లిలో ఏర్పాటు చేసిన ఎమర్జెన్సీ మెడికల్ క్యాంపుకు, జీజీహెచ్ క్యాజువాలిటీకి అంబులెన్స్ వాహనాల ద్వారా తరలించడం, ప్రభావిత ప్రాంతాన్నంతా డీ కంటామినేట్ చేయడం, డీజిల్ పైప్ లైన్ లీకేజీలను గుర్తించి వెంటనే ఎలా నిరోధించడం, అక్కడ జరిగిన జరిగిన సంఘటన పట్ల భయాందోళన, దుష్ప్రచారం జరగకుండా.. ఐపీఆర్ శాఖ మీడియాను సమన్వయం చేయడం వంటి ప్రక్రియలు.. దాదాపు ఒక్క గంట 20 నిమిషాల పాటు నిర్వహించిన ఆఫ్ సెట్ మాక్ డ్రిల్ చూపరులకు గొప్ప అనుభూతిని ఇచ్చాయి. ఈ కార్యక్రమంలో.. హెచ్పీసీఎల్ కలకడ బూస్టర్ స్టేషన్ చీఫ్ స్టేషన్ మేనేజర్ ఎం శ్రీనివాసరావు, కడప డిప్యూటీ జెనెరల్ మేనేజర్ ఓబయ్య, మేనేజర్ పి. శ్రీకాంత్, సీనియర్ మేనేజర్లు జె. నాగార్జున రావు, గౌతమ్ కుమార్, హెచ్పి సీఎల్ అధికారులు ఎస్వీ సుబ్రహ్మణ్యం, నవీన్, మిథిలేష్ కుమార్ తదితర అధికారులు, సిబ్బంది చక్కటి సమన్వయ సహకారాలతో ఆఫ్ సెట్ మాక్ డ్రిల్ చక్కగా నిర్వహించడం జరిగింది. ఏపీఎస్పిడిసిఎల్ ఈఈ రమణ, హెచ్పిసిఎల్ డీజీఎం ఓబయ్య, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఈఈ సుధ, సమాచార పౌర సంబంధాల శాఖ పిఆర్వో రవికుమార్, జిల్లా అసిస్టెంట్ ఫైర్ అధికారి అన్వర్ బాషా, ఆఫ్ సెట్ మాక్ డ్రిల్ పర్యవేక్షకులు, ఆక్సిలరీ, కంబాట్, రెస్క్యూ, కమ్యూనికేషన్ టీమ్స్, కామాండ్ టీమ్స్, వైద్య సిబ్బంది, హెచ్ పిసిఎల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ప్రధానమంత్రి జన ఔషధ మందులను సద్వినియోగం చేసుకోండి

### జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా




నంద్యాల(విజయ సారథి):ప్రధానమంత్రి జనరిక్ ఔషధ మందుల దుకాణాల ద్వారా తక్కువ ధరకే లభ్యమయ్యే నాణ్యమైన మందులను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అన్నారు. కేంద్ర ప్రభుత్వ జన ఔషధ దివస్ సందర్భంగా శుక్రవారం నంద్యాల పట్టణంలోని రైతు నగర్ లోని జనరిక్ మందుల దుకాణాన్ని కలెక్టర్ పరిశీలించారు. ×ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ప్రధానమంత్రి జన ఔషధ కేంద్రాల ద్వారా తక్కువ ధరకే బ్రాండెడ్ కంపెనీల మందులను అందుబాటులో ఉంచుతుందని వీటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలకు అవసరమైన మంచి బ్రాండెడ్ కంపెనీల ద్వారా తయారుచేసిన మందులను జనరిక్ మందుల దుకాణాల్లో ఉంచడం జరుగుతుందన్నారు. సాధారణంగా బిపి, షుగర్ ఉన్నవాళ్లకి ఇతర షాపుల్లో నాలుగైదు వేల రూపాయలు అయ్యే మందులు జనరిక్ మందుల దుకాణంలో అతి తక్కువ ధరకే మందులు లభ్యమవుతాయన్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పథకం ద్వారా ప్రజలకు ఎంతో మేలు చేకూరుతుందన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి వైద్య విద్య రంగానికి అధిక ప్రాధాన్యతనిస్తున్నారన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా. వెంకటరమణ కలెక్టర్ వెంట ఉన్నారు ఉన్నారు.

# హిదూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి

### :రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు

కాకినాడ (విజయ సారథి):హిందూ ధర్మ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని, విశ్వహిందు ధర్మ పరిరక్షణ రామసేన అధ్యక్షులు, బీజేపీ నాయకులు కంబాల శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం జగ్గంపేట మండలం కాట్రావులపల్లి గ్రామంలో జరిగిన శ్రీశ్రీదేవి శ్రీ భూదేవి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయ పునఃనిర్మాణం మరియు ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమంలో కంబాల శ్రీనివాసరావు పాల్గొన్నారు. తొలిత ఆయనకు ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందంర్భంగా కంబాల శ్రీనివాసరావు మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి ఆలయ నిర్మాణానికి 1,00,000 లక్ష రూపాయలు విరాళాన్ని ప్రకటించారు. ఇతర మతాలను గౌరవిస్తూ హిందూవులందరూ కలిసికట్టుగా ఉండి, మన ధర్మాన్ని పరిరక్షించుకోవడం కోసం కృషి చేయాలని కోరారు. రంపచోడవరం, జగ్గంపేట, రాజానగరం మూడు నియోజకవర్గంలోని ప్రజలకు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, విద్య, వైద్యా, ఆర్థిక పరంగా వేలాదిమందికి సహాయం చేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో రామసేన సభ్యులు, బీజేపీ నాయకులు వరసాల ప్రసాద్, రాయపాటి గోవిందు, దేశాల నరేష్, పసల గణేష్, ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు..



# జాతీయ రహదారి భూసేకరణ పనులు పూర్తి చేయండి

### జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

కడప(విజయ సారథి):జిల్లాలో జాతీయ రహదారులకు సంబంధించి భూసేకరణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ బోర్డు మీటింగ్ హాల్ లో జాతీయ రహదారి భూసేకరణ పురోగతి పనులపై రెవెన్యూ, జాతీయ రహదారి అధికారులు తో జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ తో కలసి జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి మాట్లాడుతూ... జాతీయ రహదారి భూసేకరణకు సంబంధించి జిల్లాల్లో పెండింగ్ లో ఉన్న సమస్యలన్నిటిని ప్రాధాన్యత క్రమంలో త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జాతీయ రహదారులు నిర్మాణంకు ఎంతో ప్రాదాన్యతనిస్తున్న దృష్ట్యా జిల్లాలో నిర్మితమవుతున్న పలు ప్రాజెక్టుల జాతీయ రహదారుల భూసేకరణకు సంబంధించి అవరోధాలను అధికమించి పనులు వేగవంతం చేయాలన్నారు. దీనికి సంబంధించి రెవిన్యూ డివిజనల్ అధికారులు, తహశీల్దార్లు, జాతీయ రహదారుల అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. జాతీయ రహదారి భూసేకరణ పనుల త్వరితగతిన పూర్తవడానికి ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కార్యాచరణ ప్రణాళిక రూపొందించుకొని పూర్తి చేయాలన్నారు. జాతీయ రహదారి భూసేకరణ పెండింగ్ పనులు సంబంధిత ఆర్డీఓ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. టైటిల్ వివాదాలు,రెవిన్యూ భూ వివాదాలకు సంబంధించి ఓపెన్ ఫోరం ఏర్పాటు చేసి గ్రామాల వారిగా ప్రజలతో మాట్లాడి భూ సమస్యలను పరిష్కరించాలన్నారు. భూ సేకరణ చట్టం, పెండింగ్ ఆర్అఆర్ సమస్యలపై అధికారులకు పలు సూచనలు చేశారు. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో ఆటంకాలు రాకుండా త్వరితగతిన పూర్తి చేసేందు చర్యలు తీసుకోవాలని అన్నారు. తొలుత జాయింట్ కలెక్టర్ అదితి సింగ్ జాతీయ రహదారి భూసేకరణ పనుల పురోగతి పై ఆయా పనుల వారిగా అధికారులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో నేషనల్ హైవేస్ స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటపతి, ఎన్ హెచ్ ఏ ఐ ప్రాజెక్ట్ డైరెక్టర్ కృష్ణ రెడ్డి, ఆర్ అండ్ బి ఈఈ నేషనల్ హైవేస్ అధికారులు, పులివెందుల ఆర్టీవో చెన్నయ్య, జమ్మలమడుగు ఆర్డిఓ సాయి శ్రీ,,బద్వేల్ ఆర్డిఓ చంద్రమోహన్, ఆర్డబ్ల్యూఎస్ ఎస్ ఈ ఏడుకొండలు కలెక్టరేట్ సెక్షన్ అధికారులు, తదితర అధికారులు పాల్గొన్నారు.



# శ్రీకాకుళం నగరం తూర్పు మండల బిజెపి అధ్యక్షురాలిగా కనుగుల లలిత కుమారి

### ప్రకటించిన జిల్లా సహ ఎన్నికల అధికారి చల్లా వెంకటేశ్వర రావు



శ్రీకాకుళం(విజయ సారథి):భారతీయ జనతా పార్టీ సంస్థాగత ఎన్నికలలో భాగంగా, ఈ రోజు శ్రీకాకుళం నగరం ఈస్ట్ మండల బిజెపి అధ్యక్షురాలిగా కనుగుల లలిత కుమారిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లుగా జిల్లా సంస్థాగత సహ ఎన్నికల అధికారి, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వర రావు తెలిపారు. పోలింగ్ బూత్ అధ్యక్షులు, క్రియాశీల సభ్యులు, జిల్లా కోర్ కమిటీ సభ్యుల సమక్షంలో జరిగిన ఎన్నికల ప్రక్రియలో బిజెపి జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వర రావు, బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు, రాష్ట్ర సెల్స్ మరియు డిపార్టుమెంట్స్ కో-కన్వీనర్ పైడి వేణుగోపాలం, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అట్టాడ రవిబాబ్జి, జాతీయ కౌన్సిల్ సభ్యుడు చల్లా వెంకటేశ్వర రావు, మాజీ జిల్లా అధ్యక్షుడు బిర్లంగి ఉమామహేశ్వర రావు, జిల్లా ప్రధాన కార్యదర్శి చింతపల్లి దుర్గారావు గాంధి, ఒబిసి మోర్చా జిల్లా అధ్యక్షుడు గొలివి కరుణాకరరావు, మాజీ మండల అధ్యక్షుడు పూజారి చెల్లయ్య, డా. పైడి సింధూర, కద్దాల శ్యామ సుందర రావు, చింతపల్లి విజయ, బలివాడ వెంకట జాహ్నవి, విజయ సారథి, కలగదండు అప్పలసూరి, తాతారావు, కనుగుల ఝాన్సీ తదితరులు పాల్గొన్నారు. చల్లా వెంకటేశ్వర రావుబిజెపి శ్రీకాకుళం జిల్లా సహ ఎన్నికల అధికారిబిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యుడు

# ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ ఎన్నికలు

### జనసేన తరఫున నాగబాబు నామినేషన్

### నాగబాబు అభ్యర్థిత్వాన్ని సమర్థించిన లోకేశ్

అమరావతి,మార్చి 7: ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ అభ్యర్థిగా జనసేన ప్రధాన కార్యదర్శి, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ సోదరుడు నాగబాబు నామినేషన్ దాఖలు చేశారు. నాగబాబు అభ్యర్థిత్వాన్ని మంత్రి నారా లోకేశ్, బీజేపీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు బలపరిచారు. రిటర్నింగ్ అధికారిణి వనితా రాణికి నాగబాబు తన నామినేషన్ పత్రాలు సమర్పించారు. నామినేషన్ కార్యక్రమంలో మంత్రి నాదెండ్ల మనోహర్ సహా ఎమ్మెల్యేలు కొణతాల రామకృష్ణ, బొలిశెట్టి శ్రీనివాస్ పాల్గొన్నారు.

# సూరంపాలెం ప్రాజెక్ట్ నీటి ఎద్దడిని పరిశీలించిన జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ



కాకినాడ(విజయసారథి):తూర్పుగోదావరి జిల్లా గోకవరం నీటి ఎద్దడితో వెలవెలబోయిన సూరం పాలెం ప్రాజెక్టును పరిశీలించిన జగ్గంపేట శాసనసభ్యులు, టీటీడీ బోర్డు మెంబర్ జ్యోతుల నెహ్రూ గోకవరం మండలంలో సూరంపాలెం ఆయకట్టు పరిధిలోని పంట పొలాలు నీటి ఎద్దడితో కటకటలాడుతున్నాయి. ఆరుగాలం పండించిన పంట చేతికొచ్చే సమయానికి నీరు అందకపోవడంతో రైతాంగమంతా ఆవేదనకు గురవడం జరిగింది. స్థానిక రైతాంగ కష్టనష్టాలపై ఎమ్మెల్యే నెహ్రూ స్వయంగా పరిశీలన చేశారు. గత ప్రభుత్వంలో అభివృద్ధికి నోచుకోకుండా ఉన్నటువంటి ప్రాజెక్టులను ఆయన పరిశీలించడం జరిగింది. అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరం,రంపచోడవరం ఏజెన్సీ మండలాల్లో ఆయన పర్యటించారు. కారు గాని, ద్విచక్ర వాహనం కూడా వెళ్లలేని, నడవడానికి కూడా ఇబ్బందిగా ఉండే కాలవ మార్గాలను సైతం లెక్కచేయకుండా నీరు వచ్చే కాలువ మార్గాలను,వాటికున్న అడ్డంకులను అన్వేషించారు. సూరంపాలెం రిజర్వాయర్ కు నీటిని రప్పించే సాద్యాసాద్యాలపై ప్రాజెక్ట్ కు సంబంధించిన అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే నెహ్రూ మాట్లాడుతూ భూపతిపాలెం ప్రాజెక్టు నుండి సూరంపాలెం ప్రాజెక్టుకు 18 కిలోమీటర్లు మాత్రమే దూరమని సుమారు నలుగు కోట్ల రూపాయలు వెచ్చించితే సూరంపాలెం రైతాంగానికి ఇబ్బందులు ఉండమన్నారు. ఇదే విషయంపై ఇరిగేషన్ ఉన్నతాధికారులతో కలిసి కలెక్టర్ కు వినతిపత్రం అందించడం జరుగుతుందన్నారు. భూపతిపాలెం ఫేజ్-2 పూర్తి చేసుకోగలిగితే సూరంపాలెం రైతాంగానికి నీరు పుష్కలంగా అందుతుందన్నారు. అయితే ఇప్పుడు దాల్వా పంటను, మొక్కజొన్న పంటలను రక్షించుకోవడానికి తక్షణమే కాలువ పూడికతీత పనులను చేపట్టడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సూరంపాలెం ప్రాజెక్ట్ చైర్మన్ ఉంగరాల రాము, టిడిపి అధికార ప్రతినిధి ఎస్ఎస్ అప్పలరాజు, రాష్ట్ర ఆర్యవైశ్య బోర్డు మెంబర్ కొత్తా కొండబాబు, రాష్ట్రస్థాయి టిడిపి నాయకులు, జిల్లాస్థాయి, నియోజవర్గ, మండల స్థాయి టిడిపి, జనసేన,బిజెపి నాయకులు , స్థానిక రైతులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# శ్రీస్వామి వారి హుండీ లెక్కింపు మొత్తం రూ.62,73,741/-







కదిరి(విజయ సారథి):శ్రీమత్ ఖాద్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానము, కదిరి కి సంబందించిన హుండిల లెక్కింపు కార్యక్రమము 07.03.2025 వతేది శుక్రవారము లెక్కింపు పూర్తి అయినందున నగదుగా రు.62,73,741/-లు మొత్తము 47 రోజులు వచ్చినది. బంగారు 20 గ్రాములు, వెండి 340 గ్రాములు కలదు. విదేశి కరెన్సీ యూఎస్ఏ డాలర్స్ (అమెరికా)55 డాలర్లు హుండీల లెక్కింపు కార్యక్రమము ఆలయ కార్యనిర్వహణాధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి అధ్వర్యములో లెక్కింపు చేపట్టడమైనది. హుండీ లెక్కింపు పర్యవేక్షణాధికారిగా శ్రీ.యన్.ప్రసాద్, తనిఖీఅధికారి, దేవాదాయశాఖ, హిందూపురము డివిజన్ వారు హాజరు అయినారు. హుండి లెక్కింపు కార్యక్రమములో దేవస్థానము సిబ్బంది మరియు కెనరా బ్యాంకు, కదిరి మేనేజర్ శ్రీ.అనంత్ బాబు మరియు కెనరా బ్యాంకు సిబ్బందితో పాటు వివిధ సేవా సంస్థ సభ్యులు పాల్గొన్నారు.



# సాంస్కృతిక కార్యక్రమాలు

శ్రీశైలం(విజయ సారథి):దేవస్థానము నిర్వహిస్తున్న ధర్మపథంలో భాగంగా నిత్యకళారాధన కార్యక్రమంలో భాగంగా శుక్రవారం శ్రీసాయి నృత్యకళాశాల, నందికొట్కూరు వారిచే సంప్రదాయ నృత్య ప్రదర్శన కార్యక్రమం ఏర్పాటు చేయబడింది.ఆలయ దక్షిణ మాడవీధిలోని నిత్యకళారాధన వేదిక వద్ద ఈ రోజు సాయంకాలం నుండి. ఈ సంప్రదాయ నృత్య కార్యక్రమం నిర్వహించబడుతోంది.ఈ కార్యక్రమములో మహాగణపతిం, నమో నమో నటరాజ, అయిగిరినందిని, శివతాండవం తదితర గీతాలకు ఎం. అమృతవర్షిణి, ఎస్. అక్షయ్య, కె. వెంకటపూజిత, డి. సాయిలక్ష్మి, ఎన్. వరలక్ష్మి, జె. రామతులసి, బి. సర్వజ్ఞ తదితరులు నృత్యప్రదర్శన చేయనున్నారు.శ్రీస్వామిఅమ్మవార్లకు ఆయా కైంకర్యాలన్నీ పరిపూర్ణంగా జరగాలని మరియు ప్రాచీన సంప్రదాయ 580 పరిరక్షణలో భాగంగా ఈ నిత్యకళారాధన కార్యక్రమాలు నిర్వహించబడుతున్నాయి.

## అమ్మవారికి కొబ్బరికాయల సమర్పణ

శ్రీశైలం(విజయ సారథి):చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ లేదా శుక్రవారం రోజున ఏ రోజుముందుగా వస్తే ఆ రోజు శ్రీ భ్రమరాంబాదేవి అమ్మవారికి కుంభోత్సవం జరపడం సంప్రదాయం. ఈ సంవత్సరం ఏప్రిల్ 13 న ఈ కుంభోత్సవం నిర్వహించ˘బడుతుంది. అమ్మవారికి సాత్త్వికబలి నిర్వహించేందుకు (కొబ్బరికాయలు, గుమ్మడికాయలు, నిమ్మకాయలు, మొదలగునవి సమర్పించడం) ఈ కుంభోత్సవం జరిపించడం ఆనవాయితి.కుంభోత్సవం రోజున స్త్రీ వేషంలో ఉన్న పురుషుడు అమ్మవారికి కుంభహారతి సమర్పించడం ప్రధాన ఘట్టం.కాగా ఈ ఉత్సవాన్ని పురస్కరించుకుని మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు ముగిసిన వెంటనే ప్రతి మంగళవారం మరియు శుక్రవారం రోజులలో అమ్మవారికి కొబ్బరికాయలను సమర్పించడం జరుగుతోంది.ఇందులో భాగంగా శుక్రవారం అమ్మవారికి కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి.ఈ కార్యక్రమంలో ముందుగా అమ్మవారి ఆలయ ప్రదక్షిణ మండపంలో కొబ్బరికాయలను రాశిగా పోసి పసుపు,కుంకుమలతో వాటికి పూజాదికాలు జరిపించడం జరిగింది. తరువాత అమ్మవారికి ఈ కొబ్బరికాయలు సమర్పించబడ్డాయి.

## అంకాళమ్మ వారికి విశేష పూజలు

శ్రీశైలం(విజయ సారథి):లోక కల్యాణం కోసం శ్రీశైలక్షేత్ర గ్రామదేవత అయిన శ్రీ అంకాళమ్మవారికి శుక్రవారం ఉదయం అభిషేకం, విశేష పూజలను నిర్వహించడం జరిగింది.ప్రతి శుక్రవారం రోజున శ్రీఅంకాళమ్మ వారికి దేవస్థానం సేవగా, సర్కారిసేవగా ఈ విశేషపూజ జరిపించబడుతోంది.ఇందులో భాగంగా శ్రీ అంకాళమ్మవారికి అభిషేకం, విశేష అర్చనలు, పుష్పాలంకరణ, కుంకుమార్చనలు జరిపించబడ్డాయి.కాగా శ్రీశైల క్షేత్రానికి గ్రామదేవతగా చెప్పబడుతున్న అంకాళమ్మ ఆలయం, ప్రధాన ఆలయానికి ఎదురుగాగల రహదారికి చివరలో కుడివైపున ఉత్తరముఖంగా ఉంది.ప్రకృతి శక్తుల యొక్క కళలే గ్రామ దేవతలని దేవీభాగవతంలో చెప్పబడింది.కాగా ఈ ప్రకృతి అంతా ఆదిపరాశక్తి స్వరూపమేనని మన ఆర్షవాజ్ఞ్మయం చెబుతోంది.చతుర్భుజాలను కలిగిన ఈ దేవి నాలుగు చేతులలో కుడివైపున క్రింది నుండి పైకి వరుసగా కత్తి, సర్పంలో చుట్టబడిన ఢమరుకం ఉండగా, ఎడమవైపున పానపాత్ర, త్రిశూలం ఉన్నాయి. కిరీట ముకుటం గల ఈ దేవి వస్త్రాలంకురాలై కర్ణాభరణాలను, కంఠాభరణాలను కలిగి ఉంటుంది.కాగా కార్యక్రమం నిర్విఘ్నంగా జరిగేందుకు ముందుగా మహాగణపతిపూజ జరిపించబడింది.ఆ తరువాత లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సంకల్పాన్ని పఠించారు.అనంతరం పంచామృతాభిషేకం, హరిద్రోదకం, కుంకుమోదకం, గంధోదకం, పుష్పోదకం, విశేషఅభిషేకం అర్చన ను నిర్వహించబడ్డాయి.

# ఊయల సేవ

శ్రీశైలం(విజయ సారథి)లోకకల్యాణం కోసం దేవస్థానం శుక్రవారం సాయంత్రం శ్రీస్వామిఅమ్మవార్లకు ఊయల సేవను నిర్వహించనున్నది.ప్రతి శుక్రవారం రోజు మరియు పౌర్ణమి, మూలా నక్షత్రం రోజులలో ఈ ఊయల సేవ జరిపించ బడుతోంది.ఈ కార్యక్రమంలో భాగంగా ముందుగా లోకకల్యాణాన్ని కాంక్షిస్తూ అర్చకస్వాములు సేవా సంకల్పాన్ని పఠిస్తారు. తరువాత కార్యక్రమం నిర్విఘ్నంగా జరగాలని మహాగణపతిపూజ జరిపించబడుతుంది.అనంతరం ఊయలలో వేంచేబు చేయించిన శ్రీస్వామిఅమ్మవార్లకు శాస్త్రోక్తంగా షోడశోపచార పూజ జరిపించబడుతుంది. తరువాత చివరగా ఊయలసేవ నిర్వహించబడుతుంది.ఊయల సేవను పురస్కరించుకుని శ్రీస్వామిఅమ్మవార్లకు విశేషంగా పుష్పాలంకరణ, పుష్పార్చనలు జరిపించబడుతాయి...పుష్పాలంకరణకు గాను పలుపుష్పాలు వినియోగించడం జరుగుతుంది.

## పాడిపశువులకు దాణా కొరత

### ఎండుగడ్డి కోసం ఎదురుచూపు

చిత్తూరు,మార్చి7: పాలఉత్పత్తిలో జిల్లా దేశంలోనే ప్రథమస్థానంలో వుంది. అయితే దానికి తగ్గట్టుగా పాడి పశువులకు పశుగ్రాసం అందడం ఇబ్బందిగా ఉంది. జిల్లాలో పాడి రైతుకు అప్పుడే కష్టకాలం మొదలైంది. మార్చి ప్రారంభంలోనే ఎండుగడ్డికి కొరత ఏర్పడడంతో నాలుగైదు నెలల పరిస్థితి ఎలా ఉంటుందో అని పాడిరైతులకు ఆందోళన కల్గిస్తోంది. మార్చి నుంచి జూన్ వరకు ఉష్ణోగ్రతలు అధికంగా ఉండడంతో ఎండుగడ్డి కూడా దొరకని పరిస్థితి ఎదురవుతుంటుంది. రానున్న 90 రోజులకు అంటే మార్చి నుంచి మే నెలాఖరు వరకు పశుగ్రాసం అవసరం. పశుగ్రాసం కొరత తీర్చడానికిగాను రాష్ట్ర ప్రభుత్వం గత ఏడాది అమలు చేసిన పథకాలన్నీ ప్రస్తుతం అమలులో వున్నా నామమాత్రంగానే కొనసాగుతునాయి. పడమటి మండలాల్లో పశుగ్రాసం కొరత తీవ్రంగా వుంది. దాంతో తూర్పు ప్రాంతానికి చెందిన శ్రీకాళహస్తి, ఏర్పేడు, బీఎన్కండ్రిగ, వరదయ్యపాళెం తదితర మండలాలనుంచి ఎండుగడ్డిని లారీలు, ట్రాక్టర్లలో తెచ్చుకుంటున్నారు. అక్కడి వ్యాపారులు పడమటి మండలాలకు తీసుకొచ్చి ఒక ట్రాక్టరు ఎండుగడ్డి అమ్ముకుంటున్నారు. జిల్లాలో పశుగ్రాసం కొరతను తీర్చేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారులు ప్రభుత్వానికి నివేదిక పంపారు. జిల్లాలో పశువులకు అవసరమైన వరిగడ్డి, పచ్చిగడ్డికి ప్రత్యామ్నాయంగా పాతరగడ్డి, దాణామృతం రాయితీపై పంపిణీ చేయనున్నట్లు అధికారులు తెలిపారు.

# ఎంఎస్ఎంఈ(సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు) ల ఏర్పాటుకు మహిళలు ముందుకు రావాలి

బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు అభివృద్ధి చెందాలి:జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా

యూనియన్ బ్యాంకు ఆధ్వర్యంలో ఎంఎస్ఎంఈ మెగా ఔట్ రీచ్

కర్నూలు(విజయ సారథి):ఎంఎస్ ఎంఈ (సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమలు) ల ఏర్పాటుకు మహిళలు ముందుకు రావాలని, బ్యాంకు రుణాలను సద్వినియోగం చేసుకుని మహిళలు అభివృద్ధి చెందాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా మహిళలకు సూచించారు.శుక్రవారం మౌర్య ఇన్ హోటల్ పరిణయ హాల్ లో యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏర్పాటు చేసిన మెగా ఎం ఎస్ ఎం ఈ మెగా ఔట్ రీచ్ ప్రోగ్రాం లో జిల్లా కలెక్టర్ ముఖ్య అతిథిగా పాల్గొని మహిళలను ఉద్దేశించి మాట్లాడారు..కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా మహిళలు బ్యాంకు రుణాలను పొంది అభివృద్ధి పొందాలని కలెక్టర్ మహిళలకు సూచించారు. అలాగే మహిళల అభివృద్ధికి బ్యాంకులు చేయూత ఇవ్వాలని కలెక్టర్ బ్యాంకర్లను కోరారు..రాష్ట్ర ప్రభుత్వం ఎంఎస్ ఎంఈ ల ఏర్పాటుకు అధిక ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు..యూనియన్ బ్యాంక్ ఎంఎస్ఎంఈ మెగా ఔట్ రీచ్ కార్యక్రమం ద్వారా యువత,మహిళలను పారిశ్రామిక రంగం వైపు ప్రోత్సహించడం అభినందనీయం అని కలెక్టర్ పేర్కొన్నారు..బ్యాంకు రుణాలు పొందిన తర్వాత వాటిని తిరిగి చెల్లించడం లోనూ క్రమశిక్షణ అవసరం అని కలెక్టర్ మహిళలకు సూచించారు..మహిళలు ఆర్థిక పరిపుష్టి సాధించడమే రాష్ట్ర ప్రభుత్వ ఉద్దేశ్యం అని కలెక్టర్ పేర్కొన్నారు..రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో మార్చి 8 వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా దాదాపు రూ.130 కోట్ల రుణాలు, ఇతర లబ్ధికి సంబంధించి మెగా చెక్కులను మహిళలకు అందచేయనున్నామని కలెక్టర్ వివరించారు..ఈ సందర్భంగా ఎస్.హెచ్.జి. గ్రూపులకు మంజూరైన రుణాలు రూ.35 కోట్ల కు సంబంధించి మెగా చెక్కును కలెక్టర్ మహిళా సంఘ సభ్యులకు అందచేశారు.అలాగే వివిధ పథకాల కింద రుణాలకు సంబంధించి మంజూరు ఉత్తర్వులను లబ్దిదారులకు అందచేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ బ్యాంక్ రీజనల్ హెడ్ నరసింహారావు, జనరల్ మేనేజర్ సుధాకర్ రావు, పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ అరుణ, మెప్మా పిడి నాగ శివ లీల, ఏపీఐఐసీ జెడ్ ఎం మధుసూదన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మహిళా ఉద్యోగులను లైంగిక వేధింపులకు గురి చేస్తే చర్యలు తప్పవు

కలెక్టరేట్ లో షి బాక్స్ ఏర్పాటువేధింపులకు గురి చేస్తే ఫిర్యాదు చేయాలి

జిల్లా కలెక్టర్ పి రంజిత్ బాషా




కర్నూలు(విజయ సారథి):పని ప్రదేశాల్లో మహిళా ఉద్యోగులను లైంగిక వేధింపులకు గురి చేస్తే చర్యలు తప్పవని కలెక్టర్ పి రంజిత్ బాషా పేర్కొన్నారు.శుక్రవారం స్థానిక కలెక్టరేట్ లో ఏపీజేఏసీ అమరావతి, కర్నూలు జిల్లా మహిళా విభాగం ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం వేడుకల సందర్భంగా కలెక్టరేట్ లో ఏర్పాటుచేసిన షి బాక్స్ ను జిల్లా కలెక్టర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ లైంగిక వేధింపులు ఎదుర్కొంటున్న మహిళా ఉద్యోగులు బహిరంగంగా చెప్పలేని సమక్షంలో షీ బాక్స్ లో ద్వారా ఫిర్యాదు చేయవచ్చని కలెక్టర్ సూచించా రు.. వేధింపులకు గురిచేసే వారిపై చర్యలు చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ బి నవ్య, డిఆర్ఓ వెంకట నారాయణమ్మ, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఏవో సింధు సుబ్రహ్మణ్యం, ఏపీ జెఎసిఅమరావతి జిల్లా అధ్యక్షులు .కె.వై.కృష్ణ మరియు మహిళా విభాగం ఛైర్‌పర్సన్ సహెరా బాను, శివ పార్వతి, ఏపీ ఆర్ ఎస్ ఏ ఉపాధ్యక్షులు ఏపీ జేఏసీ అమరావతి సహాఅధ్యక్షులు, పద్మావతి, జి ఎస్ ఏపీ జెఎసి అమ రావతి మహిళా విభాగం, మహిళల ప్రతినిధులుఅన్ని ప్రభుత్వ శాఖల మహిళాఉద్యోగులు పాల్గొన్నారు.

# షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగల వారికి ప్రభుత్వం నుండి అందే సహాయ సహాకారాలను పూర్తిస్థాయిలో అందేలా చూడాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్

అనంతపురం(విజయ సారథి):షెడ్యూల్ కులాలు, షెడ్యూలు తెగల వారికి ప్రభుత్వం నుండి అందే సహాయ సహాకారాలను పూర్తిస్థాయిలో అందేలా చూడాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో సాంఘిక / గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో షెడ్యూల్ కులాలు, షెడ్యూల్ తెగల కాంపోనెంట్ మానిటరింగ్ కమిటీ జిల్లా స్థాయి సమీక్ష సమావేశాన్ని సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ నిర్వహించారు.×- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ప్రభుత్వ పథకంలో 17.08 శాతం ఎస్సీలకు, 5.53 శాతం ఎస్టీలకు వ్యయానికి సంబంధించిన శాతం ఖర్చు చేసేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీలకు



అందించాల్సిన పథకాల లబ్ధి పూర్తిగా అందించాలని, ఇందులో ఎప్పటికప్పుడు పురోగతి ఉండాలన్నారు. ఆయా శాఖల పరిధిలో ఎస్సీ, ఎస్టీల అభివృద్ధికి ఎంత నిధులు ఖర్చు చేశారు అనేది ఫోటోగ్రఫీ ఎవిడెన్స్ కావాలన్నారు. ఆయా శాఖల పరిధిలో నియామకాల్లో లక్ష్యాన్ని పూర్తి చేశారా, రోస్టర్ రిజిస్టర్ మైంటైన్ చేస్తున్నారా అనేది సోషల్ వెల్ఫేర్ జెడి తనిఖీలు చేయాలన్నారు. ప్రత్యేకంగా ఒక గూగుల్ షీట్ తయారు చేయాలని, ఇందులో ఆయా శాఖలకు బడ్జెట్ ఎంత వచ్చింది, ఎంత ఖర్చు పెట్టారు, అనేది ఆధారాలతో నివేదికలు అందజేయాలని ఆదేశించారు.- ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, సోషల్ వెల్ఫేర్ జెడి రాధిక, డిటిడబ్ల్యూఓ రామాంజనేయులు, జడ్పి సిఈఓ రామచంద్రా రెడ్డి, డిసిఓ అరుణకుమారి, ఐసిడిఎస్ పిడి బియన్. శ్రీదేవి, సిపిఓ అశోక్ కుమార్, హౌసింగ్ పిడి శైలజ, డిఎంహెచ్ఓ డా.ఈబి.దేవి, సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి రామసుబ్బారెడ్డి, పీఆర్ ఎస్ఈ జహీర్ అస్లాం, జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ శ్రీధర్, డీఈవో ప్రసాద్ బాబు, ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈ శేషాద్రి శేఖర్, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, ఆయా శాఖల శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రత్తిపాడు లో ఘనంగా ప్రపంచ మహిళా దినోత్సవం.

కాకినాడ(విజయ సారథి): ప్రపంచ మహిళా దినోత్సవం పురస్కరించుకొని శుక్రవారం ప్రత్తిపాడు ఎంపీడీవో కార్యాలయంలో ఎంపీపీ జి. క్రాంతి సుధాకర్ అధ్యక్షతన మహిళ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ క్రాంతి సుధాకర్ మాట్లాడుతూ మహిళలు పురుషుల తో పాటు అన్ని రంగాల్లో రాణిస్తున్నారని ప్రతి మహిళ పురుషులతో పాటు సమాన హక్కులు ప్రభుత్వాలు కల్పిస్తున్నాయని రాజ్యాంగపరంగా మగ, ఆడ అనే తేడా లేకుండా సమాన హక్కులు కల్పించబడ్డాయని అన్నారు. పత్తిపాడు ఎండిఓ కుమార్ బాబు మాట్లాడుతూ ప్రపంచంలో మహిళలు పురుషుల కంటే దీటుగా పోటీపడి విజయం సాధిస్తున్నారని పేర్కొన్నారు. వివిధ రంగాల్లో సేవలందించిన మహిళలకు సన్మానం చేసి జ్ఞాపికలు అందజేశారు అనంతరం మహిళా ఉద్యోగులచేపోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శులు, మహిళా పోలీసులు, హెల్త్ సిబ్బంది, సచివాలయం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్నికల అనంతరం జరిగిన హింసకు సంబంధించిన కేసులపై 10 రోజుల్లోపు ఛార్జిషీట్ వేయాలి

జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్



అనంతపురం(విజయ సారథి):ఎన్నికల అనంతరం జరిగిన హింసకు సంబంధించిన కేసులపై 10 రోజుల్లోపు చార్జిషీట్ వేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్.వి, ఐ.ఏ.ఎస్ ఆదేశించారు. శుక్రవారం అనంతపురం కలెక్టరేట్ లోని జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో సాధారణ ఎన్నికలు- 2024 అనంతరం జరిగిన హింసపై సంబంధిత అధికారులతో జిల్లా ఎస్పీ పి.జగదీష్ తో కలిసి జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు.×- ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం జరిగిన హింస చాలా సున్నితమైన అంశమన్నారు. ఎన్నికల అనంతరం జరిగిన హింసకు సంబంధించి కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఎన్నికల అనంతరం జరిగిన హింసకు సంబంధించి తాడిపత్రిలో 7 కేసులు నమోదు కాగా, అందులో 5 కేసులుకు సంబంధించి చార్జిషీట్ ఫైల్ చేయడం జరిగిందని, 1 కేసు ఫాల్స్ కేసు అని, మరొకటి అండర్ ఇన్వెస్టిగేషన్ జరుగుతోందన్నారు. ఎలక్షన్ కమిషన్ పోర్టల్ ఓపెన్ కావడం జరిగిందని, చార్జిషీట్ దాఖలులో పోలీస్ వారికి అవసరమైన సంపూర్ణ సహకారం అందించాలని ఆర్డీఓ, తహసిల్దార్లను ఆదేశించారు.- ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ పి.జగదీష్ మాట్లాడుతూ ఎన్నికల అనంతరం జరిగిన హింసకు సంబంధించి కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకు సంబంధించి నమోదైన కేసులకు సంబంధించి త్వరితగతిన చార్జిషీట్ ఫైల్ చేయాలని పోలీసులను ఆదేశించారు.- ఈ సమావేశంలో డిఆర్ఓ ఏ.మాలోల, ఆర్డీఓ కేశవనాయుడు, కలెక్టరేట్ కోఆర్డినేషన్ సెక్షన్ సూపరింటెండెంట్ యుగేశ్వరి దేవి, ఎన్నికల విభాగం డిప్యూటీ తహసిల్దార్ కనకరాజ్, పోలీస్ శాఖ డిసిఆర్బి హరినాథ్, తాడిపత్రి టౌన్ సిఐ సాయికృష్ణ, తాడిపత్రి తహసీల్దార్ రజాక్ వలి, తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు సర్వశక్తిమంతులు

జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా

నంద్యాల(విజయ సారథి):జన్మతః స్త్రీలు శక్తివంతులు, సమర్థవంతులని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి పేర్కొన్నారు. శుక్రవారం కలెక్టర్ ఛాంబర్ లో అంతర్జాతీయ మహిళా దినోత్సవా సందర్భాన్ని పురస్కరించుకుని జిల్లా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలిసిన మీడియా విలేకర్లతో జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ మహిళలు ఉన్నతమైన వ్యక్తిత్వంతో పాటు ఆత్మాభిమానం కలిగి ఉంటారన్నారు. మహిళలు సర్వశక్తివంతులని కుటుంబ బాధ్యతలతో పాటు ఉద్యోగంలో వున్నా, వ్యాపార, రాజకీయ ఇతర రంగాలలో స్థిరపడాలన్నా... ఆయా రంగాలలో ఉత్తమ విజయాలు సాధించాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నానన్నారు. నిర్దేశించిన ఏ చిన్న పనైనా ప్రణాళిక బద్ధంగా నిర్వహించి 100 శాతం విజయం సాధించగలిగే సత్తా వారిలో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి స్త్రీ ఏదైనా రంగంలో పట్టు సాధించాలంటే సంబంధిత అంశంపై లోతైన విశ్లేషణ ఉండడంతో పాటు పదిమందికి స్ఫూర్తినిచ్చే విధంగా ప్రశ్నించే తత్వం కలిగి ఉండాలన్నారు. సమాజంలో స్థిరపడిన మహిళా పారిశ్రామికవేతలు వారు ఎదగడమే కాకుండా పదిమందికి ఉపాధి కల్పించే రీతిలో ఉండాలని కలెక్టర్ ఆకాంక్షించారు.నేటి తరం పిల్లలకు కూడా మంచి భవిష్యత్తు ఇవ్వాల్సిన బాధ్యత కూడా స్త్రీలపైనే ఉందని కలెక్టర్ అన్నారు. పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడంతోపాటు ఉన్నత శిఖరాలను అధిరోహించి పదిమందికి స్ఫూర్తిదాయకంగా ఉండేలా విద్యార్థులను ఆడపిల్లలను పెంచగలిగే స్థితికి మహిళలు రావాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. మగ పిల్లవాడు, ఆడపిల్ల అనే తారతమ్యం లేకుండా సమాన స్థాయిలో పెంచి ఉత్తమ పౌరులుగా దేశ, రాష్ట్ర భవిష్యత్తులో చక్కటి భాగస్వామ్యం పంచేలా పెంచాలని కలెక్టర్ సూచించారు. కొన్ని సందర్భాలలో మహిళలు అణగద్రొక్కబడి సమస్యలను చెప్పుకోలేని స్థితిలో ఉన్నారని అలాంటి వారికి కూడా సమాజం సహాయం అందించే స్థితిలో ఉండాలన్నారు. లింగ వ్యవస్థతపై చట్టాలు ఉన్నప్పటికీ నిరాశ్రయులైన అనాథ పిల్లలకి సమగ్ర శిశు సంరక్షణ కేంద్రాలు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు.

## ఆచారి ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలో అభ్యుదయ రైతులకు, సర్పంచులకు శిక్షణ తరగతులు.

కాకినాడ(విజయ సారథి): ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం కేంద్రం పెద్దాపురం వారు గండేపల్లి మండల పరిధిలోని 13 గ్రామాలకు చెందిన సర్పంచులకు అభ్యుదయ రైతులకు "ప్రతి గ్రామ పంచాయతీకి చేరువలో"కార్యక్రమంలో భాగంగా శిక్షణ కార్యక్రమాన్ని గండేపల్లి ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహిస్తూ వ్యవసాయ విశ్వవిద్యాలయం రైతులకు ఏ విధంగా పరిశోధన మరియు విస్తరణ ద్వారా చేయూతనందిస్తుందో ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్ ఏ సీతారామ శర్మ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ రూపంలో అభ్యుదయ రైతులకు మరియు సర్పంచులకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా గండేపల్లి ఎంపీపీ సిహెచ్. దొరబాబు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సద్గురుమూర్తి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

PRINTED, EDITED, PUBLISHED AND OWNED BY P.VENKATESWARLU, PRINTED AT PRAVEEN OFFSET PRINTERS, OLD BUSTAND, KURNOOL-518001 AP, PUBLISHED FROM HO.NO.45/403- 10, BHAGATSING NAGAR, KURNOOL AP, Cell : 9700370499, Email : vijayasarathi2010@gmail.com